చదువు
రూ॥ 180/-
పేజీలు: 210

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

బెంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పన్నాగం విఫలం

క్షేత్రస్థాయిలో అందరికీ మేలు చేసే చట్టం భూ భారతి!

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 146 | శనివారం | 26-04-2025 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత 05



'లష్కరే' టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం? 05

పత్తి కొనుగోళ్ల అవకతవకలపై మంత్రి ఆగ్రహం 03





# పిఒకెను భారత్‌లో కలపండి

## ప్రధాని మోదీకి సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- రాజకీయాలు, పార్టీ సిద్ధాంతాలు పక్కనపెట్టి తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి
- నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- ఉగ్రదాడులు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలి

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతిర్యాలీ**

ప్రజాపక్షం/హైదరాబాద్

''ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలపండి. మేమంతా మీ వెంట ఉన్నాం' అని ప్రధాని నరేంద్రమోదీని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. రాజకీయాలు, పార్టీ సిద్ధాంతాలు పక్కన బెట్టి తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మశాంతి కలగాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఇచ్చిన పిలుపు మేరకు టిపిసిసి పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం భారీ కొవ్వొత్తుల ప్రదర్శన, శాంతి ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, తరువాయి 2లో

ఎన్‌డిఎస్‌ఎ నివేదికతో

# బిఆర్‌ఎస్ సిగ్గుపడాలి



- లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుప్పకూలి పోయింది
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ పనికిరాకుండా పోయాయి
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదికను చూసి అప్పటి బిఆర్‌ఎస్ పాలకులు, పార్టీ నేతలు సిగ్గుపడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ తరువాయి 2లో



హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# ఎంఐఎం గెలుపు

- 38 ఓట్ల మెజరిటీతో విజయం సాధించిన మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి
- బిజెపి అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి విజయం సాధించారు. ఎంఐఎం అభ్యర్థికి 63 ఓట్లురాగా, బిజెపి అభ్యర్థి గౌతమ్ రావుకు 25 ఓట్లు వచ్చాయి. 38 ఓట్ల మెజార్టీతో ఎంఐఎం అభ్యర్థి గెలుపొందారు. క్రాస్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్న బిజెపికి నిరాశే ఎదురైంది. తమకున్న 25 ఓట్లు మాత్రమే బిజెపికి పోలయ్యాయి. ఎంఐఎంకు తరువాయి 2లో

శాంతి, అహింసా మార్గాల్లోనే

# గ్లోబల్ జస్టిస్

- ఘనంగా భారత్ సమ్మిట్ ప్రారంభం
- 100 దేశాల ప్రతినిధులు హాజరు
- సమ్మిట్‌లో రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించాం
- డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అహింస, సత్యం సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో 'భారత్ సమ్మిట్–2025' ద్వారా కాంగ్రెస్ పార్టీ దిశా నిర్దేశం చేస్తున్నదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రపంచంలో కోల్డ్ వార్ జరుగుతున్న సమయంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయిన సమయంలో కొన్ని దేశాలతో కలిసి ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానాన్ని తీసుకుని ప్రపంచానికి దిశా నిర్దేశం చూపారని గుర్తు తరువాయి 2లో




03

**ఐక్య కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారానే**

# సామ్రాజ్యవాద ఓటమి సాధ్యం

క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా

# సిఎంలకు అమిత్ షా ఫోన్

- స్థానికంగా ఉండే పాక్ జాతీయుల సమాచారం ఇవ్వండి
- గడువు ముగిసేలోగా భారత్‌లో ఉండకుండా చూడాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఏ ఒక్క పాకిస్థానీ కూడా భారత్‌లో ఉండడానికి వీలులేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. వారు దేశం విడిచి వెళ్లేందుకు విధించిన గడువు ముగిసే నాటికి ఏ ఒక్క పాకిస్థానీ కూడా భారత్ ఉండకుండా చూసుకోవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అమిత్ షా ఫోన్ చేసినట్లు వర్గాలు తెలిపాయి. జమ్మకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఈనెల 22న పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీంతో ఈనెల 27 నుండి పాకిస్తానీ జాతీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు వీలైనంత త్వరగా స్వదేశానికి తిరిగి వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే హోంమంత్రి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి, గడువు ముగిసే నాటికి పాకిస్తానీ కూడా భారతదేశంలో ఉండకుండా చూసుకోవాలని కోరారు. స్థానికంగా ఉంటున్న పాకిస్థాన్ జాతీయులను గుర్తించి, వారి వివరాలను కేంద్రానికి పంపాలని అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశముంటుందని చెప్పినట్లు వర్గాలు తెలిపాయి. హిందూ పాకిస్తానీ జాతీయులకు ఇప్పటికే జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలకు రద్దు వర్తించదు. అవి చెల్లుబాటులోనే ఉండనున్నాయి. 26/11 ముంబయి ఉగ్రవాద దాడి తర్వాత దేశంలోని పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రవాద దాడి పహల్గామ్‌లో జరిగిందని, సరిహద్దు సంబంధాల కారణంగా పాకిస్తాన్ జాతీయులకు వీసా తరువాయి 12లో

హైదరాబాద్‌లో

# 208 మంది పాక్ పౌరులు

సెర్చ్ ఆపరేషన్‌లో గుర్తించిన పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణలో నివాసముంటున్న పాకిస్తాన్ పౌరుల కోసం రాష్ట్ర పోలీసులు వేట మొదలు పెట్టారు. వీసాపై వచ్చిన వారి వివరాలను కూడా అన్ని జిల్లాలలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం 208 మంది పాకిస్తాన్ దేశానికి చెందిన వారు ఉన్నారని గుర్తించారు. వీరిలో 156 మందికి దీర్ఘకాలిక విసా ఉంది. వీరందరికి వారం రోజుల్లో దేశం వదిలి పోవాలని నోటీసులు తరువాయి 2లో

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా

# ఐకమత్యమే ముఖ్యం

- సమాజాన్ని విభజించడమే ఉగ్రవాదుల పని : రాహుల్
- కశ్మీర్‌కు వెళ్లిన ప్రతిపక్షనేత
- పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు పరామర్శ
- ఉగ్రదాడిని యావత్‌దేశం ఖండించిందని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** దేశ ప్రజలను విభజించడమే పహల్గామ్ ఉగ్రవాద దాడి వెనుక ఉన్న ఆలోచన అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయులంతా ఐక్యంగా ఉండడం అవసరమని, ద్వారానే ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అంతమొందించగలమని పేర్కొన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఒక భయంకరమైన విషాద ఘటన అని, ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడానికి, సహాయం చేయడానికే తాను జమ్మకశ్మీర్ వచ్చానన్నారు. ఉగ్రదాడిని యావత్ జమ్మకశ్మీర్ ఖండించిందన్నారు. వీరికి దేశం మొత్తం పూర్తిగా మద్దతు నిలిచిందని రాహుల్‌గాంధీ చెప్పారు. శుక్రవారం శ్రీనగర్‌కు చేరుకున్న రాహుల్ ఉగ్రదాడి బాధితులను పరామర్శించేందుకు బాదామి బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం తరువాయి 2లో

# సంయమనం పాటించండి

భారత్–పాకిస్థాన్‌లకు ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి

న్యూయార్క్ : సంయమనం పాటించాలని భారత్ – పాకిస్థాన్ దేశాలకు ఐక్యరాజ్య సమితి శుక్రవారం నాడు విజ్ఞప్తి చేసింది. దక్షిణ కశ్మీరు అనంతనాగ్‌జిల్లా పహల్గామ్ సమీపంలో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రవాదులు దాడిచేసి 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన తర్వాత రెండు దేశాల మధ్యా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇక ముందుకు వెళ్ళవద్దని, పరిస్థితి చేయిదాటిపోయే వరకూ తీసుకువెళ్ళవద్దని ఐక్యరాజ్యసమితి రెండు దేశాలకు విజ్ఞప్తి చేసింది. ఈ ఘటనతో రెండు దేశాలమధ్య సంబంధాలు అత్యంత దారుణస్థాయికి తరువాయి 12లో

వక్ఫ్ సవరణ చట్టంపై..

# 'బ్లాంకెట్ స్టే' సరికాదు

- 'సుప్రీం'కు దాఖలుచేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో కేంద్రం
- సమగ్ర, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం తర్వాతే వక్ఫ్ చట్టానికి సవరణలు చేశామని వెల్లడి

**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం–2025ను శుక్రవారం కేంద్రం సుప్రీంకోర్టులో సమర్థించుకుంది. పార్లమెంట్ ఆమోదించిన రాజ్యాంగబద్ధత కలిగి ఉన్న చట్టంపై కోర్టు ద్వారా' బ్లాంకెట్ స్టే'ను విధించడం సమంజసం కాదని వ్యతిరేకించింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో వక్ఫ్ సవరణలను కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. మత స్వేచ్ఛకు తరువాయి 12లో

# కర్రెగుట్టల్లో... అలజడి

- నక్సల్‌కోసం డ్రోన్లు,హెలికాప్టర్లతో వేట
- 10 వేలమంది భద్రతా సిబ్బందితో గాలింపు చర్యలు
- ఐదోరోజూ కొనసాగిన ఆపరేషన్




**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లో వరుసగా ఐదురోజు శుక్రవారంనాడు కూడా నక్సలైట్లకోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగాయి. హెలికాప్టర్లు, డ్రోన్లను ఈ గాలింపు చర్యల్లో ప్రధానసాధనాలుగా ఉపయోగిస్తున్నారు. 10,000 మంది భద్రతా సిబ్బంది ఉధృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. నిషేధిత సిపిఐ (మావోయిస్టు)కు చెందిన అగ్రనాయకులతోపాటు సుమారు 500 మంది నక్సలైట్లు కర్రెగుట్టల్లో ఉన్నట్లు పోలీసులు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ గాలింపు చర్యలకు తెలంగాణ పోలీసులు తమ పూర్తిసహకారం అందిస్తున్నారు. పరిస్థితులను పర్యవేక్షిస్తున్న అధికారి ఒకరు ఈవిషయంపై మాట్లాడారు. బస్తర్ ప్రాంతంలో నక్సలైట్ల ఏరివేతకోసం చేపట్టిన ఇది అతిపెద్ద గాలింపు కార్యక్రమం అని ఆయన అన్నారు. జిల్లా రిజర్వు గార్డులు, బస్తర్ ఫైటర్లు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రత్యేక కర్తవ్య నిర్వహణా బృందాలకు చెందిన పోలీసులు, సెంట్రల్ రిజర్వు పోలీసు దళం, సెంట్రల్ రిజర్వులో ఉన్న కమాండో బెటాలియన్స్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) బృందాలన్నీ సంయుక్తంగా ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయని చెప్పారు. గురువారంనాడు కర్రెగుట్టల్లో ముగ్గురు మహిళా నక్సలైట్లను గాలింపు బృందాలు కాల్చి చంపాయి. ఐతే వారి నుండి భారీగా పేలుడు పదార్థాలు,ఆయుధాలు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్ట, దుర్గంగుట్టల ప్రాంతంలో సోమవారంనాడు భద్రతా దళాలు ఈ గాలింపు చర్యలను తరువాయి 12లో

# అణిచివేత, హింసాకాండ ఆపాలి

- శాంతి చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావాలని అందరూ కోరుతున్నారు
- ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తోంది
- మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

ప్రజాపక్షం/ఖమ్మం

శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారని శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ సిద్ధంగా ఉంటుందని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. నార్త్, వెస్ట్, సబ్ జోనల్ బాధ్యులు రూపేష్ పేరుతో శుక్రవారం మీడియాకు ఒక లేఖ విడుదల చేశారు.ఈ లేఖలో శాంతి చర్చలకు సంబంధించి పార్టీ కేంద్ర కమిటీ లేఖలు జారీ చేసిందని విశ్వాస రాహిత్యాన్ని తొలగించేందుకు మావోయిస్టు పార్టీ నుంచి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తుందని శాంతి చర్చల ద్వారా తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

శతాబ్దకాల సంప్రదాయానికి విరుద్ధంగా

## నేడు పోప్ అంత్యక్రియలు



**వాటికన్ సిటీ :** రోమన్ క్యాథలిక్స్ మత గురువు, పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ఉదయం 10 గంటలకు (వాటికన్ కాలమానం) జరుగుతాయి. ఈ అంత్యక్రియలకు 50 దేశాల నాయకులు, బ్రిటన్ రాజు ఛార్లెస్ సహా పది ముస్లిం దేశాలకు చెందిన రాజులు హాజరవుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ తదితరులు హాజరవుతున్నారు. సాధారణంగా పోప్‌ను సెయింట్ పీటర్స్‌లోని క్రిప్ట్‌లో ఖననం చేస్తారు. కానీ గడచిన 100 సంవత్సరాల చారిత్రక సంప్రదాయాలకు భిన్నంగా మరణ వీలునామాలో వ్యక్తం చేసిన కోరిక ప్రకారం పోప్ ఫ్రాన్సిస్ భౌతిక దేహాన్ని రోమ్‌లోని బసిలికా ఆఫ్ సెయింట్ మేరీ మేజర్‌లో ఖననం చేస్తారు. ఈనెల 21న గుండెపోటుతో పోప్ మరణించారు.

# కారుబాంబు దాడి : రష్యా సైనిక జనరల్ హత్య

### ఉక్రేన్ శాంతి చర్చలపై అడుగంటిన ఆశలు!



**మాస్కో :** మాస్కోలో శుక్రవారం జరిగిన కారు బాంబు దాడిలో రష్యా ఉన్నతస్థాయి సైనిక జనరల్, రష్యా కమాండర్ యూరోస్లావ్ మోస్కాలిక్ హతుడయ్యారు. ఇటీవలనే ఆయన ఈ బాధ్యతల్లో నియమితులయ్యారు. డిసెంబరు నుండి ఇప్పటి వరకూ రష్యాలో ఇద్దరు సైనిక జనరల్స్ హతులయ్యారు. ఆయన హతులైనట్లు రష్యా ఫెడరల్ ఇన్వెస్టిగేటింగ్ అథారిటీ ధృవీకరించింది. పెల్లెట్స్‌తో నింపిన ఇంప్రొవైజ్డ్ పేలుడు పదార్థాల ప్రభావంతో వోక్స్‌వేగన్ గోల్ఫ్ కారు పేలిపోయిందని ఇన్వెస్టిగేటింగ్ అథారిటీ ప్రధానాధిపతి స్వెత్లానా పెట్రెంకో చెప్పారు. ఈ ఘటన తర్వాత ఉక్రేన్‌కు వ్యతిరేకంగా అధ్యక్షుడు పుతిన్ నుండి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత ఏడాది డిసెంబరులో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిర్రిల్లోవ్ తన అపార్ట్‌మెంటు వెలుపల ఎలక్ట్రికల్ స్కూటర్‌లో బిగించిన బాంబుదాడిలో మరణించారు. రష్యాలోనే ఆ దేశ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ హతమార్చింది. సైనిక జనరల్ హత్య ఘటనతో ఇక ఉక్రేన్‌–రష్యామధ్య శాంతి చర్చలకు ఆశలు అడుగంటాయని యూరప్ మీడియా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతినిధి విట్‌కాఫ్ చర్చల నిమిత్తం మాస్కోకు చేరుకున్న తరుణంలో జరిగినీ కారు బాంబు సంఘటన వారి చర్చల ఆలోచనలను తుత్తునియలు చేసిందని బ్రిటన్ మీడియా తన వార్తాకథనంలో వ్యాఖ్యానించింది. విట్‌కాఫ్‌–పుతిన్ మధ్య ఈ విధంగా చర్చలు జరగడం ఇది నాలుగోసారి. రష్యా ఒకవైపు చర్చల గురించి మాట్లాడుతూ మరోవైపు ఉక్రేన్‌పై ఇటీవలికాలంలో దాడులు ఉద్ధృతం చేయడం పరస్పర విరుద్ధ ఆలోచనలుగా ఆ వార్తాకథనం పేర్కొంది. ఐతే నాలుగోవిడత చర్చల్లో ఎలాగైనా ఉక్రేన్‌–రష్యా మధ్య శాంతి చర్చలకు తెరలేస్తుందని అటు ట్రంప్ ఎంత ఆశాభావంతో ఉన్నారో, ఇటు రష్యా కూడా అంతే మొగ్గుచూపింది. ఐతే ఇటీవల ఉక్రేన్‌–రష్యామధ్య దాడులు పెరిగినప్పటికీ ట్రంప్ జోక్యంవల్ల ఆశాభావం తారాడింది. తాజా కారు బాంబు ఘటనతో ఈ పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### కీవ్ మేయర్ రష్యా అనుకూల వ్యాఖ్యలు

ఒకవైపు రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధదాడులు, మరోవైపు శాంతి చర్చల యత్నాలు ఉద్ధృతమైన తరుణంలో ఉక్రేన్ రాజధాని కీవ్ నగర మేయర్ విటాలీ క్లిట్కో రష్యా అనుకూల వ్యాఖ్యలు చేశారు. శాంతి చర్చలు జరిగితే రష్యా ఆక్రమించుకున్న భూభాగాన్ని ఆ దేశానికి వదులుకోవడానికి ఉక్రేన్ సిద్ధంగా ఉండాలని అన్నారు. ఇరవైశాతం భూభాగాన్ని ఇప్పటివరకూ రష్యా ఆక్రమించగా క్రిమియాలో రష్యా ఆక్రమించిన భూభాగాన్ని ఆ దేశానికి వదిలేయాలని ట్రంప్ కూడా జెలెన్స్కీపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. కీవ్ మేయర్ వ్యాఖ్యలపై జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. శాంతి చర్చల దిశగా మొదట కాల్పుల విరమణ జరగాలనీ, ఆ తర్వాత చర్చలు జరుగుతాయన్నారు. ట్రంప్ ఒత్తిడివల్ల ఉక్రేన్ తన భూభాగాన్ని రష్యాకు వదిలేయాల్సి వస్తుందని కీవ్‌మేయర్ అన్నారు.

# ఉక్రేన్‌తో ఒప్పందానికి రష్యా సంసిద్ధత

**వాషింగ్టన్ :** ఉక్రేన్‌తో కాల్పుల విరమణ శాంతిసాధనపై ప్రత్యక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లోవరోవ్ చెప్పారు. కారు బాంబు దాడి ఘటనలో రష్యాసైనికజనరల్‌హత్యకుగురికావడానికి ముందుగా సిబిఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ (ఫేస్ ద నేషన్ విత్ మార్గరెట్ బ్రెన్నన్)లో శుక్రవారం లోవరోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌తో ప్రత్యక్ష శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామనీ, ఐతే చర్చలకు సంబంధించిన కొన్ని విషయాలను ఇంకా తుది మెరుగులు దిద్దాల్సి ఉందని అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేకదూత విట్‌కాఫ్ చర్చలు చేయడానికి శుక్రవారం నాడు మాస్కోకు చేరుకున్న సందర్భంగా లోవరోవ్ ఈ ప్రకటన చేశారు.అమెరికాఅధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ సరైన పద్ధతుల్లో ఆలోచిస్తున్నారు, అందువల్ల మేం కూడా సరైన దిశగానే అడుగులు వేస్తున్నాం అని ఆయన అన్నారు. గడచిన జులై నెల తర్వాత ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా భారీ స్థాయిలో గురువారం దాడులకు పాల్పడటంతో తొమ్మిది మంది మరణించారు. మరో 77 మంది గాయపడ్డారు. ఈ మృతుల సంఖ్య శుక్రవారంనాటికి 12కు పెరిగింది. అదేవిధంగా డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతం పావ్లోహ్రాడ్ పట్టణంపై రష్యా చేసిన తాజా డ్రోన్ దాడుల్లో ముగ్గురు మరణించారు. వీరిలో ఒక బాలిక, 76 ఏళ్ళు వృద్ధురాలు కూడా ఉన్నారు. రష్యా చర్యలపై ట్రంప్ గురువారం అసహనం వ్యక్తం చేశారు. ఇక దాడులు ఆపాలని, తాను విసిగిపోయానన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ కూడా ఒక ప్రకటన చేస్తూ రష్యా–ఉక్రేన్‌కు చర్చల బల్ల దగ్గరకు రాకపోతే ఇక అమెరికా తన దారి తాను చూసుకుంటుందని,జోక్యం చేసుకోదన్నారు. ఒకవైపు ప్రజలను చంపుతూ శాంతి చర్చలు ఎలా చేస్తారని మార్గరెట్ బ్రెన్నన్ ఆయనను ప్రశ్నించగా,ఉక్రేన్ సైన్యాలు పౌర ప్రాంతాలను సైనిక అవసరాలకు ఉపయోగిస్తున్నాయనీ, అలాంటి ప్రాంతాలను తాము లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నామని లోవరోవ్ సమాధానం చెప్పారు. తాము ఇప్పటికీ ఉక్రేన్‌తో చర్చలకు కట్టుబడి ఉన్నామని చెప్పడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయనీ, ఉక్రేన్‌లో అసలు సమస్యకు గల మూల కారణాన్నిపరిష్కరించాల్సినఅవసరం ఉందన్న ఆలోచనతో కృషి చేస్తున్న నాయకుడు ఈ భూమ్మీద కేవలం డోనాల్డ్ ట్రంప్ మాత్రమేనన్నారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు 20శాతం ఉక్రేన్ భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంది. రష్యాశాంతికి కట్టుబడిఉందని తాను చాలా బలంగానమ్ముతున్నానని‌ట్రంప్‌పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. రష్యా ఆక్రమించిన భూభాగాలను వారికే అప్పగించేందుకు అంగీకరించాలని జెలెన్స్కీపై ట్రంప్ ఒత్తిడి చేశారు.

# ఆ దాడుల్ని మాకు అంటగడతారా?

### జల ఉగ్రవాదాన్ని ప్రతిఘటిస్తాం
### పాక్ సెనేట్ ఏకగ్రీవ ఖండన తీర్మానం



**ఇస్లామాబాద్:** భారతదేశానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఎగువసభ శుక్రవారంనాడు ఏకగ్రీవ తీర్మా నం చేసింది. ఈనెల 22న అనంతనాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలో ఉగ్రవాదులు దాడి చేస్తే ఈ దాడిని పాకిస్థాన్ ప్రభుత్వానికి ముడిపెట్టి భారతదేశం జాతీయ భద్రతా కమిటీ సమావేశంలో ఆంక్షల తీర్మానాలు చేయడాన్ని పాకిస్థాన్ ఎగువసభ ఖండించింది. ''భారతదేశం ఆక్రమించిన కశ్మీరులో ఉన్న టూరిస్టు ప్రాంతంలో ఈ ఉగ్రవాదుల దాడి జరిగింది, ఈ దాడిలో ఇద్దరు విదేశీయులు సహా 26 మంది మరణించారు, ఐతే ఈ దాడులు పాకిస్థాన్ విశ్వసించిన విలువలకు విరుద్ధమైనవి, ఈ దాడులను పాకిస్థాన్‌కు అంటగట్టే పనికిమాలిన, నిరాధారమైన ప్రయత్నాలను ఖండిస్తున్నాం''అని ఎగువసభ తన తీర్మానంలో పేర్కొంది. ''సంకుచిత రాజకీయ లక్ష్యాలకోసం సాక్ష్యాలు లేని, అందరికీ తెలిసిన ఉదాహరణలను చూపించి పాకిస్థాన్‌నుకించపరచేందుకుభారతదేశం చేస్తున్న కుట్రపూరితమైన,దురుద్దేశపూరితమైన ప్రచారాన్ని ఎగువసభఖండిస్తున్నది'' అని తీర్మానం పేర్కొంది. ''సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేస్తూ భారతదేశం తీసుకున్న నిర్ణయం చట్టాల ఉల్లంఘన, ఏకపక్ష నిర్ణయం,సింధుజలాల ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడం చట్టవిరుద్ధం, ఇది యుద్ధం ప్రకటించడంతో సమానం'' అని ఎగువసభ పేర్కొంది. పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఎగువసభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. జల ఉగ్రవాదం లేదా సైనిక కవ్వింపులకు వ్యతిరేకంగా దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి పాకిస్థాన్ పూర్తిశక్తిసామర్థ్యాలతో సర్వసన్నద్ధంగా ఉందని తీర్మానం పేర్కొంది.

# బ్రిటన్‌లో భారత్ సంతతి నిరసన, నివాళి



**లండన్ :** పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో స్థిరపడిన భారతీయులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. భారతీయులు పెద్దసంఖ్యలో శుక్రవారంనాడు లండన్‌లో ఉన్న భారత హైకమిషన్ కార్యాలయం వెలుపల గుమిగూడి పాకిస్థాన్ దుశ్చర్యలపట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారతీయ డయాస్పోరా తరపున కులదీప్ షెకావత్ మాట్లాడుతూ, ఉగ్రవాదులను కఠినంగా అణచివేయాలని కోరారు. ఇజ్రాయెలీకి చెందిన వారు కూడా భారత్ డయాస్పోరాకు ఈ విషయంలో మద్దతు ఇచ్చారు. ముస్లిం ఉగ్రవాదులను అణచివేయాలని వారు కోరారు. భారత జాతీయ పతాకాలను పట్టుకుని ప్రదర్శన చేశారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జీహాదిస్టులను అణచివేయాలని ప్రదర్శకులు కోరారు. ఇదిలాఉండగా భారత హైకమిషన్ కార్యాలయం కూడా పహల్గామ్‌లో మరణించిన పర్యాటకులకు సంతాపం తెలియజేసింది. బ్రిటన్ మంత్రులు కేథరిన్ వెస్ట్, ఎల్.మురుగన్, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు బాబ్ బ్లాక్‌మన్, కనిష్క నారాయణ్, హౌస్‌ఆఫ్‌లార్డ్స్‌సభ్యులు సంధ్యావర్మ, లార్డ్ రావెల్, మహారాష్ట్ర మం త్రి సంజయ్ సిర్సాత్ తదితరులు ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు శ్రద్ధాంజలిఘటించారు. మృతుల కుటుంబాలకు సంతాపం, సానుభూతి తెలిపారు.

# పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక నిరసనలు

### యుద్ధం చేసి నీటి హక్కు సాధిస్తాం



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం ఆంక్షలు విధించిన తర్వాత ఆ దేశంలో భారత్‌కు వ్యతిరేకంగా అ దేశంలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. సింధు జలాల ఒప్పందం రద్దును షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రజల్లో తనకు అనుకూలగా ప్రచారం చేసుకుంటున్నది. యుద్ధం చేసి నీటి హక్కు సాధిస్తామంటూ ప్రజలు వీధుల్లోకి వచ్చి భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత సరిహద్దుల్లో ఉగ్రవాదానికి పాకిస్థాన్ ప్రభుత్వం పెంచిపోషిస్తోందని ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హెచ్చరించిన తర్వాత ఈ నిరసనలు మొదలయ్యాయి. శతాబ్దకాలంగా భారత్ ఆక్రమిత కశ్మీరులో ప్రజలను అణచివేస్తున్నారని వారు విమర్శించారు. లాహోర్, ఇస్లామాబాద్‌లలో వందలమంది ప్రదర్శనలు చేశారు. ఒక వ్యాపారవేత్త అజ్మల్ బలూచ్ మాట్లాడుతూ, ''భారతదేశం మాతో యుద్ధానికి దిగాలనుకుంటే బాహాటంగా ముందుకు రమ్మనండి'' అని సవాలు చేశారు. ''రెలిజియస్‌పార్టీ'' పిలుపు మేరకు లాహోర్‌లో ఈ ప్రదర్శన జరిగింది. పాకిస్థాన్ ఆక్రమిత ముజఫరాబాద్‌లో కూడా 300 మంది ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసి పాకిస్థాన్ జీవనంపై భారత్ దెబ్బకొడుతోందని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రజల్లో విస్తారంగా ప్రచారం ప్రారంభించింది. ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటున్నది. ''నీరు మా హక్కు, నీరు దేవుడు ఇచ్చిన ప్రసాదం, ఆ హక్కును అవసరమైతే యుద్ధం చేసైనాసరే సంపాదించుకుంటాం'' అని ప్రదర్శనలో పాల్గొన్న పాతికేళ్ళ వయసుగల మహ్మద్ ఓవైసీ అన్నాడు. ''భారతదేశం గనుక పాకిస్థాన్‌పై దాడి ద్వారా తప్పుచేస్తే పాకిస్థాన్ కశ్మీరీ ప్రజలు యుద్ధంలో ముందు పీఠిన నిలబడి పోరాటం చేస్తాం, పాకిస్థాన్ కోసం మేం మరణించి ప్రాణాలు అర్పించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం'' అని పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులోని పాకిస్థాన్ పీపుల్స్‌పార్టీ సీనియర్ నాయకుడు షౌకత్ జావేద్ మిర్ అన్నారు. బలూచిస్థాన్ రాజధాన క్వెట్టాలో కూడా 150 మంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు.

## బెయిల్ ఇవ్వండి

### ప్రభాకర్‌రావు వాదన

**హైదరాబాద్ :** ఫోన్‌ల ట్యాపింగ్‌కు ముందు చీఫ్‌సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ ఆదేశాలు ఇస్తుందని, ఆ కమిటీ ఆదేశాల మేరకు విధులు నిర్వహించినట్లు ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఏ1 అయిన టి.ప్రభాకర్‌రావు హైకోర్టులో వాదించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆయన వేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు శుక్రవారం విచారించారు. పిటిషనర్ డీజీపీ సబార్డినేట్‌గా పనిచేస్తారని, కమిటీ వాళ్లను వదిలేసి పిటిషనర్‌పై విచారణ చేయడం చెల్లదని ఆయన లాయర్ అన్నారు. అరెస్ట్ నుంచి మినహాయింపునిస్తే విచారణకు హాజరవుతారన్నారు. ఇదే కేసులో 6వ నిందితుడైన శ్రవణ్‌కుమార్‌కు సుప్రీం కోర్టులో వెసులబాటు లభించిందన్నారు. హార్డ్‌డిస్కల ధ్వంసంలో పిటిషనర్ పాత్ర లేదని, అప్పటికే అతను రాజీనామా చేశారన్నారు. సుమారు 65 ఏళ్ల వయస్సు ఉందని, ఈ వయసులో ఉన్నవారిని విచారించాలంటే ఇంటివద్దకే దర్యాప్తు అధికారులు వెళ్లాలని కోర్టులు చెబుతున్నాయన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, 30 ఏళ్ల సర్వీసులో అనేక పతకాలు పొందన అంశాలను కూడా గమనంలోకి తీసుకోవాలన్నారు. పోలీసుల తరపున సీనియర్ లాయర్ వాదిస్తూ, ప్రభాకర్ పొందిన పతకాలను చూసి బెయిల్ ఇవ్వొద్దని కోరారు. పంజాబ్‌లో జరిగిన ఆపరేషన్ బ్లూస్టార్ చేసినప్పుడు ఒక ఆర్మీ రిటైర్డు ఆఫీసర్ బింద్రన్‌వాలే గ్రూపు సలహాదారుగా చేశారని, ఆపరేషన్ బ్లూస్టార్‌లో ఆ అధికారి హతమయ్యారని చెప్పారు. ముందస్తు బెయిలు ఇవ్వొద్దని కోరారు విచారణను ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

## ఐకమత్యమే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడిలో గాయబడిన వారిని కలిశానన్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, ఆప్యాయత ఉందన్నారు. దేశం మొత్తం కలిసి ఉందని అందరికీ తెలియజేయాలని కోరుకుంటున్నానన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశాన్ని ప్రస్తావిస్తూ, ఐక్య ప్రతిపక్షం ఉగ్రవాద దాడిని ఖండించిందని, ప్రభుత్వానికి అండగా ఉందని పేర్కొన్నారు. సమాజాన్ని విభజించడం, సోదరులు మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని అని, భారతీయులంతా ఐక్యంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. అప్పుడే ఉగ్రచర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలమని చెప్పారు. కశ్మీర్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరమని, మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని సూచించారు. కాగా, రాహుల్‌గాంధీ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లానూ కలిశారు. పహల్గామ్‌లో ఏం జరిగిందో వారు వివరించారు. తమ పార్టీ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీనిచ్చానని రాహుల్ చెప్పారు. ముందుగా రాహుల్ వ్యాపారులు, విద్యార్థి నాయకులు, పర్యాటక రంగానికి సంబంధించిన ప్రతినిధులను కలిశారు.

## హింసాకాండ ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అణిచివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని లేఖలో తెలిపారు. బీజాపూర్ తెలంగాణ సరిహద్దుల్లో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైందని దీనిని వెంటనే ఆపాలని సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలని మావోయిస్టులు లేఖలో డిమాండ్ చేశారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని అనుసరించాలని అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆ దిశగా మావోయిస్టు పార్టీ అభ్యర్థిస్తుందని లేఖలో తెలిపారు. చర్చల మార్గమే సానుకూల ఫలితాలను ఇస్తుందని తుపాకీతో సమస్యను పరిష్కరించాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కాగార్ సైనిక్ కార్యక్రమాన్ని ఒక నెల పాటు వాయిదా వేయాలని మా విజ్ఞప్తి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నామని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

## గ్లోబల్ జస్టిస్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సుదీర్ఘకాలం తర్వాత అలాంటి దిశా నిర్దేశాన్ని 'భారత్ సమ్మిట్–2025' ద్వారా కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలోశుక్రవారంప్రారంభమైన'భారత్ సమ్మిట్–2025' కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై జరిగిన ప్యానల్ డిస్కషన్స్ వివరాలను టిపిసిసిఅధ్యక్షులుబి. మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సల్మాన్ ఖుర్షిద్‌లతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాల ఆధారంగా భారత్‌సమ్మిట్ జరుగుతున్నదని, ఈసమ్మిట్‌లో శాంతికాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునే వారు (గ్లోబల్ జస్టిస్) ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగిన వారు 8 ప్యానెల్స్‌గా చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. సుమారు 100 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు లింగ న్యాయం, ఫెమినిస్ట్ ఫ్యూచర్, ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్–కౌంటరింగ్ డిస్‌ఇన్ఫర్మేషన్,యూత్‌అండ్ పాలిటిక్స్‌ఆఫ్‌టుమారో, షేపింగ్ న్యూ మల్టీ ల్యాటరలిజం వంటి అంశాలపై లోతుగా ప్రముఖులు చర్చలు చేశారనివివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమం చారిత్రాత్మకమైన సమ్మిట్‌గా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోజరుగుతున్నఅభివృద్ధి,అమలు చేస్తున్న సంక్షేమం గురించి భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏవిధంగాముందుకుతీసుకుపోతున్నామో ప్రపంచ ప్రతినిధులకు వివరించామన్నారు. లోక్‌సభ ప్రతిపక్షనేత,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీసుకున్న 'గ్లోబల్ జస్టిస్' నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఈ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు స్వాగతించి, అభినందించారని వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదామని పిలుపునిచ్చారు. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ కోసం కాంగ్రెస్‌తో కలిసి రావాలని కోరారు.

**తెలంగాణాలో పెట్టుబడులు పెట్టండి**

దేశానికే మోడల్‌గా నిలవనున్న తెలంగాణలో పెట్టుబడులుపెట్టాలని'భారత్‌సమ్మిట్'లో పాల్గొన్న దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులను కోరినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రీజినల్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్స్, ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, నాలెడ్జ్ ఐటి సెంటర్, ఇందిరా గిరి జల వికాసం, యంగ్‌ఇండియాఇంటిగ్రేటెడ్‌రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు,రాజీవ్‌యువ వికాసం పథకాల గురించిప్రతినిధులకు వివరించామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ను ప్రతినిధులు అభినందించారన్నారు.

## 208 మంది పాక్ పౌరులు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేస్తున్నారు. గడువు ముగిసిన తరువాత కూడా ఎవరైనా ఇక్కడ ఉంటే వారిని అరెస్టు చేసి పంపించే అంశాలపై కూడా పోలీసులు చర్చిస్తున్నారు.అలాగేఅక్రమవలసదారులపై కూడా పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటోంది. ఇది కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, జాతీయ భద్రతా పరిరక్షణ చర్యలలో భాగంగా ఈ సర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టారు.శ్రీనగర్‌లఉగ్రదాడిలో 26 మంది మరణించిన ఉదంతంపై కేంద్ర మంత్రివర్గ భద్రతాకమిటీ(సిసిఎస్)పాకిస్తానీయులను గుర్తించి, వారి వీసాల గడువు ముగిసిన వారిని వెనక్కి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండపోలీసు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక శాఖలతో కలిసి పాకిస్తానీయుల గుర్తింపు కోసం విస్తృతంగాతనిఖీలు నిర్వహిస్తున్నారు. 2023లో ఫైజ్ మహ్మద్ అనే పాకిస్తానీయుడు నెపాల్ సరిహద్దు ద్వారా అక్రమంగా భారత్లోకి ప్రవేశించి, హైదరాబాద్‌లో తన భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఇతన్ని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుండి పాకిస్తాన్ పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాది జనవరిలో జక్రియా అనే పాకిస్తానీయుడు వరంగల్‌లో హోటల్ నిర్వహిస్తూ, టెర్రర్ స్లీపర్ సెల్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడని నిఘా సంస్థలు గుర్తించి అరెస్ట్ చేశాయి. అతని వద్ద నుండి పేలుడు పదార్థాలు, తుపాకులు, నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు . భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ, రాష్ట్రంలో పాకిస్తానీయులు మరియు బంగ్లాదేశీయులను గుర్తించి, అక్రమంగా నివసిస్తున్న వారిని వెంటనే వెనక్కి పంపించాలని ప్రభుత్వాన్ని కోరింది. పార్టీ నాయకులు, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో, విదేశీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . తెలంగాణలో పాకిస్తానీయుల గుర్తింపు, అక్రమ వలసదారుల నిర్ధారణపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులపై అనుమానాస్పద కార్యకలాపాలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.

## ఎంఐఎం గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 49, కాంగ్రెస్‌కు చెందిన 14 ఓట్లు కలిపి 63 ఓట్లు ఎంఐఎం అభ్యర్థికి పోలయ్యాయి. దీంతో ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. లెక్కింపు ప్రక్రియను 10 గంటలలోపే పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ నెల 23న జరిగిన ఎన్నికల్లో 78.57 శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. 66 మంది కార్పొరేటర్లు, 22 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌లో బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియె సభ్యులు పాల్గొన్నారు. ఓటింగ్‌ను బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు దూరంగా ఉన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు : అనురాగ్ జయంతి

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఈ ఎన్నికల్లో 88 ఓట్లు పోల్ కాగా అందులో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండికి 63 ఓట్లు, బిజెపిఅభ్యర్థి డాక్టర్ ఎన్. గౌతమ్ రావుకు 25 ఓట్లు పోలయ్యాయన్నారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందచేశారు.

### ఏకగ్రీవం కావొద్దనే బిజెపి పోటీ చేసింది : మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి

ఎమ్మెల్సీ ఎంఐఎంకి ఏకగ్రీవం కావద్దనే ఉద్దేశంతోనే చివరి నిమిషంలో బిజెపి తన అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టిందని రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి అన్నారు. ఇది ఎన్నిక జరగడానికి కారణమైందన్నారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అయినా కూడా ఈ ఎన్నికల్లో తామే విజయం సాధించామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్య కారణంగా విజయోత్సవ ర్యాలీని రద్దు చేసుకున్నామని తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీని జరుపుతామని చెప్పారు.

### ఆ మూడు పార్టీలు ఒక్కటే : బిజెపి అభ్యర్థి గౌతమ్ రావు

ఈ సందర్భంగా బిజెపి అభ్యర్థి గౌతమ్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్పొరేటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్న బిఆర్ఎస్ పార్టీ గుర్తింపును ఎన్నికల కమిషన్ ఎందుకు రద్దు చేయవద్దని తాను ప్రశ్నిస్తున్నానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల కమిషన్కు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్న వారిని ఓటింగ్‌కు రానివ్వకుండా బిఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. కెటిఆర్ ఓట్లు వేయొద్దు అని చెప్పారని, ఈ పార్టీ ఇప్పుడు ఏ విధంగా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంకు నేరుగా సహకరించిందన్నారు. బిఆర్ఎస్ ఓటింగ్ రాకుండా దోహదపడిందన్నారు.

## బిఆర్‌ఎస్ సిగ్గుపడాలి

(మొదటి పేజీ తరువాయి)

పాలనలో కట్టిన ఈ ప్రాజెక్టు వారి పాలనలోనే కుప్ప కూలిపోయిందని ఆయన మండిపడ్డారు. మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు ఎందుకూ పనికి రాకుండా పోయినా ఆ నిర్మాణాలు తమ గొప్పతనమని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జాతీయ ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి బిఆర్ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీలతో లక్ష కోట్లు ఋణం తీసుకొచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంత జరిగాక కుడా బిఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ బిఆర్ఎస్ సొంత జాగీర్ కాదని, ప్రజాధనంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడితే చూస్తూ సహించేదిలేదని హెచ్చరించారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికపై సమగ్రమైన అధ్యయనం చేసిన అనంతరం తదుపరి చర్యల కోసం మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బిఆర్ఎస్ పాలనలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించింది ఎంత మాత్రం కాదని, నాటి అధికార పార్టీ నేతల జేబులు నింపు కోవడానికే దీనిని వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని బాధ్యులైన వారికి శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణం రూపకల్పన, నిర్వహణా లోపాలు బయట పడినందున బిఆర్ఎస్ నేతలు తెలంగాణ రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మెడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారెజ్‌లు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి రికార్డు సృష్టిస్తుంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలు మాత్రమే దోహద పడ్డాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కలపండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ఎంపిలు, ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు భారత్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పహల్గామ్‌లో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని మోదీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంపూర్ణ మద్దతు కూడా ఉంటుందని ప్రకటించారు. దేశ ప్రజలు కూడా కేంద్ర ప్రభుత్వం వెంట ఉన్నారన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి తెలుపుతుందని, ఆ కుటుంబాలకు అందరం అండగా నిలబడి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.

1967, 1971లో ఇలాంటి దాడులు చేసిన వారికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ గట్టిగా జవాబు ఇచ్చారని, ఒక్క దెబ్బతో పాకిస్తాన్‌ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అని రెండు ముక్కలు చేశారని సిఎం గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయ్ దుర్గామాతతో పోల్చారని తెలిపారు. ప్రధాని మోదీ కూడా దుర్గామాత భక్తులుగా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకుని ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఒక్క దెబ్బతో పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయండి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో కలపండి అని సిఎం కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అట్టారీ సరిహద్దు 30 వరకు తెరిచి ఉంటుంది: డిజిపి



ప్రజాపక్షం/హైదరాబాద్: శ్రీనగర్‌లో ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ పాక్ పౌరులకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పాకిస్తానీ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. పాకిస్తాన్ జాతీయులకు భారతదేశం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు ఏప్రిల్ 27 నుండి రద్దు అవుతాయన్నారు. అలాగే పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన వైద్య వీసాలు మాత్రం ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఆ తరువాత రద్దవుతాయన్నారు. వీసాల రద్దు .. దీర్ఘకాలిక వీసాలు (ఎల్‌టివిలు), దౌత్య, అధికారిక వీసాలు కలిగి ఉన్నవారికి వర్తించదన్నారు. పాక్ వెళ్లాలనుకునేవారి కోసం అట్టారీ సరిహద్దు ఈ నెల 30 వరకు తెరిచి ఉంటుందని తెలిపారు. చట్టపరమైన చర్యలను నివారించడానికి తెలంగాణలో ఉంటున్న పాకిస్తాన్ జాతీయులు మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

## పత్తి కొనుగోళ్ల అవకతవకలపై మంత్రి ఆగ్రహం



### విజిలెన్స్ విచారణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
### 162 మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల సందర్భంగా చోటుచేసుకున్న అవకతవకలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు పత్రికలలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకతవకలపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను పిలిపించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో విజిలెన్స్ విచారణ చేపడుతున్నారని మంత్రి తెలిపారు. విజిలెన్స్ ఇచ్చే విచారణ నివేదిక ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, విజిలెన్స్ విచారణను వేగంగా పూర్తి చేసి, రిపోర్టును సమర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శికి, మార్కెటింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి మార్కెటింగ్ సెక్రటరీ, జిల్లా మార్కెటింగ్ అధికారుల నుండి వివరణ తెప్పించుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కి మంత్రి ఆదేశించారు. మార్కెట్లలో జరిగే ఎలాంటి అక్రమాలను ప్రభుత్వం ఉపేక్షించదని, రైతులకు నష్టం కలిగే విధంగా ఎవరూ నడుచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**162 మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 197 మార్కెట్ కమిటీల్లో ఇప్పటివరకు 162 కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించడం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఏడాదిలోనే 2,268 నామినేట్ పోస్టులను భర్తీ చేశామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అతి తక్కువ సమయంలో ఈ స్థాయిలో మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసినది ఇదే తొలిసారని మంత్రి తెలిపారు. మార్కెట్లలో జరిగే అవకతవకలకు అడ్డుకట్ట పడేవిధంగా, రైతులకు గరిష్ట మద్ధతు ధర వచ్చే విధంగా, రైతులకు కావాల్సిన కనీస వసతులు కల్పించే దిశగా ఈ పాలకవర్గాలు పనిచేయాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు లేని పరిస్థితుల వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వేగంగా కమిటీలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా త్వరలోనే పాలకవర్గాలు నియమించబడతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మిగతా మార్కెట్ కమిటీలతో పాటు ఎటిఎంఎ, ఇతర నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

## ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశానికి అండగా నిలుస్తాం




### ఎపిటిబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి బిఎస్.రాంబాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు చెప్పారు. పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి బ్యాంక్ ఉద్యోగులను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఈ భయంకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ హైదరాబాద్ కోఠిలోని బ్యాంకు స్ట్రీట్‌లో శుక్రవారం ఎపిటిబిఇఎఫ్ నిరసన ప్రదర్శన నిర్వహించింది. వందలాది మంది బ్యాంకు ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసి, కొవ్వత్తులు వెలిగించి మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ పహల్గామ్‌లో విషాదకరమైన ఉగ్రవాద దాడిలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు జె.చంద్రమౌళి, శైలేష్ భాయ్ కాలాతియా బలికావడం బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ దాడి నాగరిక సమాజంపై ఒక మచ్చ అని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతి, ఐక్యత, పురోగతి కోసం ప్రయత్నిస్తున్న సమాజంలో ఇటువంటి ఉగ్రవాద చర్యలకు స్థానం లేదన్నారు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగా చర్యలు చేపట్టాలని, బ్యాంకు ఉద్యోగులందరం కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి పి.వి. కృష్ణారావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, ఉదయ్ భాస్కర్, అజయ్ కుమార్, ఐబిఓఎ ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్ పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ పాలన పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వే రిటైర్డ్ అధికారి కె.వి.రావు రచించిన గ్రామపంచాయతీ పరిపాలన పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. భారతదేశంలో పంచాయతీరాజ్ చరిత్ర మొదలుకుని తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, గ్రామ సభలు, సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలు, అర్హతలు, సర్పంచ్, సెక్రెటరీ నిధులు విధులు, గ్రామపంచాయతీలో పన్నులు నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్, గ్రామ ప్రగతి ప్రణాళికలు తదితర సమగ్ర విషయాలను క్రోడీకరించి పుస్తకాన్ని రూపొందించిన రచయిత కె.వి.రావును ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభినందించారు. గ్రామపంచాయతీ పాలనపై అవగాహన పెంచుకునేందుకు ఈ పుస్తకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా స్థానిక ఎన్నికలకు తెలంగాణ సమాయత్తం అవుతున్న సమయంలో ఇలాంటి పుస్తకం రావడం ఎంతో ఉపయోగకరమన్నారు.

## ‘‘హిందుస్తాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్’’



### చార్మినార్ వద్ద మార్మోగిన నినాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్ మక్కా మసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో ఎంఐఎం ఎపి అసదుద్దీన్ ఒవైసీతో పాటు ముస్లింలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం చార్మినార్ వద్దకు చేరుకున్న వీరంతా ‘‘హిందుస్తాన్ జిందాబాద్ పాకిస్తాన్ ముర్దాబాద్’’ అనే నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. ఈ సందర్భంగా చార్మినార్, మక్కామసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న కఠిన చర్యలపై ఒవైసీ మద్దతు తెలిపారు. శుక్రవారం ప్రార్థనల కోసం మసీదుకు వచ్చిన వారికి అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా నల్ల బ్యాడ్జీలను పంపిణీ చేశారు. తాను కూడా చేతికి నల్ల బ్యాడ్జీ ధరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించాలని ఆయన అక్కడి వారికి పిలుపునిచ్చారు. ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరిని తాను సమర్థిస్తున్నట్లు ఒవైసీ ఈ సందర్భంగా వెల్లడించారు. అయితే, ఇదే సమయంలో పాకిస్తాన్‌కు నీటి సరఫరా నిలిపివేయాలనే వాదనలపై ఆయన స్పందిస్తూ, ఒకవేళ నీటిని నిలిపివేస్తే, ఆ నీటిని ఎక్కడ నిల్వ చేస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు.

## ఐక్య కమ్యూనిస్టుల ఉద్యమాలతో సామ్రాజ్యవాద ఓటమి సాధ్యం

### క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా



ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికాతో పోల్చుకుంటే క్యూబా ప్రజాస్వామ్యం గొప్పదని భారత్‌లో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా అన్నారు. ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న అమెరికాలో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు నెలకొన్నాయన్నారు. క్యూబాలో సింగిల్ పార్టీ ప్రభుత్వమే అయినా 45 శాతం మహిళలకు, 30 ఏళ్ల వయస్సు ఉన్న వారికి 20 శాతం, పౌరుగువారిని ప్రోత్సహించేందుకు 50 శాతం చట్టసభలలో అవకాశం కల్పించడం ద్వారా గొప్ప ప్రజాస్వామ్య దేశంగా క్యూబా పేరు తెచ్చుకుందని ఆయన అన్నారు. సిపిఐ, సిపిఐ(ఎం) సంయుక్త ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ సదస్సు శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) జాతీయ కార్యవర్గ సభ్యులు జ్యోతి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. క్యూబా భారత్ మైత్రిపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జువాన్ కార్లోస్ మార్సన్ అగ్విలెరా మాట్లాడుతూ అమెరికా నుండి క్యూబా కు సులభతరంగా విమానాల రాకపోకలు లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రెండు కోట్ల మంది క్యూబా ప్రజలు అమెరికాలో ఉంటున్నారని, వారు డబ్బులు పంపించడాన్ని కూడా అమెరికా అడ్డుకుంటుందన్నారు. విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో ఇబ్బందిగా మారిందన్నారు. నార్త్ కోరియా, ఇరాన్, భారత్ లాంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు పెట్టుకోకుండా ఆంక్షలు విధిస్తుందన్నారు. ట్రంప్ అధికారం చేపట్టిన అనంతరం క్యూబాపై ఆంక్షలు మరింత ఎక్కువ అయ్యాయన్నారు. సిపిఐ త్వరలోనే 100 సంవత్సరాల వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇటీవల సిపిఐ(ఎం) జాతీయ మహాసభల సందర్భంగా క్యూబాకు సంఘీభావం తెలుపుతూ తీర్మానం చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బేబీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌కు తాత్కాలిక రాయబారిగా పనిచేస్తున్నానని, కానీ తాను క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఉన్నానని, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం తాము క్యూబా 65 వార్షికోత్సవాన్ని జరుపుతున్నామని తెలిపారు. నెహ్రూ కాలం నుంచి 1959 నుంచి భారత్‌తో క్యూబాకు మంచి సంబంధాలు ఉన్నాయని, 1973, 1983 రెండు సార్లు ఫిడెల్ క్యాస్ట్రో భారత్‌ను సందర్శించారని గుర్తు చేశారు. అలీనయోధ్యమంలో ఫిడెల్ క్యాస్ట్రో కీలకపాత్ర పోషించారన్నారు. 1960లో దశకంలో ఐక్యరాజ్య సమితికి క్యాస్ట్రో వెళ్లారని, కేవలం పెద్ద దేశాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం మాత్రమే కాకుండా పేద దేశాలకు కూడా వెళ్లాలని చెప్పారన్నారు. ఇండియాలో ఉన్న సిపిఐ, సిపిఐ(ఎం)లతో చాలా సత్సంబంధాలు కలిగి ఉన్నామన్నారు. పెట్టుబడిదారి సామ్రాజ్యవాదాన్ని ఓడించాలంటే కేవలం ఐక్య కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అందులో భాగంగానే ఇండియాతో కలిసి అనేక సందర్భాల్లో పనిచేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిల్లో అనేక సెమినార్లు, సమావేశాల్లో పాల్గొనడం ద్వారా ప్రపంచమంతా కూడా కమ్యూనిస్టు ఉద్యమాన్ని పెంపొందించే దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. క్యూబా సంఘీభావంగా భారతదేశంలో గత రెండు మూడు దశాబ్దాలుగా అమెరికా దాష్టికాన్ని ఎదుర్కోవడంలో క్యూబా చేస్తున్న ప్రయత్నాలన్నిటికీ కూడా ఇండియా నుంచి తమకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని, అలాంటి సహకారానికి తాము చాలా సంతోషపడుతున్నామన్నారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ క్యూబాలో కమ్యూనిజం లేకుండా సామ్రాజ్యవాద అమెరికా ఎన్ని ప్రయత్నాలు చేసినా ధైర్యంగా క్యూబా నిలబడడం కమ్యూనిస్టు ఉద్యమానికి గర్వకారణమన్నారు. క్యూబాపై అమెరికా అనేక ఆంక్షలతో ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయిల్‌పాలస్తీనాల మధ్య అమెరికానే యుద్ధం రాజేసిందన్నారు. యుద్దాలకు ఊసిగొల్పడం, ఆయుధాలను అమ్ముకోవడం అమెరికా కుటిల నీతికి నిదర్శనమన్నారు. గతంలో అలీనోద్యమం నడిస్తే, ప్రస్తుతం ప్రధాని మోదీ ఆలింగన విధానం నడుస్తుందన్నారు. సోషలిస్ట్ బ్లాక్ రావాలని, ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు చర్చించాలని, మనిషిని మనిషి దోచుకునే పరిస్థితులు పోవాలన్నారు. జాన్ వేస్లీ మాట్లాడుతూ కరోనా సమయంలో క్యూబా వైద్యులు ప్రపంచనాన్ని ఆదుకున్నారని తెలిపారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదంతో అమెరికా ప్రభుత్వాలను పడగొట్టడం, కూలగొట్టడం చేస్తుందన్నారు. అలాంటి అమెరికా ఆంక్షలకు తట్టుకుని క్యూబా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కొనసాగించడం గొప్ప విషయమన్నారు. డబ్బులు ఇచ్చిమరీ క్యూబాలో అమెరికా టెర్రరిజాన్ని ఊసిగొల్పుతుందని మండిపడ్డారు. చివరకు ఆహార ధాన్యాల దిగుమతిపై కూడా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. విద్య, వైద్యం పూర్తిగా ఉచితంగా అందిస్తుందని తెలిపారు. సభలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరువనంతపురంలో శుక్రవారం కేరళ మీడియా అకాడమీని సందర్శించి, అక్కడ జరిగిన సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని కేరళ మీడియా అకాడమీ చైర్మన్ ఆర్.ఎస్.బాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు పాల్గొన్నారు.






తిరువనంతపురంలో జరిగిన సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సిపిఐ తరఫున చర్చలో పాల్గొన్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

## పహల్గామ్ ఉగ్ర ఘాతుకంపై భారత్ సమ్మిట్ తీవ్ర దిగ్భ్రాంతి

### ఐక్యత.. సామరస్యం, రాజ్యాంగ విలువలపై దాడిగా ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్: పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడిపై భారత్ సమ్మిట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైన సదస్సులో పాల్గొన్న వంద దేశాలకు చెందిన ప్రగతిశీల పార్టీలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ''పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి చెందుతున్నాం. ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. భారత ప్రజలకు మేం సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. శాంతియుత పౌరులపై ఇటువంటి క్రూరమైన చర్యలకు సమాజంలో స్థానం లేదు.. ఈ క్రూర దాడులు ఐక్యత, శాంతి, సామరస్యం అనే రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడి'' అని పేర్కొన్నారు.

## నాణ్యమైన విద్యకు సంస్కరణలు అవసరం

### ఎస్‌టియుటిఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పలు సంస్కరణలు అవసరమని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్ రెడ్డి, జి.సదానందం గౌడ్‌లు అన్నారు. తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఇటీవల విద్యారంగంలో సమూల మార్పులను సూచి స్తూ పలు విప్లవాత్మక సూచనలతో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌లో 33 జిల్లాల నుండి ఎస్‌టియుటిఎస్ ముఖ్య బాధ్యులు, విషయ నిపుణులు పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదికి ఒక ఉపాధ్యాయున్ని నియమించడం, మెరుగైన సౌకర్యాల కల్పన, రవాణా ఫెసిలిటీ, ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదల, వృత్తి నైపుణ్య విద్యా కోర్సుల అమలు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల బలోపేతం, కరికులం, భాషా సామర్థ్యాల పెంపు, మూల్యాంకనం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, దాసరి శ్రీధర్, ఎల్.ఎం.ప్రసాద్, బి.రవి, జుట్టు గజేందర్, సాబిర్ అలీ, రామ సుబ్బారావు, విశ్వశాంతి, రమ్య పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రి పేరిట వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

### అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు
### మంత్రి పొంగులేటి హెచ్చరిక



హైదరాబాద్ : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ ( పిఎ)లమని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకట రెడ్డి (34), మచ్చ సురేష్ (30) హైదరాబాద్ నాగోల్‌లో నివాసముంటున్నారు. వీరు మంత్రి పిఎలమంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రిగా దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇక నుండి తన పిఎలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే, ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివాలయంలోని తన కార్యాలయం 040–2345 1072/040– 23451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా బిఆర్ఎస్ ఎప్పుడూ ప్రజాపక్షమే

### మాజీ మంత్రి హరీష్‌రావు



రజతోత్సవ సభకు పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి, యువ మిత్రులకు, ఉద్యమకారుకు, బిఆర్ఎస్ ఉద్యమకారులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. 44డిగ్రీల ఎండను లెక్క చేయకుండా వెయ్యి మంది 27వ వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగుబంధం ముడిపడి ఉందని ... ఈ పాదయాత్ర రేపటి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావటానికి విజయయాత్రగా కాబోతుందని మాజీ మాజీ మంత్రి హరీష్‌రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. నాడు సిద్దిపేట నుండి కెసిఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లను ఊళ్లు కదిలించారన్నారు. చాల పార్టీలు పుడుతుంటాయి.. పోతుంటాయని బిఆర్ఎస్ లక్ష్యాన్ని ముద్దాడిందన్నారు. కెసిఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతులను ఏకం చేసిందన్నారు. 14 ఏళ్ల ఉద్యమం,.10 ఏళ్ల ప్రభుత్వం ఏడాదిన్నరగా ప్రతిపక్షం ఏ పాత్ర అయిన బిఆర్ఎస్ తెలంగాణ పక్షమన్నారు. శుక్రవారం సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద వెయ్యి మంది విద్యార్థి, యువకులతో పాదయాత్రనును అమరవీరులకు నివాళ్లు అర్పించి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ సిద్దిపేట నుండి ఎల్కతుర్తి బిఆర్ఎస్ స్వచ్ఛందంగా తరలివచ్చిన అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందన్నారు. పాదయాత్ర విజయవంతం చేసేందుకు అందరు క్రమశిక్షణతో ట్రాఫిక్ ఇబ్బందులు జరుగకుండ నడువాలన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ అరాచకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతిరోజు భోజన, రాత్రి భోజన సమయాల్లో మిమ్మల్ని కలుసుకుంటానన్నారు. పాదయాత్రకు ముందు పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళ్లు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. 25 ఏండ్ల పార్టీ ఆవిర్భావం సందర్భంగా 25 మీటర్ల జెండా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నేతలు కడవేర్గు రాజనర్సు, పూజల వెంకటేశ్వర్‌రావు, పాల సాయిరాం. మారెడ్డి రవీందర్‌రెడ్డి, కోల రమేశ్, ఎడ్ల సోమిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి. మచ్చ వేణుగోపాల్‌రెడ్డి. సంపత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ NIT No. 04/D1/PA to EE/SRPT/2025-26, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేది: 22.04.2025

మల్లారెడ్డి గూడ నుండి ముక్త్యాల రోడ్ కి.మీ. 0/0 నుండి 2/8, 3/830 నుండి 5/0 & 11/0-14/800 వరకు రోడ్డు భద్రతా జోక్యాలకు అందించే పని కొరకు ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. **అంచనా మొత్తం విలువ:** రూ.19.00లక్షలు. టెండరుదారులు బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కొరకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.inలో 25.04.2025న మ.3.00గం.ల నుండి 28.04.2025న మ.3.00గం.ల వరకు అందుబాటులో ఉండును. **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది:** 28.04.2025న మ.3.30గం.ల వరకు మరియు అంతకు ముందు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

DIPR R.O. No. : 824-PP/CL/ADVT/1/2025-26, Date: 25-04-2025

ప్రజాపక్షం
శనివారం, ఏప్రిల్ 26

# మోదీ ముందున్న మార్గం?

జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలో టెర్రరిస్టు ముష్కరుల కాల్పుల్లో 26మంది టూరిస్టుల ప్రాణాలు బలిగొన్న ఘోరకలి జరిగి అప్పుడే మూడు రోజులు గడిచిపోయాయి. కశ్మీర్‌లో టెర్రరిస్టు దాడులు, టెర్రరిస్టుల ఏరివేత దశాబ్దాలుగా సర్వసాధారణ ఘటనలే. అయితే పహల్గాంలో టెర్రరిస్టులు హిందువులను ఏరికోరి హతమార్చిన తీరు ఇందులో మత కోణాన్ని చేర్చింది. యావత్ భారతీయుల హృదయాలు గాయపడ్డాయి. ప్రతిచర్యను ఆక్రోశించాయి. అదే ఆవేదనను పాలక, ప్రతిపక్షపార్టీలు ఏకోన్ముఖంగా వ్యక్తం చేశాయి; టెర్రరిస్టు దాడిని ముక్తకంఠంతో ఖండిస్తూ, ప్రభుత్వం తీసుకునే ప్రతిచర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం బిహార్‌లో బహిరంగసభలో ప్రసంగిస్తూ టెర్రరిస్టులను, వారి మద్దతుదారులను భూగోళం అంచువరకు వేటాడుతామని ప్రతినబూనారు. భారత వ్యతిరేక టెర్రరిస్టు ముఠాలను పెంచి పోషించే పాకిస్థాన్ ఎస్టాబ్లిష్‌మెట్ – అది ప్రభుత్వం కావచ్చు, సైన్యం కావచ్చు, ఐఎస్ఐ కావచ్చు, వాటి ప్రోత్సాహంతో కార్యకలాపాలు నిర్వహించే లస్కరే తోయిబా, జైషే మహమ్మద్ వగైరా మతోన్మాద సంస్థలు కావచ్చు – పహల్గాం పైశాచిక కృత్యం వెనుక ఉందనేది నిర్వివాదాంశం. పాకిస్థాన్ ప్రభుత్వం నంగనాచి విచారం వ్యక్తం చేయవచ్చు. పహల్గాం రాక్షసకాండ తదుపరి ఇరుదేశాల ప్రభుత్వాలు పరస్పరం తీవ్రమైన చర్యలు ప్రకటించాయి. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. భారత్‌నుంచి పాక్ జాతీయులందరూ స్వదేశం వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇతర అన్ని చర్యలకన్నా సింధు జలాల ఒప్పందం నిలుపుదల పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీసే విషయం. అది సాగునీరు, తాగునీరు విడుదలను కుదిస్తుంది. ఈ భారత్ చర్యను యుద్ధం ప్రకటనగా పరిగణిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. సిమ్లా ఒప్పందాన్ని తిరస్కరించింది. భారత్ సర్జికల్ స్ట్రయిక్ లాంటి సాహసకృత్యానికి ఒడిగడితే తిప్పికొట్టేందుకు త్రివిధ దళాలను సిద్ధం చేసింది.

హిందూ టూరిస్టులపైనే గురిపెట్టి కాల్పులు జరిపిన ముష్కరుల పన్నాగం కశ్మీర్ సమస్య సజీవంగా ఉందని ప్రపంచానికి చెప్పటం కావచ్చు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో తీవ్రవాదాన్ని దాదాపు అణిచివేశామని, అభివృద్ధి పరుగులు తీస్తున్నదనే భారత ప్రభుత్వ బీరాలు అబద్ధాలని చాటిచెప్పటం కావచ్చు. హిందువులనే చంపటం ద్వారా భారత్‌లో హిందువులను రెచ్చగొట్టి హిందూ–ముస్లిం మతకలహాలతో కల్లోలం సృష్టించటం కావచ్చు. వారి వలలో చిక్కుకోకుండా దౌత్యమార్గాల్లో పాకిస్థాన్ మెడలు వంచటం, సరిహద్దుల్లో ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేయించటం, ఆర్థికంగా నష్టపరచటం వగైరా చర్యలు సత్ఫలితాలిస్తాయి. ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో పాకిస్థాన్ అడ్డా అని యావత్ ప్రపంచానికి తెలుసు. అందువల్ల పాకిస్థాన్‌ను దెబ్బతీయటానికి అంతర్జాతీయ సమాజంలో మన దేశానికున్న సద్భావాన్ని నేర్పుగా వినియోగించుకోవటం అవసరం. అయితే టెర్రరిస్టులు ఏదైతే కోరుకుంటున్నారో అందుకు పావుగా ఉపకరించే శక్తులకు మన దేశంలో కొదవలేదు. పాలక బిజెపి హిందూత్వ పేరుతో గత దశాబ్దంగా సాగిస్తున్న ముస్లిం వ్యతిరేక ద్వేష ప్రచారం అటువంటి శక్తులకు జంకుగొంకు లేకుండా చేసిన వాస్తవాన్ని విస్మరించరాదు. టెర్రరిస్టు మూకలు కాల్పులు జరుపుతుంటే తన అశ్వారూఢుడైన హిందువును కాపాడటానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టిన ముస్లిం త్యాగం ఈ శక్తులకు కనిపించదు. కశ్మీర్‌లో ఎప్పుడు ఎక్కడ తీవ్రమైన టెర్రరిస్టు చర్య జరిగినా సంఘ్ పరివార్, దాని అనుయాయి అల్లర చిల్లర సంస్థలకు భారత యూనివర్సిటీల్లోని కశ్మీరీ విద్యార్థులపై దాడులు చేయటం పరిపాటి అయింది. అటువంటి అవాంఛనీయశక్తులను ప్రభుత్వం తన మన అని చూడకుండా అణచివేయాలి. ఇతర ప్రాంతాల్లోని కశ్మీరీయులకు రక్షణ కల్పించాలి, భరోసా యివ్వాలి.

ప్రధాన సమస్య సీమాంతర ఉగ్రవాదం, దానికి సహాయమందిస్తున్న పాకిస్థానీ ఏజన్సీలు. 2021 లో పార్లమెంటు భవనంపై టెర్రరిస్టు దాడి నేపథ్యంలో 2002 మే/జూన్‌లో పాకిస్థాన్‌పై దాడికి భారత్ సైన్యం సర్వసిద్ధం చేయబడింది. యుద్ధం అనివార్యం అనే స్థితిలో అమెరికా సీనియర్ అధికారి రిచర్డ్ ఆర్మిటేజ్, విదేశాంగ మంత్రి కొలిన్ పావెల్‌లు పాకిస్థాన్‌నుండి టెర్రర్ శిబిరాలు ధ్వంసం చేస్తామనే హామీ పొంది ప్రధాని వాజ్‌పేయికి నచ్చజెప్పి యుద్ధ ప్రయత్నాలు విరమింపజేశారు. ఇప్పుడు భారత్ స్థితి అంతర్జాతీయంగా నాటికన్నా ఎంతో మెరుగ్గా ఉంది. పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రధాని మోదీ అమెరికా తదితర దేశాల సహాయం పొందవచ్చు. యుద్ధం దేనికీ పరిష్కారం కాదు. టెర్రరిజం మానవాళికి శత్రువు. దాన్ని అంతం చేయటానికి యుద్ధం పరిష్కారం కాదని అంతర్జాతీయ ఘటనలు పాఠం చెబుతున్నాయి.

# బెంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పన్నాగం విఫలం

అరుణ్ శ్రీవాస్తవ

బెంగాల్‌లో అధికసంఖ్యాకుల మతతత్వ ఉద్వేగాలను రేకెత్తించి, రాష్ట్రాన్ని జాతుల హింసకు వేదికగా మార్చడానికి ఆర్‌ఎస్‌ఎస్ రచించిన సమగ్ర వ్యూహం పూర్తిగా అమలు కాకముందే కుట్ర బట్టబయలైంది. ఏప్రిల్ 11న జరిగిన హింసాత్మక ఘటనల్లో ఇద్దరు మరణించిన తర్వాత, ముర్షిదాబాద్‌లోని హిందువులు, ముస్లింలు తాము ఒక మందుపాతర మీద నడుస్తున్నామని గ్రహించి, నిశ్శబ్దంగా వెనక్కితగ్గారు.

అయినప్పటికీ, ఆర్‌ఎస్‌ఎస్ ఒక పెద్ద పొరపాటు చేసిందనేది యదార్థం. తమ ప్రణాళిక ఇంత అవమానకరంగా విఫలమవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం ఊహించలేకపోయింది. బిజెపి రాష్ట్ర నాయకత్వంతో పోటీ పడే క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు మమతా బెనర్జీ రాజకీయ చతురతను సరిగ్గా అంచనా కట్టలేకపోయారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలలో సాధించిన ఎన్నికల విజయాల మాదిరిగానే బెంగాల్‌లో కూడా తమ వ్యూహం విజయం సాధించిపెడుతుందని వారు నమ్మారు. కానీ వారి కుట్ర విఫలమైంది.

టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికను తెలుసుకుని, అది విస్ఫోటంగా మారి బెంగాలీ సామాజిక, సాంస్కృతిక విలువలకు తీవ్ర నష్టం కలిగించటానికి ముందుగా, దానిని నిర్వీర్యం చేశారు. తమకు అందిన సంకేతాలను రాష్ట్ర పోలీసులు తీవ్రంగా పరిగణించి, వెంటనే చర్య తీసుకుని ఉంటే మొదటి రెండు రోజుల్లో జరిగిన సంఘటనలు కూడా జరిగి ఉండేవి కావు.



బెంగాల్ ప్రజలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన నాలుగు పేజీల బహిరంగలేఖలో కుట్ర గుట్టును విప్పారు. రాష్ట్రం లో అల్లర్లను, తప్పుడు ప్రచారం ద్వారా విభేదాలను సృష్టించడానికి కాషాయ దళం కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. శాంతిని పాటించాలని, ఈ 'ప్రమాదకరమైన ఉచ్చు' లో పడొద్దని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు. ముర్షిదాబాద్ మత ఘర్షణలకు కొద్దిగా ముందు కొందరు బిజెపి అనుకూల అంతర్గత వ్యక్తులు ఈ కుట్ర గురించి రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి తెలియజేశారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పది రోజుల రాష్ట్ర పర్యటన సందర్భంగా ఎన్నికల వ్యూహం బ్లూప్రింట్‌ను ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధం చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ అధినేతను కలవరపరిచిన రెండు అంశాలు ఏమిటంటే; హిందువులు తాము ఆర్‌ఎస్‌ఎస్‌తో ఉన్నట్లు గుర్తింపబడడానికి, తమ ఆకాంక్షల ప్రతినిధిగా దాన్ని అంగీకరించడానికి విముఖత చూపడం; రెండవది, మమతా బెనర్జీ వెనుక ముస్లిం ఓట్ల ఏకీకరణ. సీనియర్ నాయకులు, ప్రత్యేకించి ఉత్తర బెంగాల్‌కు చెందిన ప్రచారకులు పాల్గొన్న ఆ సమావేశంలో బెంగాలీ హిందువులకు, ఆ ప్రాంతంలోని ముస్లింలకు కూడా చేరువ కావాలని భాగవత్ సూచించారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్ ముస్లింలు టిఎంసికి వ్యతిరేకంగా ఓటు వేశారు. జనాభాలో ముస్లింలు దాదాపు 30 శాతం ఉన్నారు. ముస్లిం జనాభాలో చీలిక వస్తే తమ ప్రణాళిక విజయవంతమవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తోంది. ఆ పరిస్థితిలో మమతా బెనర్జీ ఈ ప్రాంతంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతారు. ఉత్తర బెంగాల్‌లో హిందువులకు చేరువయ్యేందుకు ఉత్తర భారత రాష్ట్రాల నుండి కొంతమంది ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులను, సీనియర్ స్థాయి కార్యకర్తలను నియమించారనే వాస్తవం నుంచి పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు. మమతా బెనర్జీ పట్ల ముస్లింల అసంతృప్తిని ఉపయోగించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ భావించింది. బెంగాలీ ముస్లింలు మమతా బెనర్జీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. కానీ ఇటీవల వారు అసంతృప్తికి గురవుతున్నారు. దిగువ స్థాయిలో టిఎంసి అవినీతి కూడా వారిని ప్రభావితం చేసింది. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) ముస్లింల గొంతుగా అవతరించిన తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. ఐఎస్ఎఫ్‌కు పెద్ద సంఖ్యలో బెంగాలీ ముస్లింల మద్దతు ఉంది. ఫుర్‌ఫురా షరీఫ్ పీర్ యొక్క మజార్‌ను అజ్మీర్ దర్గా షరీఫ్ తర్వాత రెండవ అత్యంత పవిత్రమైన సూఫీ పుణ్యక్షేత్రమని బెంగాలీ ముస్లింలు నమ్ముతారు. ఫుర్‌ఫురా మొదటి పీర్ అయిన ముహమ్మద్ అబూ బాకర్ సిద్ధిఖీ వారసులైన ఇద్దరు ఇస్లామిక్ మత గురువులు ఐఎస్ఎఫ్‌ను స్థాపించారు. ఇది ఒక మతపరమైనరాజకీయ పార్టీ. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎస్ఎఫ్‌కు కాంగ్రెస్, సిపిఐ(ఎం)తో ఎన్నికల అవగాహన ఉంది. అయితే ఆ ఎన్నికల్లో పెరుగుతున్న బిజెపి ప్రభావాన్ని చూసి భయపడిన ముస్లింలు టిఎంసికే ఓటు వేశారు. అయినా ఐఎస్ఎఫ్ తన ఇతర భాగస్వాముల కంటే ఎక్కువ ముస్లిం ఓట్లను పొంది, అసెంబ్లీలో ఆ కూటమి నుండి ఒక్క స్థానాన్ని గెలుచుకుంది.

ఏప్రిల్‌లో జరిగిన అల్లర్లకు వక్ఫ్ సవరణ బిల్లు పునాది వేసింది. ఐఎస్ఎఫ్, ఇతర ముస్లిం గ్రూపుల మద్దతుదారులు కలతచెంది దానిని ముస్లింలకు అవమానంగా, వారి షరియత్ జీవన విధానంపై దాడిగా భావించారు. ముస్లింలకు చేరువకావడానికి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అప్పటికే ప్రణాళికతో సిద్ధంగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ పరిస్థితిని ఉపయోగించుకుంది. సాధారణంగా మమతా బెనర్జీతో ఉన్న రాష్ట్రంలోని ముస్లింలు రెండు రాజకీయ వైఖరులతో చీలిపోయారు. మొదటిది, కొంతమంది దానిని తమ ఆర్థిక సాధికారత, లాభాల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. రెండవ వర్గం, టిఎంసిని తమ ప్రస్తుత అధికారాలు, భద్రతను కాపాడే సాధనంగా చూస్తున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళిక స్థానిక హిందువులపై పెద్దగా ప్రభావం చూపలేదు. దానికి బెంగాల్ హిందువులు దూరంగా ఉండటానికి రెండు అంశాలు కారణం. అవి స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌కు వలస వచ్చిన హిందువులపై ఆర్‌ఎస్‌ఎస్ ఎక్కువగా ఆధారపడటం, ఒకప్పుడు గణనీయమైన సంఖ్యలో బెంగాలీ హిందువులు ఉన్న అనేక విలాసవంతమైన ప్రాంతాలు ఇటీవలి సంవత్సరాలలో చేతులు మారాయి. ఇప్పుడు అవి బెంగాలీయేతర హిందువుల నివాసాలుగా మారాయి. కలకత్తా శివారు ప్రాంతాలు కూడా తమ ఆర్థిక, సామాజిక స్వభావాన్ని మార్చుకున్నాయి.

ఒబిసి, ఇబిసి జనాభాలో పెద్ద పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, బెంగాల్ రాజకీయ వ్యవస్థపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు నియంత్రణ సాధించడానికి వారు ఇంకనూ వాటికి చేయి అందించలేదు. బెంగాలీ హిందువులు తమ హిందుత్వ తత్వాన్ని అంగీకరించారని ఆర్‌ఎస్‌ఎస్ చెప్పుకుంటోంది. కానీ అది తప్పుడు కథనం. వలస వచ్చిన బెంగాలీయేతర ప్రజలే దాని ప్రధాన మద్దతుదారులు. ఈ ఏడాది బెంగాల్‌లో 3000 రామ్ నవమి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించినట్లు ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. కొంతమంది రాజకీయ నిబద్ధత కలిగిన బెంగాలీ హిందువులు ఈ ర్యాలీలలో పాల్గొనటం వాస్తవం. అయితే ఎక్కువగా పాల్గొన్నవారు బెంగాలీయేతర హిందువులు. ర్యాలీల సంఖ్య పెరగడం రాష్ట్రంలో వారి జనాభా పెరుగుదలను కూడా సూచిస్తుంది.

నిస్సందేహంగా గత 11 సంవత్సరాల మోదీ పాలనలో రాజకీయ దృశ్యం మారింది. మత–రాజకీయ కార్యకలాపాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కానీ ఒక పరిణామాన్ని స్పష్టంగా చూడాలి. ఈ పెరుగుదల బెంగాలీయేతరులు హిందుత్వ తత్వాన్ని అంగీకరించారని అర్థం కాదు. వారు తమ లాభాల కోసం, తమ వర్గ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిని ఉపయోగించుకుంటున్నారు. రామ్ నవమి ఊరేగింపుల సంఖ్య సహజంగానే పెరగడం, హనుమాన్ దేవాలయాలు పుట్టుకరావటంబట్టి బెంగాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ బలం పెరిగినట్లు భావించకూడదు.

నిజమైన కాషాయ కార్యకర్తల కంటే బిజెపి ఫిరాయింపుదారులే రాజకీయ వాతావరణాన్ని ఎక్కువగా కలుషితం చేశారు. అసలైన కార్యకర్తలు ఇప్పటికీ పాత హిందూ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు, దుర్గామాతను పరమదైవంగా భావిస్తూనే ఉన్నారు. కానీ సువేందు అధికారి వంటి నాయకుల నేతృత్వంలోని ఫిరాయింపుదారులకు, భౌతిక ప్రయోజనాలు, రాజకీయ అధికారాన్ని పొందడానికి 'జై శ్రీరామ్' నినాదం మాత్రమే మార్గం. ఈ ఫిరాయింపుదారులే రామ్ నవమి ర్యాలీలు, హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించడానికి ప్రధా న ప్రేరణ శక్తిగా ఉన్నారు. ఈ వ్యక్తులు మతపరమైన ఆచారాలలో రాజకీయ సందేశాలను చొప్పించడం ద్వారా తమ గుర్తింపును చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ముస్లింల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 'మనం', 'వారు' అనే రాజకీయాలు పెరుగుతున్న వైషమ్యానికి మూలంగా ఉన్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 'మనం', 'వారు' అనే అంశం వారి సమాజాలలో చీలికలు సృష్టించేందుకు కారణమైంది. ముర్షిదాబాద్, మాల్దా, దినాజ్‌పూర్ జిల్లాలు ముస్లింలు మెజారిటీగా ఉన్న జిల్లాలు. ఇక్కడ బిహార్ నుండి వచ్చిన వలస హిందువులు కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు.

2016లో తృణమూల్‌కు 51 శాతంగా ఉన్న ముస్లింల మద్దతు 2021లో 75 శాతానికి పెరిగింది, అయితే బిజెపికి హిందువుల మద్దతు 2016లో 12 శాతం నుండి 2019లో 57శాతానికి పెరిగి, ఆ తర్వాత 2021లో 50శాతానికి తగ్గింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అది మరో 12 శాతం తగ్గింది. ఇది ఆర్‌ఎస్‌ఎస్‌ను కలవరపాటుకు గురిచేసింది. అత్యంత బలమైన శక్తిగా ఎదిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ప్రయత్నంలో అది ఎంతకైనా తెగించడానికి సిద్ధంగా ఉంది. బెంగాల్‌లో మార్చి/ఏప్రిల్ 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఏడాది కంటే తక్కువ సమయం ఉంది. 2026 ఎన్నికల్లో హిందూ ఓటర్లను బిజెపి వైపు తిప్పుకోవడానికి మిగిలిన 11 నెలల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఇతర కార్యక్రమాలపై పనిచేయవచ్చు. ఆర్‌ఎస్‌ఎస్‌కు బెంగాల్‌లో విశ్రాంతి తీసుకోవడానికి సమయం లేదు. మోహన్ భాగవత్ భావిస్తున్నట్లుగా అంగ, వంగ, కళింగ (బిహార్, బెంగాల్, ఒడిషా)లను సంఘ్ పరివార్ పాలించాలి. ప్రస్తుతం వంగ మినహా అంగ, కళింగ బిజెపి పాలనలో ఉన్నాయి. మమతా బెనర్జీ అధికారంలో ఉన్నంతవరకు అది ఎంత కష్టమైనా సరే, ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి ఇప్పుడు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో వంగను స్వాధీనం చేసుకోవడంపైనే ఉంది.

# రాజ్యాంగ పరిధిలో శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు

రాజ్యాంగంలోని ముఖ్యమైన మూడు అంగాలైన కార్యనిర్వాహక, శాసనసభ మరియు న్యాయవ్యవస్థల మధ్య సహకారం, సమన్వయం ఉండాలి, కానీ వీటిమధ్య కాలానుగుణ ఘర్షణ చోటు చేసుకోవటం దురదృష్టకరం. మొదటగా, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను రాజ్యాంగం ప్రకారం ఆమోదం తెలపకుండా మూలాన పడేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ తమ తీర్పులో ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు బిల్లులను ఎక్కువ కాలం ఏదో ఒక నిర్ణయం తీసుకోకుండా నిలిపివుంచే అధికారం లేదని చెప్పారు. అసాధారణ సందర్భాల్లో మాత్రమే గవర్నర్ బిల్లులను రాష్ట్రపతికి పంపాలని న్యాయమూర్తులు చెప్పారు. ఈ సందర్భంగా గవర్నర్ అలాగే రాష్ట్రపతి ఇద్దరి ప్రత్యేక అధికారాల విషయంలో సుప్రీంకోర్టు సమీక్ష జరిపింది. 1987లో కూడా శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది, సుప్రీంకోర్టు గవర్నర్‌ను తీవ్రంగా మందలించింది. అయినా మన గవర్నర్‌లలో కొందరి ప్రవర్తన తీరు మారలేదు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను కూడ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నానా ఇబ్బందులూ పెట్టారు. సుప్రీంకోర్టు సూచనలు, సలహాల కంటే వారిని గవర్నర్లుగా నియమించిన కేంద్రంలోని అధికార పార్టీకి విధేయత చూపటం మేలు అన్నట్లుగా ఉంది ఆ గవర్నర్‌ల తీరు. అయితే, ఇప్పుడు సుప్రీంకోర్టు మూడు నెలల్లోపు అటువంటి బిల్లులను ఆమోదించాలని, గవర్నర్‌తో పాటు రాష్ట్రపతిని కూడా ఆదేశించ డం ద్వారా సుప్రీంకోర్టు తన అధికారాన్ని అతిక్రమించినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చర్చ ఏమిటంటే, దానికి అలా చేసే అధికారం ఉందా? లేదా? అనేది సమస్యగా ఉంది. కనీసం, దానికి కాలపరిమితిని నిర్ణయించాల్సిన అవసరం లేదు. అది పార్లమెంటు మాత్రమే చేయగల రాజ్యాంగ సవరణకు దారి తీయవచ్చు అని కొందరు. సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాన్ని ఉపయోగించుకుంది అని మరికొంద రు నిపుణులు పరస్పర భిన్నంగా వాదిస్తున్నారు. రాజ్యాంగ విషయాలలో సుప్రీంకోర్టు తన న్యాయ సమీక్షాధికారాన్ని ఉపయోగించకుండా మౌనంగా ఉండలేదు. రాజ్యాంగ విషయంలో చట్టాన్ని వ్యాఖ్యానించటం దాని విధి. ఇప్పుడు, అసలు తప్పు తమిళనాడు గవర్నర్‌దే అయినా, ఇతరులు జాగ్రత్తగా వ్యవహరించి ఉండవచ్చు. గతంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వం స్థిరపడిన ఆచారాలతో, ముఖ్యంగా రాష్ట్రాల ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయాలలో నిరంతర సంఘర్షణకు గురైనప్పు డు, హోం మంత్రిత్వ శాఖ కీలక మధ్యవర్తి పాత్ర పోషించడంతో విభేదాలు నిశ్శబ్దంగా పరిష్కరించబడ్డాయి. అరుదుగా ఇటువంటి విషయాలు న్యాయవ్యవస్థ జోక్యం కోసం వచ్చాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా ఈ శైలి అనవసరమైన ఘర్షణ, వ్యాజ్యాల ద్వారా భర్తీ చేయబడింది. పర్యవసానంగా, కొందరు గవర్నర్ల మాదిరిగానే, సుప్రీంకోర్టు కూడా ఇప్పుడు క్రియాశీల పాత్రను పోషిస్తోంది. శాసనసభల విషయానికొస్తే, అవి బాక్సింగ్ లేదా రెజ్లింగ్ రింగులుగా మారుతున్నాయి. కార్యనిర్వాహకవర్గం పాలకపార్టీ సైద్ధాంతి క లక్ష్యాలను అనుసరిస్తోంది. అది ఘర్షణలను మరింత తీవ్రతరం చేసింది. మూడు రాజ్యాంగ అంగాలు చెక్స్ అండ్ బ్యాలెన్స్ పద్ధతిలో పరస్పర సహకారం, సమన్వయంతో తమపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి తమను తాము మంచి ఉదాహరణగా చూపించుకోవాలి.

డాక్టర్ బైశెట్టి కవిత,
అసిస్టెంట్ ప్రొఫెసర్ (పొలిటికల్ సైన్స్)
కెజిసి, హన్మకొండ.

# సింగరేణి మెడికల్ అటెండెన్స్ రూల్స్ సవరించాలి

లేఖ

కోల్ ఇండియాలో సవరించిన మెడికల్ అటెండెన్స్ రూల్స్ సింగరేణిలో అమలు పరచాలని సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో జరిగిన వేజ్ బోర్డ్ స్టాండర్డ్ డైజేషన్ కమిటీలో జరిగిన ఒప్పందం మేరకు ప్రస్తుతం గుర్తించిన గుండె జబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్టు, పక్షవాతం, మూత్రపిండ జబ్బులు, ఎయిడ్స్, మెదడు సంబంధించిన వ్యాధులతోపాటు లివర్ సిర్రోసిస్ వ్యాధిని కూడా దీర్ఘకాలిక వ్యాధి గా గుర్తించారు. దీనివలన మెడికల్ బోర్డ్ నిర్ధారణ చేసేవరకు కార్మికుని మూల వేతనం, కరువు భత్యం, ప్రత్యేక కరువు భత్యంలో యాభై శాతం చెల్లిస్తున్నారో అదే విధంగా లివర్ సిర్రోసిస్ వ్యాధికి కూడా ప్రత్యేక సెలవుతో కూడిన వేతనం చెల్లించవలసి వస్తుంది. కార్మికుల ఆహార అలవాట్లు, అధిక శ్రమ, ప్రకృతి విరుద్ధ పని స్థలాలు, అవిశ్రాంతి, నిద్ర లేమి, అలసట వలన ఈ లివర్ సిర్రోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. కావున సింగరేణి యాజమాన్యం ఈ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించాలి. రిటైర్డ్ కార్మికుల సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో కూడా లివర్ సిర్రోసిస్ వ్యాధిని దీర్ఘకాలిక వ్యాధి జాబితాలో చేర్చి అవైద్య సౌకర్యం అందించాలని విశ్రాంత కార్మికులు వేడుకుంటున్నారు.

ఆళవందార్ వేణు మాధవ్

# క్షేత్రస్థాయిలో అందరికీ మేలుచేసే చట్టం భూ భారతి!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ 24(ఆర్వోఆర్) చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టంతో భూ వివాదాలు ఇక ఉండవని, భూ యజమానులకు, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతోని ఈ చట్టాన్ని రూపొందించామని భూ భారతి పోర్టల్‌ను అంబేడ్కర్ జయంతి రోజున ఆవిష్కరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

'తెలంగాణ ప్రాంతంలో వందల ఏళ్ల నుంచి భూమి చుట్టూనే పోరాటాలు జరిగాయి. నాడు కొమరం భీమ్ 'జల్ జంగల్ జమీన్ ' నినాదంతో పోరాటాలు చేసినా.. నిజాం కు వ్యతిరేకంగా జాగిర్దారి, దేశ్ముఖ్, భూస్వామ్య దొరల కబంధహస్తాల నుంచి... భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తికోసం చేసిన పోరాటాలు.. లక్షల ఎకరాలు పంచిన చరిత్ర తెలంగాణలో ఉన్నది. ఆ పోరాటాల నేపథ్యంలోనే రక్షిత కౌలుదారీ చట్టాలు, ఇనం దారి చట్టాలు, భూ సంస్కరణల చట్టాలు వచ్చాయి. ఈ చట్టాలను కాపాడటానికి భూ కమతాలకు సంబంధించిన రికార్డుల మెయింటెనెన్స్ నిమిత్తం రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో అధికారంలోనికి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం, గత కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆర్ ఓ ఆర్ చట్టములో లోపాలను సరిదిద్దాలని, అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా భూ యజమానులకు భరోసాగా ఉండే విధంగా కొత్త చట్టాన్ని ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. కొత్త చట్టంపై లోతుగా పరిశీలన జరపకుండా, అభ్యంతరాలను స్వీకరించకుండా, గ్రామ స్థాయిలో దీనిపై చర్చించకుండా ధరణి పోర్టల్ ను తీసుకొచ్చింది. గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ యంత్రాంగాన్ని లేకుండా చేసింది. దీంతో క్రింది స్థాయిలో భూమిని అమ్ముకోవాలన్న కొనుక్కోవాలన్నా అనేక సమస్యలు తలెత్తినవి. వీటిని పరిష్కరించేందుకు కూడా ధరణిలో వీలు లేకుండా చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు దీనిపై వివిధ స్థాయిలలో సదస్సులు, సమీక్షలు చేపట్టి భూభారతి చట్టాన్ని రూపొందించింది. ఈ నూతన చట్టంపై గ్రామ, మండల, రెవిన్యూ డివిజన్ స్థాయిలో అవగాహన కల్పిస్తూ సదస్సు నిర్వహిస్తూ ప్రజల నుండి అభిప్రాయం సేకరిస్తూ వాటి ఆధారంగా జూన్ రెండు నుంచి అమలులోనికి తెస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**ఈ చట్టంలో ప్రధాన అంశాలు:**

1. భూమి హక్కుల రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు ఎవరైనా పట్టాలు పొందితే.. వాటిని రద్దు చేయాలంటూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సిసిఎల్ఎ)కు ఎవరైనా దరఖాస్తు చేయవచ్చని భూపార్టీ చట్టంలోని 16 వ సెక్షన్, 15వ నిబంధన స్పష్టం చేస్తుంది. ధరణిలో ఇలాంటి నిబంధన లేకుండే. ఇండ్ల స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు నిర్వహిస్తారు. భూదార్ కార్డులు జారీ చేస్తారు.

**గ్రామ రెవెన్యూ రికార్డుల వివరాలు నమోదు :**

గ్రామ రెవెన్యూ రికార్డుల గురించి ధరణి చట్టంలో ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ లోపాన్ని సవరించి కొత్త భూభారతి చట్టంలో గ్రామ రెవెన్యూ రికార్డుల పేరుతో సెక్షన్ 13, నిబంధన 12 చేర్చారు. దీని ప్రకారం గ్రామ పహాణి, ప్రభుత్వ భూములు, నీటి వనరుల భూముల రికార్డులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తారు. మ్యూటేషన్ జరిగిన ప్రతిసారి గ్రామ భూ లెక్కల్లో మార్పులు జరుగుతాయి. ఏటా డిసెంబర్ 31న గ్రామ రెవెన్యూ రికార్డులను ముద్రించి విడిగా భద్రపరుస్తారు. గతంలో ధరణి పోర్టల్ అమలులోనికి వచ్చిన తర్వాత గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ నిలిచిపోయింది.

**అప్పీలు వ్యవస్థ ఏర్పాటు :**

గతంలో ధరణి పోర్టల్‌లో క్రింది స్థాయి నుండి పై స్థాయికి అప్పీలు చేసుకునే అవకాశం లేకుండే. ఏమైనా కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నేడు తాసిల్దారులు జారీ చేసే పాస్ పుస్తకాల్లో లేదా భూధార్ పై ప్రజలు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెవిన్యూ డివిజనల్ అధికారి( ఆర్డీవో )కి అప్పీలు చేసుకునేందుకు కొత్త చట్టంలో సెక్షన్ 15, నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు రెండోదశలో అప్పీలు చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చి తీర్పుపై అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్‌లో అప్పీలు చేసుకోవచ్చు.

* భూ భారతీ హక్కుల రికార్డుల్లో నమోదైన తర్వాత భూమి యజమాని రూ.300 రుసుము చెల్లించి దరఖాస్తు చేస్తే పట్టేదారు పుస్తకం జారీ చేస్తారు.

* భూమి యజమాని లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో సర్వే చేయించుకుని పటం తయారు చేయించుకోవాలి. మండల సర్వేయర్ దాన్ని సరిచూచిన తర్వాత పట్టేదారు పుస్తకములో పటాన్ని నమోదు చేస్తారు.

* పాసు పుస్తకంలో హక్కుల రికార్డులు సరిగా లేవని అభ్యంతరాలు తెలుపుతూ దరఖాస్తు చేస్తే తహసిల్దార్ పరిశీలించి సరి చేస్తారు. దీనిపై కూడా అభ్యంతరాలు ఉంటే ఆర్డిఓకు, ఆ తర్వాత కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చు.

* కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన 'భూభారతి' లో అప్పీళ్లు, ట్రిబునళ్లు విఎల్ఎ, విరాసత్ తదితర అంశాలు బాగున్నవని రైతులు చెపుతున్నారు. అయితే వాలంటీర్ల వ్యవస్థ పైరవికారులకు, మధ్య దళారీలకు కేంద్రంగా మారుతుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. అలాగే కాస్తు కాలం ఏర్పాటు, సమగ్ర భూసర్వేను కొత్త చట్టంలో చేర్చకపోవడం పై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

భూభారతిలో విరాసత్ అమలు, సాంకేతిక వివాదాలకు అప్పీలు, న్యాయవివాదాలకు ల్యాండ్ ట్రిబ్యునల్స్ భూ సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. విరాసత్ అమలుకు సంబంధించి కొత్త చట్టంలో అనేక మార్పులు చేశారు. ఏకకాల రిజిస్ట్రేషన్, ముటేషన్ విధానాన్ని రద్దు చేశారు.

గతంలో లాగా కాకుండా కుటుంబ సభ్యులందరికీ నోటీసులు జారీ చేసి వారి నుంచి అంగీకారం తీసుకున్న తర్వాతనే సెక్షన్ 4 ప్రకారం అమలు చేయనున్నారు. ఈ విధానంతో కుటుంబంలో గొడవలకు ఆస్కారం ఉండదని సమాచారం. రెండు దశలు ఏర్పాటు చేసిన అప్పీళ్ల వ్యవస్థ కూడా భూభారతి ద్వారా వచ్చిన పెద్ద మార్పుగా భావిస్తున్నారు. సాంకేతిక సమస్యలకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో అప్పీళ్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. న్యాయ వివాదాలకు ల్యాండ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తారు. ఇవి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తారా? రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తారా స్పష్టత రాలేదు. అయితే అప్పీళ్లకు ట్రిబ్యునల్స్ ఏర్పాటుతో ఇప్పటివరకు ఉన్న భూసమస్యలకు పరిష్కారం దొరకడంతోపాటు కొత్తగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. భూ భారతిలో సాదా బైనమాలపై కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. 2014 జూన్ రెండుకు ముందు సాదా బైనామాల ద్వారా జరిగిన సెక్షన్ 6 కింద క్రమబద్ధీకరిస్తారు.

**విఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ:**

ధరణి ఏర్పాటు తర్వాత తొలగించిన విఆర్వో, ఇఆర్ఏ వ్యవస్థ స్థానంలో విలేజ్ లెవెల్ ఆఫీసర్(విఎల్ఓ) వ్యవస్థను కొత్త చట్టంలో పొందుపరిచారు. వీరు గతంలో లాగా తమకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండి ఆ భూ సమస్యల పరిష్కారంకోసం పనిచేస్తారు. ఇవన్నీ భూభారతి ద్వారా వచ్చిన పెద్ద మార్పులని భావిస్తున్నారు.

**పార్ట్ బి భూములు పరిష్కారం దిశగా**

2017లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల పక్షాన సందర్భంగా 30కి పైగా వివాదాలు ఉన్న దాదాపు ఏడు లక్షల ఎకరాల భూములను 'పార్ట్ బి' అనే మాడ్యూల్ క్రియేట్ చేసి అందులో తోసేశారు. అప్పటి నుంచి సంబంధిత భూ యజమానులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూభారతి లో వీటిని పరిష్కరిస్తామని పేర్కొన్నా సాధ్యాసాధ్యాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ సమస్యలను సీరియస్ గా తీసుకొని పరిష్కారానికి పూనుకున్నా ఏండ్లు గడుస్తాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా రెవిన్యూ, అటవి, దేవాదాయ, వక్ఫ్ భూముల వివాదాలు మాత్రం సమగ్ర భూ సర్వే జరిగితేనే పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు.

**రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం :**

తెలంగాణలో దాదాపు రెండు లక్షల ఎకరాలు ఈ రెండు శాఖల మధ్య వివాదంలో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి రెవెన్యూ అటవీ శాఖలు పలు జిల్లాల్లో జాయింట్ సర్వే చేసిన, ఇరు శాఖల మధ్య 30 ఏళ్లుగా సమస్య కొలిక్కి రాలేదు. అలాగే వక్స్ బోర్డ్ కు చెందిన భూముల్లో మూడింటి రెండు వంతులు భూములు అన్యాక్రాంతమయ్యాయి.

**కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలి!**

గత బిఆర్ఎస్ సర్కార్ 2020లో ధరణి పోర్టల్ లో కాస్తు కాలాన్ని తొలగించింది. ఎవరు లీజుకు తీసుకున్న పట్టేదారును మాత్రమే అసలు యజమానిగా గుర్తించింది. పట్టేదారు ఎవరున్నా సరే భూమిని క్షేత్రస్థాయిలో దున్నే వ్యక్తిని కాస్తుదారు అంటారు. కొత్త రెవిన్యూ చట్టం భూభారతిలో కాస్తు కాలం తిరిగి పునరుద్ధరించుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు వాగ్దానం చేసింది. కాస్తుకాలం ఉండాలా వద్దా అనే అంశంపై వివిధ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కమ్యూనిస్టులు మాత్రం ఉండాల్సిందేనని పట్టుబడుతున్నారు. ధరణి ఏర్పాటు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కాస్తు కాలం పై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ కాలం ఉంటే భూ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావని తేల్చారు. ఎన్నికల సందర్భంలో కాస్తు కాలాన్ని పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ దానిని భూభారతిలో మాత్రం చేర్చలేదు.

**సమగ్ర భూ సర్వే నిర్వహించాలి**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సమగ్ర భూ సర్వే ఒకటే పరిష్కారం. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాలు పరిష్కారం అవుతాయి. గత సర్కార్ 1971 చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఉన్న కాస్తు కాలాన్ని తొలగించింది. ప్రస్తుత భూభారతి చట్టంలో ఈ వివాదాన్ని చేర్చలేదు.

తాతలు, తండ్రుల కాలం నుంచి భూమిని నమ్ముకున్న చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా కాంగ్రెస్ సర్కార్ వెంటనే కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలి. భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కరించబడాలంటే సమగ్ర భూ సర్వేను వెంటనే ప్రభుత్వం చేపట్టాలి.

*(రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టంపై అవగాహన కలిగిస్తూ జిల్లా, మండల కేంద్రాల్లో రైతు సదస్సులు జరుపుతున్న నేపథ్యంలో )*

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## పాట్నా కోర్టుకు బాంబు బెదిరింపు



**పట్నా :** పట్నా కోర్టులో బాంబు పెట్టామంటూ శుక్రవారం అగంతకులు ఒక మెయిల్ పంపించారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం ఉదయం జిల్లా కోర్టు జడ్జికి అతి సమీపంలో ఆర్‌డిఎక్స్ బాంబు పెట్టామని పట్నా సివిల్ కోర్టుకు ఒక మెయిల్ వచ్చిందని అడిషనల్ ఎస్‌పి దీక్ష తెలిపారు. దాన్ని ఆధారంగా చేసుకొని ఎటిఎస్, బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ టీమ్‌తో కలిసి కోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించామని, కానీ అక్కడ ఎలాంటి బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లేవన్నారు. ఎవరో ఆకతాయిలు బాంబు బెదిరింపులకు పాల్పడ్డారని వారిని త్వరలోనే పట్టుకొని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్‌పి తెలిపారు.

## తెరిచే ఉన్న కర్తార్‌పూర్ కారిడార్




**చండీగఢ్ :** పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు నడుమ పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాకు వెళ్ళే భక్తుల కోసం కర్తార్‌పూర్ కారిడార్‌ను తెరిచే ఉంచారు. సిక్కుమత వ్యవస్థాపకుడు గురు నానక్ దేవ్ చివరి రోజుల్లో నివసించిన గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను భారతదేశంలోని గురుదాస్‌పూర్‌లో ఉన్న డేరా బాబా నానాక్ ఆలయాన్ని ఈ కారిడార్ కలుపుతుంది. శుక్రువారం నాడు సిక్కులు కర్తార్‌పూర్ కారిడార్ద్వారా గురుద్వారా దర్బార్ సాహిబ్‌లో ప్రార్థనలు చేశారు. ''ఈ కారిడార్‌ను భక్తుల కోసం తెరిచే ఉంచాలి'' అని షహీద్ భగత్‌సింగ్ నగర్ జిల్లాకు చెందిన సిక్కు భక్తుడు అన్నారు. కర్తార్‌పూర్ కారిడార్ 2019 నవంబర్ 19న గురునానక్ దేవ్ 550వ జయంతి రోజున ప్రారంభమైంది. ఏడాది పొడువునా పాకిస్తాన్‌లో ఉన్న చారిత్రక గురుద్వారాను భారతీయ భక్తులు దర్శించుకునేందుకు వీసా లేకుండా అనుమతిస్తారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం ప్రకారం రోజుకు 5వేల మంది భక్తులను సరిహద్దు దాటి వెళ్ళేందుకు అనుమతిస్తారు. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో ఈ కారిడార్‌ను తెరిచే ఉంచుతారా? లేదా? అనే అంశంపై సిక్కు భక్తులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

**పాకిస్తానీయులను పెళ్ళి చేసుకున్న మహిళలకు ఇక్కట్లు!**

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారతదేశాన్ని 48 గంటల్లో విడిచిపోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో పలువురు పాకిస్తానీలు పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్‌లోని అట్టారి–వాఘా సరిహద్దు నుంచి శుక్రవారం వారి స్వదేశానికి తిరుగుముఖం పట్టారు. అయితే, భారతదేశ పాస్ట్‌పోర్ట్ కలిగి పాకిస్తానీలను వివాహం చేసుకున్న కొంత మంది మహిళలు తమకు సరైన పత్రాలు ఉన్నప్పటికీ పాకిస్తాన్‌కు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భారతదేశంలోని తమ బంధువులను కలుసుకునేందుకు వచ్చామని, అయితే పాకిస్తాన్ జాతీయులు 48 గంటల్లో దేశాన్ని విడిచిపోవాలడంతో వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. పెళ్ళి చేసుకొని కరాచీకి వెళ్ళిపోయిన షానిజా అనే భారతీయ మహిళ తాను హృద్రోగి అయిన తన తల్లితో 15 రోజులు ఉండేందుకు ఢిల్లీకి వచ్చానని, అయితే, వెనక్కివెళ్లేందుకు తనను వెనక్కి వెళ్ళనివ్వడం లేదని, తన భర్త, మామ వాఘా సరిహద్దు వద్ద ఎదురుచూస్తున్నారని పిటిఐతో చెప్పారు. ఆమె తనకు భారత పాస్‌పోర్ట్ ఉన్నదని తెలిపారు. ఇద్దరు పిల్లలతో భారత్‌కు వచ్చిన మరో మహిళ కూడా తనను పాకిస్తాన్‌కు వెళ్ళేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ''నాకు భారత పాస్ట్‌పోర్ట్ ఉంది. నా ఇద్దరు పిల్లలకు పాకిస్తాన్ పాస్‌పోర్ట్‌లు ఉన్నాయి. మేము అన్ని పత్రాలను, నా పెళ్ళి సర్టిఫికెట్‌ను చూపించినా వారు వినడం లేదు. భారతీయ పాస్ట్‌పోర్ట్ ఉన్నవారిని అటు వైపు వెళ్ళనివ్వబోమని చెబుతున్నార''ని ఆమె అన్నారు. ''నేను నా పిల్లలను ఎలా తీసుకెళ్ళాలని'' ప్రశ్నించారు. ఇరవై ఏళ్ల క్రితం పాకిస్తాన్ వ్యక్తితో పెళ్ళి చేసుకొని అక్కడే నివసిస్తున్న అరూడా ఇమ్రాన్ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాను ఇప్పటికే పాకిస్తాన్ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనతో వచ్చిన ఇద్దరు కుమార్తెలు పాకిస్తానీ పౌరులేనని, అన్ని పత్రాలు ఉన్న పాకిస్తాన్‌కు తిరిగి వెళ్లనివ్వడం లేదన్నారు. అరూడా ఇమ్రాన్ రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో నివసిస్తున్న తన తల్లిదండ్రులను చూసేందుకు వచ్చారు. పంజాబ్‌లోని మాలేర్‌కొట్లాలో తన తల్లిదండ్రులను చూసేందుకు రెండు నెలల క్రితం వచ్చిన రబియా అనే మరో మహిళదీ అదే పరిస్థితి. ఆమె మూడేళ్ళ క్రితం పాకిస్తాన్ వ్యక్తితో పెళ్ళి చేసుకొని అక్కడే ఉంటున్నారు. భారత పాకిస్తాన్ ఉన్న అఫ్షీన్ జహంగీర్ అనే మహిళ తనను పాకిస్తాన్‌కు తిరిగి వెళ్ళనీయకపోతే విషయం తాగుతానని బెదిరించారు.

## పుణెలో 111 మంది పాక్ జాతీయుల గుర్తింపు

**పుణె :** మహారాష్ట్రలోనే పుణెలో 111 మంది పాక్ జాతీయులు నివసిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఈనెల 27వ తేదీ నాటికి వారంతా భారత్ విడిచి వెళ్లాలని ఆదేశించింది. పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన అన్ని రకాల వీసాలు రద్దు చేసిన నేపథ్యంలో పుణెలో ఉండే పాక్ జాతీయులను వెళ్లిపోవాలని అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. అయితే మెడికల్ వీసాలకు మాత్రం మరో రెండు రోజుల గడువు ఉంది. కాగా, పుణె జిల్లా కలెక్టర్ జితేంద్ర దూది మీడియాతో మాట్లాడుతూ వీసా జారీ అధికారులు, పాస్‌పోర్టు కార్యాలయం నుంచి నుంచి పాకిస్థాన్ జాతీయుల డేటాను సేకరించామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 111 మంది పాక్ జాతీయుల సమాచారం సేకరించామని, గడువు ముగిసే నాటికి అందరూ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించామన్నారు. పర్యాటకం, వైద్య చికిత్స వంటి తదితర కారణాల కోసం వీసాలు జారీ అయ్యాయని చెప్పారు. అయితే వైద్య చికిత్స చేయించుకుంటున్న వారు మాత్రం ఈనెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, ఛత్రపతి సంభాజీనగర్ పోలీసులు మాట్లాడుతూ 57 పాక్ జాతీయులు దీర్ఘకాలి వీసాలపై నివసిస్తున్నారని చెప్పారు. ఈ కేసులో తదుపరి ఆదేశాల కోసం కలెక్టర్ కార్యాలయం వేచి చూస్తోందని ఓ జిల్లా అధికారి వెల్లడించారు.



## జంతర్ మంతర్ వద్ద ఐవైసి తిరంగా ర్యాలీ

### పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు నివాళి

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తిరంగా ర్యాలీ నిర్వహించింది. బాధితులకు నివాళి అర్పించింది. ఐవైసి జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, జాతీయ మీడియా ఇన్‌చార్జ్ వరుణ్ పాండేతో సహా అనేక మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ స్క్వేర్ నుండి జంతర్ మంతర్ వరకు కొన్ని వందల మీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ 'వందేమాతరం, భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు. పాకిస్థాన్ చర్యలు ఖండించారు. మన దేశ ప్రజలను దారుణంగా హత్యచేసిన దోషులను తటస్థీకరించాలని తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు భాను పిటిఐకి చెప్పారు. ఇప్పుడు దౌత్యం కాదు, ప్రత్యక్షంగా, కఠినంగా స్పందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశం మొత్తం సైన్యం, ప్రభుత్వానికి మద్దతుగా నిలిస్తుందని, అయితే ప్రతిస్పందన మాటల్లో కాకుండా సరిహద్దులో కనిపించాలన్నారు. గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తన స్పష్టమైన మద్దతును తెలియజేసిందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వంతో సమన్వయం, సహకారం, భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, తాము ఎప్పటికప్పుడు ఉగ్రవాదం, వేర్పాటువాదంతో పోరాడామని భాను చెప్పారు. ఉగ్రవాద దాడిని మానవత్వానికి వ్యతిరేక యుద్ధం అని ఆయన అభివర్ణించారు. మన దేశంలోని అంతర్గత ప్రాంతాలలోకి చొరబడటం, అమాయక ప్రజలను చంపడం, సరిహద్దు వెంబడి నక్కి ఉన్న ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ప్రభుత్వం నుండి బహిరంగ మద్దతు లభించడం వల్లనే ఇదంతా సాధ్యమవుతుందన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయాల్సిన అవసరం ఉందని, దౌత్యపరమైన ఒత్తిడి, సైనిక చర్య మధ్య సమతుల్యమైన కానీ నిర్ణయాత్మక విధానాన్ని అవలంబించాలని, ముఖ్యంగా ప్రతి అమరవీరుడి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. ఇది కేవలం దాడి కాదు, ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధమని, దీన్ని ఎలాగైనా గెలవాలన్నారు.

## 'లష్కరే' టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీపోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం. పహల్గాంలో ఉగ్రదాడి వెనక లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కశ్మీర్‌లో చురుగ్గా పనిచేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకొన్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కొనేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు. గత రెండేళ్లలో జరిగిన సోనమార్గ్, బూటపత్రి, గందర్బాల్ జరిగిన హైప్రొఫైల్ దాడుల్లో కూడా ఇవి పాల్గొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో బూటపత్రిలో ఇద్దరు ఆర్మీ సిబ్బందిని హత్య చేసింది. అదే నెలలో సోనమార్గ్ సొరంగంలో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను కాల్చిచంపింది. ఈ ఉగ్ర బృందంలో కీలక సభ్యుడైన జునైద్ అహ్మద్ భట్ డిసెంబర్‌లో భద్రతా దళాలు దాచిగామ్ వద్ద ఎన్‌కౌంటర్ చేశాయి. మిగిలిన ఉగ్రవాదులు పారిపోయారు. ఆ తర్వాత ఈ బృందం చాలాకాలం అడవుల్లో ఎవరి కంటా పడకుండా గడిపింది. ఈ బృందం నేరుగా హాఫీజ్ సయీద్, అతడి డిప్యూటీ సైఫుల్లా నుంచే ఆర్డర్లు తీసుకొనేది. ఇంటెలిజెన్స్ బృందాల అంచనాల ప్రకారం వీరికి భావజాలంతోపాటు ఇతర ఏర్పాట్లు వ్యూహాత్మకంగా సలహాలు, సూచనలు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, మిలిటరీ నుంచి వచ్చేవని తెలిపారు. ఈ ఉగ్రమూక పహల్గామ్‌లో మూడు ప్రదేశాల్లో అత్యధికమందిని చంపారు. ఈ ఉగ్రమూకలో హాషీమ్ ముసా, అలిభాయ్ పాక్ జాతీయులు. ఈ మొత్తం బృందంలో ప్రతి సభ్యుడిపైనా ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డ్‌ను ప్రకటించింది.

## స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేయొద్దు

### రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు మందలింపు



**న్యూఢిల్లీ :** వీర్ సావర్కర్‌కు మహారాష్ట్ర ప్రజలు ఎంతో గౌరవం ఇస్తారని స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేయడం తగదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. మళ్లీ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మందలించింది. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులపై ఎవరూ ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి అనుమతించమని పేర్కొంది. వారిని అపహాస్యం చేస్తే ఇకపై కోర్టు సుమోటోగా విచారణ చేపడుతుందని తెలిపింది. సావర్కర్‌పై వ్యాఖ్యల విషయంలో రాహుల్‌పై దాఖలైన కేసులో ఆయనపై క్రిమినల్ చర్యలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. రాహుల్‌పై ఫిర్యాదు చేసిన నృపేంద్ర పాండేకు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తనకు జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరించిన అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్‌గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. అయితే, దీనిపై అనేకసార్లు విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం (ఏసిజెఎం) రాహుల్‌కు రూ.200 జరిమానా విధించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఫుడ్ పాయిజన్

### 37 మంది పిల్లలు సహా 51 మందికి అస్వస్థత



**కోర్బా :** ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో వివాహ భోజనం తర్వాత ఫుడ్ పాయిజనింగ్ కారణంగా 37 మంది పిల్లలు సహా కనీసం 51 మంది అస్వస్థతకు గురయ్యారని పోలీసులు శుక్రవారం తెలిపారు. వారందరినీ కోర్బాలోని మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేర్పించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని ఒక అధికారి తెలిపారు. ఉర్గా పోలీస్ స్టేషన్ పరిధిలోని పహ్రిపారా గ్రామంలో గురువారం రాత్రి ఒక వివాహం జరిగిందని ఆయన చెప్పారు. వివాహ భోజనం తర్వాత, కొంతమంది వాంతులు, విరేచనాలు చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో చేరిన వారిలో 14 మంది బాలికలు, 23 మంది బాలురు, 11 మంది మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ కన్వర్ తెలిపారు. వారందరి పరిస్థితి సాధారణంగానే ఉందని తెలిపారు. ఫుడ్ పాయిజనింగ్‌కు ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడలేదు. దర్యాప్తు జరుగుతోందని పోలీసు అధికారి తెలిపారు.

## సోనియా, రాహుల్‌కు నోటీసులివ్వలేం

### ఇడి అభ్యర్థనకు ఢిల్లీ కోర్టు తిరస్కరణ




**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు ఢిల్లీ కోర్టు నిరాకరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఇడి కోరింది. ఈ విషయంలో తాము ఏమీ దాచట్లేదని.. ఈ కేసు విచారణకు ముందు అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి గాంధీ కుటుంబానికి అవకాశమిస్తున్నామని ఇడి అధికారులు తెలిపారు. నోటీసులు ఇచ్చే ముందు, ఏదైనా ఆర్డర్‌ను జారీ చేసేముందు అందులో ఏదైనా లోపం ఉందా అనే విషయాన్ని న్యాయస్థానం పరీక్షించాల్సి ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేవని..ఆ పత్రాలను దాఖలు చేయాలని ఇడి అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. వాటిని పరీక్షించిన అనంతరం నోటీసుల జారీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కేసు విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇడి.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపిలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

## ఉగ్రదాడి భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది : పవార్



**పుణె :** కశ్మీర్‌లో ఉగ్రవాదం ముగిసిందని కేంద్రం చెబుతున్నప్పటికీ పహల్గామ్ ఉగ్రవాద దాడి భద్రతా లోపాలను చూపిస్తుందని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ అన్నారు. తక్షణమే దిద్దుబాటు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం పవార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పహల్గామ్ వంటి సురక్షితమైన ప్రదేశంపై ఉగ్రదాడి జరిగిన దృష్ట్యా, కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని ప్రకటించడంలో జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాద దాడి దేశానికి వ్యతిరేకంగా ఉన్నందున, ఎవరూ ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదని సూచించారు. ఉగ్రదాడిపై చర్చించడానికి ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ఎన్‌సిపి (ఎస్‌పి) తరుపున ఎంపి సుప్రియా సూలే హాజరయ్యారన్నారు. ప్రభుత్వంతో సహకరించడానికి అన్ని పార్టీలు ఒక వైఖరి తీసుకున్నందు సంతోషంగా ఉందన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా, తము ప్రభుత్వంతో ఉంటామని, ఈ దాడిని ప్రభుత్వం మరింత తీవ్రంగా పరిగణించాలన్నారు. ఉగ్రవాద దాడికి నిఘా వైఫల్యం ఉగ్రవాద దాడికి దారితీసిందా అని విలేకరులు అడిగినప్పుడు ఆయన స్పందిస్తూ భద్రతా లోపాలు జరిగినట్లు కనిపిస్తోందని, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్‌లోని అన్ని సమస్యలు ముగిశాయని ప్రభుత్వం చిత్రించడానికి ప్రయత్నిస్తుందా అని ప్రశ్నించగా, రాజ్యాంగ నిబంధన రద్దు గురించి చెబుతున్నప్పుడు కశ్మీరీ ప్రజల అభిప్రాయం భిన్నంగా ఉందన్నారు. అయితే ఉగ్రవాద దాడి తర్వాత కశ్మీర్‌లో పర్యాటకం దెబ్బతింటుందని పవార్ భయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

## ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత




**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ డా. కృష్ణస్వామి కస్తూరిరంగన్ బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరిరంగన్ 1990–1994 వరకు యుఆర్ ఎసి డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్లపాటు (1994–2003) ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జెఎన్‌యు ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ చైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–09 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. కస్తూరిరంగన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన దార్శనిక నాయకత్వం, నిస్వార్థ సహకారం దేశానికి ఎల్లప్పుడూ గుర్తుండి పోతుందన్నారు. భారతదేశ అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చారని కీర్తించారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ప్రతిష్ఠాత్మక ఉపగ్రహ ప్రయోగాలను చేసిందని గుర్తు చేసుకున్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ మృతిపట్ల కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**సిఎం రేవంత్ రెడ్డి సంతాపం**

ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్‌గా, ముఖ్యంగా పిఎస్‌ఎల్‌వి, జిఎస్‌ఎల్‌వి ప్రయోగాల్లో వారు పోషించిన పాత్ర దేశం మరిచిపోదని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా అనేక పదవుల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ కస్తూరి రంగన్ మరణం దేశం ఒక గొప్ప ఖగోళ శాస్త్రవేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతిని తెలియజేశారు.

## సౌదీకి 100 బిలియన్ల ట్రంప్ ఆయుధ ప్యాకేజీ




**వాషింగ్టన్ :** మే నెలలో ట్రంప్ మూడు అరబ్ దేశాలలో పర్యటనకు వెళుతున్నారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియాలో కూడా ఆయన పర్యటిస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఆయన తొలి విదేశీ పర్యటన ఇదే. సౌదీ అరేబియాలో పర్యటన సందర్భంగా ఆ దేశానికి 100 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ ప్యాకేజీనీ ట్రంప్ ఆఫర్ చేస్తారని అమెరికా మీడియా పేర్కొంది. జోబైడెన్ గతంలో ఇలాంటి ప్యాకేజీని అమలు చేయడంలో విఫలమయ్యారు. సౌదీ,ఇజ్రాయెల్ సంబంధాల పునరుద్ధరణ చర్యల్లో ఆయన విఫలమయ్యారు. ఇప్పుడు ట్రంప్ సౌదీకి ఆయుధ ప్యాకేజీ ప్రతిపాదించనున్నారు. అమెరికా నుండి ఇతర దేశాలకు భారీగా ఆయుధాల ఎగుమతులు పెంచాలని ట్రంప్ యంత్రాంగం గట్టిగా కోరుకుంటున్నది. భారతదేశ ప్రధానమంత్రి మోదీ అమెరికా పర్యటన సందర్భంగా కూడా అమెరికా నుండి భారీగా ఆయుధాలు భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తైవాన్‌కు కూడా ట్రంప్ ఆయుధాలను భారీగా ఎగుమతి చేస్తున్నది.

## ఉత్తర సిక్కింలో చిక్కుకుపోయిన పర్యాటకులు..

### గాంగ్‌టక్‌కు తిరుగుముఖం

### శరవేగంగా అధికార యంత్రాంగం సహాయక చర్యలు



**గాంగ్‌టక్ :** హిమాలయ రాష్ట్రం సిక్కింలోని చుంగ్‌థాంగ్‌లో గురువారం నాడు కొండచరియలు విరిగిపడిన ఘటన కారణంగా వందలాది పర్యాటకులు చిక్కుకుపోయారు. చిక్కుకుపోయిన పర్యాటకులు శుక్రవారం అధికార యంత్రాంగం సహాయంతో మంగాన్ వైపు ప్రయాణం ప్రారంభించారు. ఉత్తర సిక్కింలోని మంగాన్ జిల్లాలో ఉన్నటువంటి చుంగ్‌థాంగ్ సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్‌కు 100కి.మీ.దూరంలో ఉన్నది. గురువారం నాడు చుంగ్‌థాంగ్‌లో దాదాపు 200వాహనాలు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వీరందరికీ ఒక గురుద్వారాలో షెల్టర్ కల్పించారు. చిక్కుకుపోయిన వందలాది పర్యాటకులను వాహనాలలో చుంగ్‌థాంగ్ నుంచి వయా సంగ్‌కలాంగ్ వద్ద పునర్నిర్మించబడిన బెయిలీ బ్రిడ్జి మీదుగా మంగాన్ జిల్లాకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశామని అధికారులు చెప్పారు. మంగాన్ పట్టణానికి చేరుకున్న టూరిస్టులు ఆ తర్వాత అక్కడనుంచి గాంగ్‌టక్ దిశగా వెళ్లిపోయినట్లు వారు చెప్పారు.మంగాన్ జిల్లా కలెక్టర్ అనంత్ జైన్, జిల్లా ఎస్‌పి సోనం దెట్చు భుటియా చిక్కుకుపోయిన పర్యాటకులు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు సహాయపడ్డారు.గురువారం కురిసిన భారీ వర్షాలమూలంగా బురద ప్రవహించి లాచెన్, లాచుంగ్ రోడ్లన్నీ మూసివేయబడ్డాయి. సాధ్యమైనంత వేగంగా మార్గాలను క్లియర్‌చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలియజేశారు. సిక్కిం గవర్నర్ ఓం ప్రకాష్ మాథుర్ మాట్లాడుతూ ఉత్తర సిక్కింలోని పలు ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడిన సంఘటనా స్థలి నుంచి పర్యాటకులు అందరూ వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటున్నారని చెప్పారు.

## రైతుల మేలుకు భూభారతి

ప్రజాపక్షం/అడ్డగూడూరు : బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి ధరిద్రం పోయి మన కాంగ్రెస్ ప్రభుత్వంలో భూభారతి వచ్చింది రైతులకు ఇబ్బందులు ఉండవని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని భూ భారతి అవగాహన సదస్సులో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు తో కలిసి పాల్గొన్న, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ ధరణి అనే దరిద్రం పోయి భూ భారతి అనే మంచి పథకం తెచ్చింది మన ప్రభుత్వం అన్నారు. భూ భారతి ద్వారా రైతుల సమస్యలు తీరుతాయన్నారు.



## గుండాల మండలానికి తహసీల్దార్‌ను నియమించాలి

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి తహసీల్దార్‌ను నియమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమని హరిచంద్ర ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌తో పాటు, ఆర్ఐ కూడా లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌తోనే ప్రభుత్వ కార్యక్రమాలు నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం చాలా మంది ప్రజలు, రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వస్తూ ఉంటారని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఆర్ఐలు లేకపోవడంతో పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయని, ప్రభుత్వ కార్యక్రమాలు సైతం ముందుకు సాగలేని పరిస్థితి నెలకొందని తక్షణమే మండలానికి తహశీల్దార్‌ను, ఆర్ఐను అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.



## జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌కు సన్మానం



ప్రజాపక్షం/సూర్యాపేట: కేసుల్లో ఉన్న నేరస్తులకు శిక్షల అమలు పెరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శుక్రవారం మోతె పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో మాధవమ్మకాలకు పోయి కన్న కూతురిని నరబలి ఇచ్చిన కేసులో సూర్యాపేట జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు నేరానికి పాల్పడిన తల్లికి ఉరి శిక్ష విధిస్తూ ఈనెల 11న ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కేసులో బాధితుల తరఫున కేసు వాదనలు వినిపించిన జిల్లా మొదటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌ను శుక్రవారం జిల్లా ఎస్‌పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు దర్యాప్తులో పోలీస్ శాఖ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన దర్యాప్తును కొనసాగిస్తుందన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కోర్టులతో సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. నేరాల్లో పక్కా ఆధారాలు సేకరించి రికార్డ్స్ నమోదు చేసి కేసుల దర్యాప్తులో జోడిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పోలీస్, లైజన్ అధికారి, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇండ్లు ఇవ్వడమే ధ్యేయం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇండ్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో 80 మంది నిరుపేదలకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన వాగ్దానాలన్నింటిని నెరవేరుస్తుందని అన్నారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజా ప్రభుత్వమని నిరూపించుకుంటున్నారు. లక్ష్మీపురం గ్రామంలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 2022లో సర్వే నెం. 437లో 4.37 ఎకరాల భూమిని కొనుగోలు పథకం కింద కొనుగోలు చేసినప్పటికీ గత ప్రభుత్వం అప్పటి నుంచి పెండింగ్‌లో పెట్టడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా అయిన తరవాత గుట్టలతో నిండిన ఈ స్థలాన్ని చదును చేయించి లేఅవుట్ ఏర్పాటుచేసి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు సబ్ కలెక్టర్, తహసీల్దార్‌ల పాత్ర మరువలేనిదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఎక్కడా లేని విధంగా 80మంది పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పట్టాలు ఇచ్చిన ఈ ఇంటి స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు సైతం నిర్మించి ఇస్తామని, ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేస్తామన్నారు. దీని ఫైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని పట్టాలు పొందిన వారందరికి ఇండ్లు కట్టిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబు తదితరులు ఉన్నారు.



## పహల్గామ్ ఉగ్రదాడి అమానవీయం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

ప్రజాపక్షం/సూర్యాపేట: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానవీయమని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో కృష్ణారెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశ పౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్య అని ఈ దాడిని దేశంలోని పౌర సమాజం అంత ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఉగ్రవాదు కేవలం హిందువులే లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామరస్యానికి దెబ్బతీయడానికేనని స్పష్టమవుతుందన్నారు. ఈ దాడిలో కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులపై జరిగిన ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా బాధిత కుటుంబాలకు అండగా దేశ ప్రజలు నిలబడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. మేడే ఉత్సవాలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, లత్తు పాల్గొన్నారు.

## యువజనులకు ఉపాధి కల్పన రక్షణ సాధనకు పోరాడుదాం

ఈనెల 29 యాదగిరిగుట్టలో జరుగు ఎఐవైఎఫ్ మూడవ మహాసభకు తరలిరండి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : యువజన యువకులకు ఉపాధి కల్పన రక్షణ సాధనకై పోరాడుదాం అని, ఈనెల 29 యాదగిరిగుట్టలో జరుగు ఏఐవైఎఫ్ మూడవ మహాసభకు తరలి రావాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ప్రజానాట్యమండలి ముఖ్య కార్యకర్తల సమావేశం భువనగిరి నరసింహ అధ్యక్షతన జరిగింది. యువకులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ భృతి పెన్షన్ అమలు చేయాలని చెక్క వెంకటేష్ తెలిపారు. బడుగు బలహీన వర్గాల యువకులకు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగులు ఉన్న యువకుల సమస్యలను చర్చించ బడతాయని వాళ్ల సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించబడతాయని అన్నారు. ఈ మహాసభకు ర్యాలీకి కళాకారులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గొర శ్రీరాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఇంజా హేమలత, సోమన సబిత, చింతల మల్లేష్, వస్పుల అఖిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ఖైదీలకు సౌకర్యాలు

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్



ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లా జైలులో ఖైదీలకు అన్ని వసతులతో పాటు, జైల పరిశుభ్రంగా ఉందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ తెలిపారు. ఒకరోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని జిల్లా జైలును సందర్శించారు. జైలులోని అన్ని బ్యారక్స్ ను, వంటగదిని, ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలు, భోజనాన్ని అన్నిటిని పరిశీలించారు. అంతేకాక ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నట్లు తెలిపారు. జైలులో సౌకర్యాలన్నీ పరిశీలించడం జరిగిందని, అన్ని బ్యారక్స్ ను పరిశీలించారని, అధికారుల ప్రవర్తన, సౌకర్యాలు, తదితర వివరాలగురించి ఖైదీలతో మాట్లాడి తెలుసుకోవడం జరిగిందని, జిల్లా జైలు పరిశుభ్రంగా ఉందని చెప్పారు. కాకుండా, నిబంధనల ప్రకారం ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ముఖ్యంగా ఖైదీలకు భోజనం ,ఇతర సౌకర్యాలు బాగున్నాయని ,వంటగది బాగుందని , జైలులోఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. ఖైదీల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలిపారు. ఖైదీలలో కొంతమంది నైపుణ్యం కలిగిన వారు ఉన్నారని తెలిపారు. నియమ ,నిబంధనల ప్రకారం జిల్లా జైలును బాగా నిర్వహిస్తుండడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కు జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ జైలులో ఖైదీల వివరాలు ,సౌకర్యాలు, ఏర్పాట్లు, తదితర వివరాలను తెలియజేశారు. ఖైదీల సంక్షేమంలో భాగంగా వారి కోసం చేపట్టే కార్యక్రమాలను వివరించారు .జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు.అంతకుముందు ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కు నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి రమేష్, డిఎస్‌పి శివరామిరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ ఆసుపత్రులద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమ హాస్టల్ల ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాపక్షం/డిండి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తార్పాలిన్‌లు, టెంట్, మంచినీటి సదుపాయం కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనొద్దిన్ అధికారులను సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవిలో రోజురోజుకు ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని అరబెట్టుకొనే సమయంలో వారికి ఎండ తీవ్రత నుండి ఉపశమనం కల్పించేందుకు వీలుగా రైతులకు మంచి నీటి సదుపాయం, టెంట్లు ఏర్పాటు చేసి వడదెబ్బకు గురికాకుండా చూడాలని అన్నారు. ఎండ లు మండుతున్న నేపథ్యంలో తక్షణమే కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్‌తో పాటు మంచి నీటి సదుపాయం కల్పించాలని మైనొద్దిన్ అన్నారు.

## మే 3వరకు ఆసరా పింఛన్లు పంపిణీ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు మే 3వరకు పంపిణీచేస్తున్నట్లు డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛన్లు పొందుతున్న పింఛన్దారులు వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు మీ ప్రాంతంలో ఉన్నటువంటి పోస్ట్ ఆఫీసుల ద్వారా పింఛను మొత్తము నేరుగా పొందవలసిన్నారు.ఎవరు కూడ మధ్య దళారీలను నమ్మ వద్దన్నారు.పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరము లేదని పింఛను మొత్తము సొమ్ము రూ.16 కోసహ అడిగి తీసుకోవాలని సూచించారు.

## నిర్లక్ష్యం, నాణ్యత లోపంతో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు



ప్రజాపక్షం/ నాంపల్లి: లక్ష్మణాపురం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లేదని అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మణాపురం ప్రాజెక్టు పనుల తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఇరిగేషన్ అధికారులు జేఈ, డిఈ, ఎఈ ల పర్యవేక్షణ లేదని, పనులలో నాణ్యత లోపంతో నిర్మాణం అవుతున్నాయని ఆరోపించారు. ముందు తరాల కోసం నిర్మించే ఈ ప్రాజెక్టు పనులు నాణ్యతతో నిర్మించకుండా, పర్యవేక్షణ లేకుండా పనులు జరుగడం ఏంటని ఆరోపించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ చేసినిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకొని బిల్లులు నిలిపివేసేలా చూడాలని కోరారు. ఆయన వెంట సిపిఐ మండల కార్యదర్శి సుదన బోయిన రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఊరిపోక వెంకటయ్య, నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, అగ్గిరాజు, దశరథ, గుడ్డేటి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోదాడ, మునగాల, నడిగూడెం, అనంతగిరి, చిలుకూరు మండలాలకు చెందిన ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం విద్యార్థుల్లో కల్పించి వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం నేర్పించేలా ఉపాధ్యాయులు సమయం కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ గత సంవత్సరం జరిగిన వైఫల్యాలను సరి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్‌పై జిల్లా, మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఈఓ అశోక్, క్వాలిటీ కో ఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ రాంబాబు, జెండర్ ఈక్వాలిటీ కో ఆర్డినేటర్ పూలమ్మ, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సాయం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/కోదాడ (నడిగూడెం): భూ సమస్యల పరిష్కారం కోసం రైతులకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు పాపయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక తెల్లకాగితం ద్వారా పెద్ద మనుషుల మధ్య కొనుగోలు చేసిన భూముల క్రమబద్దీకరణ చేయుటకు సాదాబైనామా ద్వారా 2020లో దరఖాస్తులు స్వీకరించారు. కాని ధరణి చట్టం వల్ల అమలు కాలేదని, ఇప్పుడు భూభారతి ద్వారా సాదాబైనామా దరఖాస్తులు ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయమైన వాటిని క్రమబద్దీకరించి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అసైన్మెంట్ కమిటీలు వేసి రక్షించడం జరుగుతుందని తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ పిపిటి ద్వారా భూ భారతి చట్టంను రైతులకు చదివి వినిపించారు. అనంతరం నడిగూడెం మండలం రామచంద్రాపురంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నీలం శైలజ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, హౌసింగ్ పిడి, సెప్షల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో సంజీవయ్య, వ్యవసాయ సంచాలకులు యల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ విఘ్నేని తిరుపతమ్మ సుధీర్, కొల్లు రామారావు, రాజేష్, పంచాయతీ కార్యదర్శులు ఉమారాణి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను అంతమొందించాలి

కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి : నర్సింహారెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ: కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారని, పోలీసు మారువేషాలతో వచ్చి విచక్షణా రహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ లో స్థానిక పల్లా పర్వతరెడ్డి భవన్ సిపిఐ కార్యాలయం నుండి పట్టణంలోని ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన భారత పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ చనిపోయిన వారికి కోటి, గాయపడిన పౌరులకు 25 లక్షల నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఈ కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీలో సిపిఐ దేవరకొండ మండ ల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు బుచ్చిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, కార్యవర్గ సభ్యులు బద్యానాయక్, అంజనేయులు, మైనొద్దీన్, వెంకట్రాములు, జ్యోతిబస్, నగేష్, యాదయ్య, శ్రీను, మల్లేష్, మధు, సైదులు, లింగమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/డిండి: కాశ్మీర్‌లోని పహల్గాంలో విచక్షణారహితంగా పర్యాటకులపై బుల్లెట్‌తో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ డిండి మండల సమితి పక్షాన ప్రగాఢ సానుభూతిని, సంతాపం వ్యక్తం చేశారు.

## బడ్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



ప్రజాపక్షం/భువనగిరి : బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలంధర్ రెడ్డి అధ్యక్షతన స్థానిక వివెరా హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, కోశాధికారి జె.శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి హాజరయ్యారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. బడ్జెట్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు లైఫ్ ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా బీ స్కూల్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మిర్యాల దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా చిట్టి బాబు, కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కోమార్ రావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాల రాష్ట్ర అధ్యక్షులు బొబ్బ సూర్యనారాయణ రెడ్డి, ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లేశం, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కోశాధికారి ప్రవీణ్, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాల్, యాజమానులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు.




## సిపిఐ పోరాటాల ఫలితంగా అండర్ పాస్ సమస్య పరిష్కారం

ప్రజాపక్షం/భువనగిరి : సిపిఐ పోరాటాల ఫలితంగా అండర్ పాస్ సమస్య పరిష్కారం అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్పుల అఖిలాష్ అన్నారు. భువనగిరి అర్బన్ కాలనీలో కాలనీవాసులు వెళ్లడానికి అండర్ పాస్ కావాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాలుగా దశలవారీగా ఆందోళన నిర్వహించాము. ఈ కారణంగా మున్సిపల్ అధికారులు ముఖ్యంగా శాసనసభ్యులు బీటీ రోడ్డు వేయాలని త్వరితగతిన పూర్తి చేయించారు. ఇట్టి సమస్యను పరిష్కరించిన అధికారులు ఎమ్మెల్యేకి సిపిఐ పట్టణ సమితి పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, పట్టణ నాయకులు చింతల మల్లేశం, పెంటయ్య, దాసరి లక్ష్మయ్య, షర్ఫుద్దీన్, రాజు సాయి కృష్ణ, కార్తిక్, బాలసాయి, భాను ప్రసాద్, రామ్ చరణ్, సంకల్ప, జావేద్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా త్వరితగతిన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రత్యేక డీసీసీ బ్యాంకుల సమావేశం, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్.ఆర్.ఎస్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ. 6,000 కోట్ల నిధులు వరకు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల నుండి 25,000 దరఖాస్తులు అందాయని వాటిలో 8000 దరఖాస్తులను సెక్టర్ల వారీగా పారదర్శకంగా నూటిని చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అధికారులు ఆధార్, ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలతో పాటు అర్హత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులను వార్డ్ లెవెల్, ఒక్కో కార్పొరేషన్ వారీగా, బ్యాంకుల శాఖల వారీగా వర్గీకరించి సోమవారంలోగా సంబంధిత బ్యాంకు మేనేజర్లకు సమర్పించాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు మేనేజర్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారంలోగా అర్హత నివేదికను అందజేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో దరఖాస్తులు పరిశీలన 28 మే వరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని ఈ కమిటీలు ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.



## బ్రిడ్జిని రోడ్డుకు లింకు చేయరా..?



ప్రజాపక్షం/సోన్: మండలంలోని సోన్ ఐ బి నుండి గాంధీనగర్ వరకు నిర్మించిన రోడ్డులో మాదాపూర్ వద్ద వంతెన నిర్మించారు కాని దానిని రోడ్డుకు ఇంకా లింక్ చేయలేదు,దానివల్ల ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తుందని,రాబోయేది వర్షాకాలం లో వాహనలకు ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని,రోడ్డును బ్రిడ్జ్ తో లింకు చేస్తే ప్రయాణం సైకర్యవంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## భూ భారతి పేద రైతుకు వరం



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్: సిర్పూర్ నియోజకవర్గం పెంచికలపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ తోపాటు ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జాయింట్ కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి దండే విఠల్ మాట్లాడుతూ ధరణి కేవలం ధనవంతులకే లాభం చేకూర్చిందని, పేద ప్రజలను మాత్రం ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా ధరణి వల్ల నష్టపోయిన పేద ప్రజలకు ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నూతన భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

## ‘ప్రజాపక్షం’ ప్రతినిధి రమేష్‌ను పరామర్శించిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: ప్రజాపక్షం నిజామాబాద్ జిల్లా స్టాఫర్ కర్క రమేష్ తండ్రి కర్క రాములు పొలంలో పనిచేస్తూ వడదెబ్బతో ఇటీవల మృతి చెందడంతో గురువారం ధర్పల్లి మండలం వాడి గ్రామం రమేస్ స్వగృహంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, చక్రపాణి, రఘురాం, రాజ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## భూభారతి చట్టంపై ప్రతిరైతూ అవగాహన కలిగి ఉండాలి



ప్రజాపక్షం/ కౌటాల: రైతు భూమికి సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తినా కొత్త భూభారతి చట్టం ద్వారా పరిష్కారం సాధ్యమవుతుందని, అందువల్ల ప్రతి రైతు దీనిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం కౌటాల రైతు వేదికలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అప్పీల్ వ్యవస్థ ఈ చట్టంలో కీలకంగా ఉంటుందని, తహసిల్దార్ ఉత్తర్వులపై సబ్ కలెక్టర్ లేదా కలెక్టర్ స్థాయిలో న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. భూమి కొనుగోలు, పాలు పంపకం, వారసత్వ భూముల మార్పిడిలో కమతం నక్ష జతపరిచే విధానం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా కుటుంబ సభ్యులందరికీ నోటీసులు పంపే విధానంతో విరాసత్ మార్పులు పారదర్శకంగా జరుగుతాయని చెప్పారు. గతంలో ధరణి చట్టంలో ఈ సదుపాయాలు లేకపోవడం వల్ల వివాదాలు పెరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దండే విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య పాల్గొన్నారు.

## జిల్లా జడ్జీని కలిసిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: జిల్లా జడ్జీటీ ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయమూర్తి జివిఎన్ భరతలక్ష్మీ ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జీ ఛాంబర్‌లో ఆమెకు పూలమొక్కలను అందించి స్వాగతం తెలియజేశారు. ఇరువురు కొద్దిసేపు భేటీ అయ్యి జిల్లా స్థితిగతులపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తిగా సహకారమందజేస్తామని కలెక్టర్ అన్నారు.

## ఐఎఎస్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నతచదువులు చదివించి తమ పిల్లల భవిష్యత్తును చక్కని మార్గంలో పెట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నిజామాబాద్ పోలీసు కమిసనర్ సాయి చైతన్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ క్యాంపు కార్యాలయంలో జక్రాన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జె. గోవిందరావు, హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు జే. సాయి చైతన్య యుపిఎస్‌సిలో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌క ఎంపిక కావడం సందర్భంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ గోవిందరావును అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది 24/7 విధులు నిర్వహిస్తు తమ పిల్లలను చక్కని చదువులు చదివించి ఉన్నత స్థాయి అధికారులు చేయటం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది ప్రతి ఒక్కరు తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని అన్నారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి సిఐ మల్లేశ్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు శ్రీనివాస్(అడ్మిన్), తిరుపతి (వెల్ఫేర్)పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ షకిల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం చెల్లించాలి



ప్రజాపక్షం/బాన్సువాడ: ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన రిటైర్మెంట్ డబ్బులతోపాటు బకాయిలను వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్‌టిసి డిపో ఎదుట విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఇటీవల కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. పర్యాటకుల మృతికి రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌసర్, నాగనాథ్, మహమూద్, పండరి, ఫరీద్, మనోహర్, రామాగౌడ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెకాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

### ఎఐటియుసి బోగే ఉపేందర్ డిమాండ్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : బెల్లంపల్లి ఏరియా గోలేటిలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి నాయకులు కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ మాట్లాడుతూ గతంలో సమ్మె జరిగినప్పుడు ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యానికి, యూనియన్ల మధ్య ఒక ఒప్పందం జరిగిందని, అయితే ఆ ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం దృష్టికి ఈ విషయాన్ని పలు మార్లు తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి ఒప్పందం ప్రకారం ప్రతినెలా 15వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి గోలేటి బ్రాంచ్ ప్రెసిడెంట్ అరికిల్ల స్వామి, కార్యదర్శి లక్ష్మినారాయణ, నాయకులు తిరుపతి, మనేమ్ సంతోష్, చందర్ లాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ యార్డ్‌లో కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనే ఆలోచన చేస్తోందని, కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తు, సురేష్, బాపురావు, రమేష్, జుగాది రావు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో రోజుల కసరత్తు తర్వాతే భూభారతి చట్టం:కలెక్టర్



ప్రజాపక్షం/సారంగాపూర్ : భూభారతి చట్టం ద్వారా ప్రజల భూసమస్యలన్నీ పరిష్కారమౌతాయాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.సదస్సులో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ,భూ చట్టాల నిపుణులు,అనుభవజ్ఞులైన రెవెన్యూ ఉద్యోగులు,న్యాయ నిపుణులు ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను ఆధ్యయనం చేసి,ఎన్నో రోజులు సుదీర్ఘ కసరత్తు చేసిన తర్వాత ఈ పటిష్టమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు లోకి తీసుకువచ్చారని తెలిపారు.ఈ నూతన భూభారతి చట్టం ద్వారా గ్రామస్థాయిలోని రెవెన్యూ రికార్డుల నిర్వహణ పటిష్టంగా మారుతుందని అన్నారు.ఈ చట్టాన్ని అనుసరించి గ్రామ స్థాయిలో గ్రామ పాలన అధికారులను నియమించడం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.ధరణి చట్టం అమలుకు ముందు భూముల క్రయ,విక్రయాలకు సాదా బైనామా పద్ధతి ఉండేదని,ధరణి అమలులోకి వచ్చిన తర్వాత సాదా బైనామా నిలిచిపోయిందని తెలిపారు.భూభారతి చట్టం ద్వారా సాదా బైనామా ప్రక్రియ తిరిగి అమలులోకి రానున్నందున ఎంతో మంది రైతుల భూ సమస్యలు తీరనున్నట్లు తెలిపారు.పట్టాదార్ పాస్ పుస్తకాలలో రైతుల భూముల హద్దులకు సంబంధించి వివరాలు మ్యాపుల రూపంలో పొందపరచబడతాయన్నారు.భూకమతాలకు భూదారుకార్డులు రూపోందించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు.అనంతరం అంతర్జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,జిల్లా వైద్యాధికారి రాజేందర్ తదితరులతో కలిసి గోడ ప్రతులను కరపత్రాలను ఆవిష్కరించారు.వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమలు వ్యాపించకుండా ఉండి మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్,తహసిల్దార్ శ్రీదేవి,మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్,ఎంపీడీవో లక్ష్మీ కాంత్‌రావు,రైతులు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతుల కష్టాలు తీరుతాయ్

### అవగాహన సదస్సులో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: గత ప్రభుత్వ పాలకులు తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలు ఎక్కువై రైతులు కోర్టుల చుట్టూ తిరిగారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు తీరుతాయని ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటూ వారి సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. శుక్రవారం మెదక్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ,అదనపు కలెక్టర్ నగేష్ ,మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే రోహిత్ రావు ఎడ్ల బండి మీద వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్వారి వ్యవస్థ ఉండేదని అప్పుడు సంవత్సరానికి ఓసారి జమాబంది చేసి భూముల వివరాలు పకడ్బందీగా పహణిలో నమోదు చేసేవారని అన్నారు. రైతులు తల్లిదండ్రులు తరువాత భూమాతను నమ్ముకోవడం జరుగుతుందని తెలిపారు. అలాంటి భూములకు ప్రజలకు హక్కులు లేక ధరణిలో చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. దరణిలో జరిగిన పొరపాట్లను పరిష్కరించే అధికారం అధికారులకు లేకపోవడం వల్ల సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని అందువల్ల నానా అవస్థలు పడుతూ కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి అనేక ఇబ్బందులు పడ్డారని మండిపడ్డారు. ధరణి స్థానంలో నూతన చట్టాన్ని తేవడానికి ప్రభుత్వం నిపుణులతో కమిటీని వేసి అన్ని రాష్ట్రాల్లో పరిశీలించి రైతులకు సులువైన చట్టాన్ని అందుబాటులో తెచ్చినట్లు చెప్పారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పనకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రైతు సదస్సులు నిర్వహిస్తూ రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకుంటున్నామని వివరించారు. భూభారతి చట్టం జూన్ రెండో తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు అద్భుత అవకాశం

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి: వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు అద్భుత అవకాశం అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య పర్యవేక్షణలో, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు అధ్యక్షతన జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటుచేసిన సైన్స్ సమ్మర్ క్యాంప్ 2025 ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో మన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సైన్స్ కారణాలు తెలియజేస్తూ విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. ఆ ప్రశ్నలకు సమాధానాల కోసం వారితో సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థులు నిశితంగా గమనించాలని, పరిశీలించాలని, వాటి వెనుక ఉన్న సూత్రాలను అర్థం చేసుకోవాలని సూచించారు. చాలామంది అనేక వస్తువులను వాడుతున్నప్పటికీ వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు తెలియవని, ఆ సూత్రాలను తెలుసుకోవడానికి ఈ సమ్మర్ క్యాంప్ ఎంతో ఉపయోగకరమని అన్నారు. పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల వారీగా నేర్చుకుంటారని, కానీ ఇక్కడ ప్రతి విద్యార్థి తమ మెదడులో తలెత్తే ప్రతి సమస్యకు పరిష్కారం తెలుసుకునేలా ఆలోచన శక్తిని పెంపొందించుకోవడానికి ఈ సైన్స్ సమ్మర్ క్యాంప్‌ను ఉపయోగించుకోవాలని, వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా సమ్మర్ క్యాంప్‌కు వచ్చే విద్యార్థులు ప్రయాణ సమయంలో జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు సమ్మర్ క్యాంప్ విధివిధానాలు తెలియజేస్తూ, మొత్తం 186 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 120 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, మంచిర్యాల మండల విద్యాధికారి మాలవీదేవి, విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, కోడింగ్ సెన్సార్ నిపుణులు సాల్మన్ జోన్స్, పాల్గొన్నారు.

## అందరికీ న్యాయం జరగాలి: ఎమ్మెల్యే




ప్రజాపక్షం/ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ తో తెలంగాణకు మేలు జరుగుతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని నోవాటెల్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన భారత్ సమ్మిట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అహింసా, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి కాంగ్రెస్ పార్టీ మూల సూత్రాలపై నెహ్రూ ఆలినోద్యమానికి స్ఫూర్తిగా తీసుకొని ఈ సమ్మిట్ జరుగుతుందని తెలిపారు .దేశాన్ని,రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భరత్ సమ్మిట్ ను నిర్వహిస్తుందని అన్నారు. ఈ సమ్మిట్ లో యువత రాజకీయం, సమాచార వాస్తవాలు అపోహలు,లింగ సమానత్వం, మహిళల హక్కులు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు.

## ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలి




ప్రజాపక్షం/మంచిర్యాల: ప్రభుత్వ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు డిమాండ్ చేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యలో నాణ్యత మన బాధ్యత అనే అంశంపై జరిగిన విద్యా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఉపాధ్యాయుడు బోధించడం వల్ల పిల్లలకు ఆకర్షణీయమైన బోధన అందుతుందని పేర్కొన్నారు. వేర్వేరు ఉపాధ్యాయులు వినూత్నమైన సబ్జెక్టులను బోధించడం వల్ల పిల్లలకు మానసికోల్లాసం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. వాస్తవ స్థితికి దగ్గరగా లేని సిసిఇ విధానాన్ని తొలగించాలని, ఇప్పటికే ఈ విధానాన్ని 18 రాష్ట్రాల్లో రద్దు చేశారని గుర్తు చేశారు. సాయంత్రం వరకు కొనసాగిన ఈ విద్యా సదస్సులో రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పార్వతిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజేంద్ర, సదయ్య మరియు వివిధ సబ్జెక్టుల విషయ నిపుణులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదానికి మతం ఉండదు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ఉగ్రవాదానికి మతం ఉండదని, చిన్నచీమకు కూడా హానీ తలపెట్టవద్దని ఇస్లాం చెబుతుందని జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ముక్తకంఠంతో అందరూ ఈ దాడిని ఖండిస్తూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించాలన్నారు. ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా శిక్ష అమలు చేయాలన్నారు. ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదానికి మత ఉండదని చిన్నచీమకు కూడా హానీ తలపెట్టవద్దని ఇస్లాం చెబుతుందన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్యపైనా అయినా సరే మా మద్దతు ఉంటుందన్నారు. మానత్వమున్న వారు ఎవరైనా సరేవ ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందేనన్నారు.

## రైతులు ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కన్జ్యూమర్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా మెదక్ మండలంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి కోంటూరు, రాజ్ పల్లి, బాలనగర్ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్డిఓ, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్, ఆదేశాల అనుసరిస్తూ సివిల్ సప్లై యంత్రాంగం మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్స్ ,ప్యాడి క్లీనర్స్, మార్చరైజర్ రైజర్స్, టార్పోలిన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నచిన్న లోటుపాట్లను సవరించుకొని కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లై సురేష్ రెడ్డి,పౌరసరఫరాల శాఖ మేనేజర్ జగదీష్, డిసిఓ కరుణాకర్, ఏపియం ఇందిరా సంబంధిత వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: డిజిటల్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని,అందరూ ప్రయోజకులు కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీని విభాగాన్ని జిల్లా కలెక్టర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డితో కలిసి ప్రారంభించారు. లైబ్రరీని పరిశీలించి ఇంటర్నెట్ సౌకర్యం, వసతులు గురించి ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా కంప్యూటర్ ఆన్ చేసి ఇంటర్నెట్ వసతిని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ లైబ్రరీని ప్రారంభించడం ద్వారా, ప్రజలకు సమాచారం మరియు విద్యా వనరులను అందించడం ద్వారా, వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుంది. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఇంటర్నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీకి పది కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీని నెలకొల్పామన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ, మెదక్ జిల్లా గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దుతున్నట్లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన మరిన్ని బుక్స్, జర్నల్స్ ను సమకూర్చడంతో యువతీ యువకులు పోటీ పరీక్షలలో ప్రతిభను చాటి వివిధ శాఖలలో ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ వంశీకృష్ణ, సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళి, ఉమాదేవి పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో వరి పంట దగ్ధం

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యా హ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.50 వేలు విలువ చేసే వరి పంట దగ్ధమైనట్లు బాధిత కౌలు రైతు పోతుల రమేష్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సుకోషి రాజయ్య, రవీందర్‌లకు చెందిన రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అప్పులు చేసి పంట సాగుచేశానని, అగ్నిప్రమాదానికి గురై పంట కాలిపోయిందని రోధించారు. కోసేందుకు సిద్దంగా ఉన్న 20 గుంటల సీడ్ వరి, కోసి పక్కన పెట్టిన వరి కాలిపోయిందని కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతు రమేష్‌ను ఆదుకునేలా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. మండల ఆర్ఐ అరుణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల బాధిత రైతు పొలం వద్దకు వెళ్లి కాలిపోయిన పంటను పరిశీలించి రైతుకు భరోసా కల్పించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి పేద కౌలు రైతుకు న్యాయం చేయాలని తోటి రైతులు కోరుతున్నారు.

## కార్మికులకు అండగా ప్రభుత్వం

టిపిసిసి మెంబర్ దరిపల్లి చంద్రం



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, టిపిసిసి మెంబర్ దరిపల్లి చంద్రం అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మేడేను పురస్కరించుకొని కొండ భూదేవి గార్డెన్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని,ఈ సమా వేశానికి కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్మిక సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీశైలం,కిషన్,చెల్మెడ రాములు, కొమురయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎమ్మెల్యే విజయరమణరావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ధాన్యాన్ని కటింగ్ లేకుండా కొనుగోలు చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం జూలపల్లి మండలంలోని వడ్కాపూర్, వెంకట్రావుపల్లి, కాచాపూర్, కీచులాటపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో సింగిల్ విండో అండ్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రబీ, యాసంగి సీజ న్లలో ఒక్క గింజ కటింగ్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రైతులకు సన్నఒడ్లకు 500 చొప్పున బోనస్ కూడా చెల్లిం చామని, ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు కృషి




**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి ప్రభాకర్**

ప్రపంచమలేరియా దినోత్సవం సందర్భంగా జగిత్యాలలో ర్యాలీ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** మలేరియా నిర్మలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ప్రభాకర్ కోరారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జగిత్యాలలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి డిఎంహెచ్ఓ ప్రభాకర్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 2030 నాటికి మలేరియా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో, ఇండ్లల్లో నీటి నిలువలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిలువల్లో దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్,డాక్టర్. శ్రీలత, ఎఎన్ఎంలు మేరీ, మాదేశి శిరీషా,ఆశాలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర



డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** రైతులు నాన్యత ప్రమాణాలతో కూడిన వరి ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని డిసిఎంఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్, ధర్మపురి సింగిల్ విండో చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి రైతులకు సూచించారు. ధర్మపురిప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడిన చిన్నపూర్ , సిరివంచకోట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సహకార సంఘం అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి,బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్, నాయకులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు 17 శాతం తేమతో ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ 2320, సాధారణ రకం రూ.2300లు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాండ్ర అశోక్‌రావు, ఉపాధ్యక్షులు నగునూరీ నర్సగౌడ్,నాయకులు కండ్లే మదన్, మరిపెల్లి రవీందర్‌రెడ్డి, బిరుపూరు తిరుపతి,బల్గురి రామారావు, బోయినపల్లి కమలాకర్ రావు, పూజల కనకయ్య, గట్టు గంగారం,దాసరి లచ్చయ్య ,ఎఇఒలు నవీద్, అయ్యోరీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యాన్ని నేలపాలు చేస్తున్న వానరులు



**ప్రజాపక్షం/ముత్తారం:** వరిపంట పొలాల్లో పండిన వడ్లను కళ్ళంలో మ్యాచర్ వచ్చేందుకు రైతులు ఆరబోసుకుంటే పదుల సంఖ్యలో వానరులు ధాన్యాన్ని చిందర వందరం చేస్తూ వరి ధాన్యం అంత నేలపాలు అవుతుందని రైతులు వాపోతున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామ శివారులో వరి ధాన్యాన్ని ఆరబెట్టిన రైతుల వడ్లను వానరాల బెడదతో తీవ్ర ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. కళ్ళంలో ఆరబెట్టిన ధాన్యాన్ని కోతులు ధాన్యం తినేయడం కొంతవరకు అయితే పరదాలోని వడ్లన్నీ చిందర వందర చేస్తూ నేలపాలు చేస్తున్నాయని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.మక్కా పెరడి రైతులకు వానరులు చుక్కలు చూపిస్తున్నామని, మక్కా పెరడి జల్లు దశకు రాకముందే చెట్లను పీకుతూ చేనును పాడు చేస్తున్నాయని దిగులు చెందుతున్నారు. అడవి శ్రీరాంపూర్ గ్రామశివారులో ధాన్యం కుప్పలు పోసుకోగా వానరాలు చిందర వందరం చేస్తున్నాయని, రైతులు ధాన్యం కుప్ప దగ్గరికి వెళ్లేందుకు జంకుతున్నారని తెలిపారు.

## భూ సమస్యలకు మోక్షం

29న భూ భారతి చట్టంపై అవగాహన

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎట్టకేలకు భూభారతి చట్టంపై అవగాహన ఎల్లారెడ్డిపేట మండలంలో 29 న నిర్వహించనున్నట్లుగా శుక్రవారం తహసీల్దార్ తెలిపారు. (మంగళవారం) 29న ఉదయం తొమ్మిది గంటల నుండి మల్లారెడ్డి కన్వన్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని ఎల్లారెడ్డిపేట మండల ప్రజలు వినియోగించుకొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు

# లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే బిజెపిని తరిమికొట్టుడే

**జిల్లా కార్మిక సంఘాల సదస్సులో పలువురు నేతల హెచ్చరిక**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** విదేశీ స్వదేశీ కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికవర్గానికి తీరని అన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జిల్లా కార్మిక సంఘాల సదస్సు పిలుపునిచ్చింది. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎ ఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, టిఎన్‌టియుసి, ఇతర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంఘాల ఆధ్వ ర్యంలో కరీంనగర్ జిల్లాకార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌ల కోసం పనిచేసేందుకు 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని, లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులకు యూనియన్ రిజిస్ట్రేషన్, సమ్మెచేసే, పనిగంటల, ఉపాధి భద్రత హక్కులతో పాటు సామా జిక రక్షణ తదితర అనేక కార్మిక సంక్షేమ పథకాలకు దూరంగా నెట్టే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కేవలం యజమానులకు మాత్రమే అనుకూలంగా రూపొందించి కార్మిక వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని, నాయకు లను జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున మే20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చాప్టర్ ఆఫ్ డిమాండ్లను విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ మోడీ ప్రభుత్వంపై ప్రతిఘటించాలని కోరారు. కరీంనగర్ జి ల్లాలో కార్మికవర్గానికి వ్యతిరేకంగా పని చేస్తున్న కేంద్ర మం త్రి బండి సంజయ్ కుమార్ లేబర్ కోడ్లను వ్యతిరేకించే విధ ంగా కృషి చేయాలని, లేని పక్షం లో జిల్లా కార్మిక వర్గం బండి సం జయ్‌పై తిరుగుబాటు మొదలుపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, ఎఐటియుసి జిల్లా అ ధ్యక్ష కార్యదర్శులు బుచ్చన్న యాదవ్, మల్ల సమ్మయ్య, పిట్టల శ్రీనివాస్, దాసరి ప్రభాకర్, రాజేందర్, రజిత, రాజయ్య, పోశయ్య, ఉమాశంకర్, కిరణ్, బిఆర్‌టి యు జిల్లా అధ్యక్షుడు బొ మ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాఘవు లు, టిఎన్టీయుసి జిల్లా ఇంచార్జి కళ్యాడపు ఆగ య్య, నాయకులు జనగాం రాజమల్లు, యు.శ్రీనివాస్, పుల్లెలమల్లయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రానికి నిరసనగా

## మే20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

✻ కార్మిక సంఘాల నాయకుల పిలుపు



**ప్రజాపక్షం/ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** 29 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు అన్నారు. వీటికి నిరసనగా మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక సంఘాల నాయకులు శివనగర్ శివాలయ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా సదస్సులో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, ఎఐఎఫ్‌టియు కొత్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, ఆహ్వాన కమిటీ సిఐటియు కోడం రమణ తదితరుల పహల్గాంలో చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గొట్టె రుక్మిణి, వెంగల శ్రీనివాస్, ఆకుల రాములు, మచ్చ అనసూయలు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సమ్మె చేసే హక్కు, కనీస వేతనాల హక్కును సంఘం పెట్టే హక్కులను కాలరాస్తున్నారని, అంగన్వాడీలు, మిడ్ డే మిల్స్, భవన నిర్మాణ కార్మికులు, ఆశాలు, 2వ ఎఎన్ఎం, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వారిని, మున్సిపల్ గ్రామ పంచాయతీ, హామాలీ, సివిల్ సప్లై కార్మికులు, బీడి అనేక రంగాల కార్మికులు కేంద్రం దగా చేస్తుందని మండిపడ్డారు. వీటిని తిప్పికొడుతూ మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మీసం లక్ష్మ ణ్, కెవి. అనసూర్య పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

✻ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

భూ భారతిచట్టంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ముస్తాబాద్:** భూసమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుపొందించిన భూ భారతి( రికార్డ్‌ఆఫ్‌రైట్స్ ఇన్‌ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును ముస్తా బాద్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా ధరణి చట్టం, భూ భారతిచట్టంలోని వివిధ అంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ప్రభుత్వం రుపొందించిన భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భూ సమస్యలు హద్దుల సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన చట్టంతోజియో ట్యాగింగ్‌తో అలాగే మ్యాప్‌తో పాస్ పుస్తకాలను జారీ చేయనుందని వెల్లడించారు. దీంతో రైతులకు దారి సమస ఇతర ఇబ్బందులు ఎదురుకావని స్పష్టం చేశారు. అన్ని అర్హతలు ఉండి భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూ భారతి చట్టంతో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అర్హులందరూ చట్టాన్ని సద్వినియోగం చేసుకుని హక్కులను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్‌డిఒ రాధాభాయి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తలారి రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎల్లా బాల్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

## రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశం



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం జగిత్యాల ఆధ్వర్యంలోనీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్ర సాద్ సందర్శించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించి వేగవంతం చేయాలని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామ ని అధికారులకు సూచనలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు సెంటర్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, సీరియల్ రిజిస్టర్ ప్రకారం ధాన్యం మ్యాచింగ్ చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడినధాన్యాన్ని మాత్ర మే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల లోపు మిల్లులకు తరలించాలన్నారు. ట్యాబ్ డేటా ఎంట్రీ నమోదు,లారీ ట్రాక్ సెట్ తప్పనిసరిగా ఎంట్రీ చేయాలన్నారు. వివరాలు నిరంతరం నమోదు చేసి, తగిన రికార్డులు నిర్వహించాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హమాలీలు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే పనులు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండల్ తహసిల్దార్ శ్రీనివాస్, అగ్రికల్చర్ అధికారులు, ప్యాక్ సెంటర్ అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలపై అవగాహన




**✻ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్**

**ప్రజాపక్షం/ధర్మపురి:** డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జై బాపు, జై భీం జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట నుండి రాజారం వరకు నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమంలో విప్ లక్ష్మ ణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కుల, మత, బేధం వర్గాలు లేకుండా ముందుకు నడిపించడం, జాతిపిత మహాత్మా గాంధీ గొప్పతనం, రాజ్యాంగ అమలు అవశ్యకతను వివరించేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రం హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షింగా గతంలో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని చెప్పారు. గ్రామ గ్రామానా జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదంతో పాదయాత్ర చేపట్టామని అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ఎస్. దినేష్, నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మ ణ్, చీపిరిశెట్టి రాజేష్, సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

## మనిషికి ఆధార్.. భూమికి భూధార్

సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి




**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట :** అత్యంత పారదర్శకంగా రైతులకు, పట్టెదార్లకు మేలు జరగాలని, జిల్లా స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించాలన్నే ఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి చట్టంను తీసుకువచ్చినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. శుక్రవారం ధూళ్మిట మండల కేంద్రంలోని రైతు వేదికలో, మద్దూరు మండలకేంద్రంలోని తాజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యో) అబ్దుల్ హబీద్ తో పాటుగా హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, స్థానిక ధూళ్మిట్ట తహశీల్ధార్ సింహాచలం మధుసూదన్, ఆయామండలాల అధి కారులు, నాయకులు, ప్రజలతో కలసి కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యో) అబ్దుల్ హబీద్ పవర పాయింట్ ప్రజెంటేషన్ ద్వార భూభారతి చట్టం గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రతి మనిషికి ఆధార్ కార్డులా, ప్రతి ఒక్కరి భూమికి భూధార్ కార్డును తీసుకవస్తూ, రైతులకు గతం ప్రభత్వంలోని ధరణితో తలేత్తిన సమస్యలను పరిష్కరిస్తూ, ప్రతి ఒక్క రైతుకు మేలు జరిగేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 14 ఏప్రిల్ 2025 నుండి భూభారతి చట్టం తీసుక వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు రైతులు, స్థానిక ప్రజాప్రతి నిధు లు సమస్యలపై అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు అందించారు. ధూళ్మిట్ట జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్ ఆక్రమన సమస్య, బెక్కల్ గ్రామంలో గ్రామం కోసం కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమికి ఓ అధికారికి రైతుబంధు, పిఎంమ్ కిసాన్ డబ్బులు పడుతున్న సమస్యలపై స్పందిస్తూ... సమస్యలను పరిస్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మరికొన్ని సమస్యలపై తనకు లిఖితపూర్వకంగా అర్జీ అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ తాజా మాజీ జడ్పిటీసీ గిరి కొండల్ రెడ్డి, జనగామ యాత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్‌తో పాటుగా వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణపై ప్రణాళికలు

**✻ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మాదక ద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమికృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్‌పి మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదకద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టా ల్సిన విస్తృత ప్రచారం, పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ముఖ్య ప్రణాళిక అధికారి ప్రస్తుతం క్రాప్ కటింగ్ పరిశోధనలు జరుపుతున్నారని, ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పాన్‌షాప్ వంటి వాటిపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, ఎంపిడిఒ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో ఉన్న సినిమా థియేటర్లు పరిసరాలను రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన వాల్ పోస్టర్స్, హ్యాండ్ బుక్‌లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధాబాయి, అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవానీ, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్‌సేఫ్టీ అధికారి,తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట

రెండంచెల అప్పీలు వ్యవస్థతో రైతులకు మేలు

ప్రతి గ్రామంలో నాలుగు రకాల రికార్డుల నిర్వహణ

అవగాహన సదస్సుల్లో కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/జమ్మికుంట/ఇల్లందకుంట :** నిర్ణీత గడువులోగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాల యం, ఇల్లందకుంట రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ధరణి చట్టంలో నిబంధనలు సరిగా లేకపోవడంతో రైతులు కోర్టుల చుట్టూ తిరిగేవారని,కేవలం కలెక్టర్‌కే బాధ్యతలు అప్పగిం చడంతో పనిభారం పెరిగి దరఖాస్తులు పరిష్కరించలేకపోయామన్నారు. భూభారతి చట్ట ంలో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలు ఇవ్వడంతో రైతుల సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయని వివరించారు. కొత్త చట్టంలో మనిషికి ఆధార్ మాదిరిగా భూమికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. దీంతో భూఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. న్యాయ నిపుణులు, రెవెన్యూ ఉన్నతాధికారులు, రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి భూ భారతి చట్టం రూపొందించారన్నారు.ధరణి చట్టంలో కబ్జాదారు కాలమ్, అనుభవదారు కాలమ్ పక్కనే ఉండడంతో సమస్యలు తలెత్తాయని, భూభారతి చట్టంలో మాత్రం క్షేత్రస్థాయిలో సర్వే, విచారణ జరిపిన తర్వాతే భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయనున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో నాలుగు రకాల రికార్డులను నిర్వహిస్తారని, ఏటా జరిగే భూమార్పుల రిజిస్టర్, చెరువులు, కుంటలు వంటి భూముల రిజిస్టర్, గ్రామ పహానీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్ వంటి రికార్డులు నిర్వహిస్తారన్నారు.రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అందరి భూ సమస్యలను పరిష్కరిస్తామనిసూచించారు. హుజురాబాద్ ఆర్డీవోరమేష్ బాబుమాట్లాడుతూ మోకాపై వివాదాలు ఎత్తకుండా చట్టంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇల్లందకుంట తహసీల్దార్ రాణి,అధికారులు, నాయకులు తదితరులున్నారు.

### రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించండి - కలెక్టర్..

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పి ంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇల్లందకుంటలో డిసి ఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని అడిగి కేంద్రానికి వచ్చిన ధాన్యం, సన్నరకాలు, కల్పిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.అనంతరం ధాన్యంలో తేమశాతం స్వయ ంగా పరిశీలించారు. నిర్వాహకులకు ప లు సూచనలు చేశారు. తహసీల్దార్ రాణి, కేంద్ర ఇన్‌చార్జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫోకస్



## తొలి క్వాంటం కంప్యూటర్ సింధు

మన దేశంలో పూర్తి స్థాయి క్వాంటం కంప్యూటర్ క్యుపిఐ ఎఐ–సింధు (QpiAI–Indus) అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. జాతీయ క్వాంటం మిషన్ (ఎన్‌క్యుఎం)లో ఈ ఆవిష్కరణను ఒక ప్రధాన మైలురాయిగా పేర్కోవాలి. బెంగళూరుకు చెందిన క్యుపిఐ ఎఐ సంస్థ ఈ కంప్యూటర్‌ను అభివృద్ధి చేసింది. ఇది పూర్తిగా



భారతదేశంలో నిర్మించిన మొట్టమొదటి పూర్తి స్థాయి క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థ. ఇందులో హార్డ్‌వేర్‌తోపాటు సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుంది. క్వాంటం ప్రాసెసర్ నుండి క్వాంటం అప్లికేషన్‌లను సమర్థవంతంగా అమలు చేయడానికి కృత్రిమ మేధ (AI/ ఎఐ) ఆధారిత అప్లికేషన్ సాధనాల వరకు ప్రతిదీ కవర్ చేస్తుంది. ఈ వ్యవస్థ 25 క్విట్‌లను కలిగి ఉంది. ఇది అధిక పనితీరు గల క్వాంటం కంప్యూటింగ్‌కు కీలకమైనదిగా పేర్కొంటున్నారు. సాంప్రదాయ కంప్యూటర్లతో పోలిస్తే మెరుగైన స్థిరత్వం, కనిష్ట దోష రేట్లతో వేగవంతమైన సంక్లిష్ట గణనలను అనుమతిస్తుంది. ఈ క్వాంటం కంప్యూటర్ జీవ శాస్త్రాలలో (ఔషధ ఆవిష్కరణ, జన్యుశాస్త్రం), పదార్థ శాస్త్రం (కొత్త పదార్థాల రూపకల్పన), చలనశీలత, లాజిస్టిక్స్ (మార్గం, సరఫరా గొలుసు ఆప్టిమైజేషన్) సంభావ్య ఉపయోగాలను కలిగి ఉంటుంది. క్వాంటం భౌతిక శాస్త్రంలో ప్రాథమిక పరిమాణమమైన ప్లాంక్ స్థిరాంకం (4.14) జ్ఞాపకార్థం, క్వాంటం సైన్స్, దాని సాంకేతిక ప్రభావంపై అవగాహనను ప్రోత్సహించడానికి ఈ ప్రాజెక్టును 2021లో ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీన దీని ఆవిష్కరణ జరిగింది. నాలుగో నెల... 14వ తేదీని ఎంపిక చేసుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. ప్లాంక్ స్థిరాంకం (4.14 × 10 eV)లోని మొదటి మూడు అంకెలను (4.14) ఇది సూచిస్తుంది. ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## మాంటిస్ రొయ్యల్లో రీకోయిల్–డంపనింగ్ వ్యవస్థ!

మాంటిస్ రొయ్యల సుత్తి లాంటి అవయవం శక్తివంతమైన దెబ్బలను కొట్టడానికి ఉపయోగపడుతుందని, సహజమైన రీకోయిల్–డంపనింగ్ వ్యవస్థను ఉపయోగిస్తుందని తాజా అధ్యయనం స్పష్టం చేస్తున్నది. మెటామెటీరియల్స్, శక్తి నియంత్రణ గురించి ఇప్పటివరకూ ఉన్న సిద్ధాంతాలు, నమ్మకాలను ఈ కొత్త అధ్యయనం సవాలు చేస్తున్నది. మాంటిస్ రొయ్యలు స్టోమాటోపోడా క్రమానికి చెందిన పురాతన సముద్ర క్రస్టేసియన్లు , ఇవి పీతలు, ఎండ్రకాయలతో దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. వీటిలో 450కిపైగా జాతులు ఉన్నాయి. అవి 10 సెంటీ మీటర్ల నుండి దాదాపు 46 సెంటీ మీట్ల వరకు పరిమాణంలో ఉంటాయి. రొయ్య అనే పేరు ఉన్నప్పటికీ, ఇవి నిజమైన రొయ్యలు కావు. వాటి శక్తివంతమైన రంగులు , సంక్లిష్టమైన ప్రవర్తన, శక్తివంతమైన వేట అనుబంధాల ఆధారంగా, రొయ్యల జాతి నుంచి వేరుచేశారు. తాజా అధ్యయనం మాంటిస్ రొయ్యల పరిణామాత్మక ప్రతిభను హైలైట్ చేయడమే కాకుండా, భౌతిక శాస్త్రం, బయో ఇంజనీరింగ్‌లో కొత్త సరిహద్దులను తెరుస్తున్నది. మాంటిస్ రొయ్యల అద్భుతమైన అనుబంధం సహజ ఫోనోనిక్ మెటామెటీరియల్ (ధ్వని లేదా కంపనాలు వంటి యాంత్రిక తరంగాలను నిరోధించే లేదా నియంత్రించే పదార్థాలు)గా పనిచేస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. ఇది క్లబ్ నిర్మాణం ద్వంద్వ యాంత్రిక ప్రయోజనాలను అందిస్తుంది. శక్తిని తట్టుకుంటుంది. శక్తి ప్రచారాన్ని నియంత్రిస్తుంది. మాంటిస్ రొయ్యల క్రమానుగత నిర్మాణంలో ఇవి ఉన్నాయి. హైడ్రాక్సీఅపటైట్ ఉపరితలం (మానవ ఎముకలు, దంతాలలో కూడా కనిపించే గట్టి ఖనిజం) ప్రభావాన్ని చెదరగొడుతుంది. స్ప్రింగ్ లాంటి స్నాయువులు (షాక్‌ను గ్రహించడంలో సహాయపడే సాగే నిర్మాణాలు), బయోపాలిమర్ ఫైబర్‌లు ఒక ఆవర్తన నమూనాలో అమర్చబడి ఉంటాయి (పునరావృత దాడుల నుండి ప్రభావ నష్టాన్ని తగ్గించే పునరావృత సహజ ఫైబర్‌లు). కాగా, ప్రకృతి మెటామెటీరియల్‌లను అభివృద్ధి చేసిందని, శాస్త్రవేత్తలు జీవ పదార్థ రూపకల్పనను అర్థం చేసుకునే విధానాన్ని మారుస్తుందని ఈ అధ్యయనం నిర్ధారిస్తుంది.




ఇలావుంటే, మాంటిస్ రొయ్యలు వెచ్చని, నిస్సార ఉష్ణమండల, ఉప ఉష్ణమండల జలాల్లో నివసిస్తాయి. ముఖ్యంగా భారతీయ, పసిఫిక్ మహాసముద్రాలలో, స్వయంగా తవ్వుకున్న బొరియలలో నివసిస్తాయి. మాంటిస్ రొయ్యలను వాటి వేట అనుకూలతల ఆధారంగా రెండు ప్రధాన రకాలుగా వర్గీకరించారు. మొదటిది స్పియరర్స్ రకం. చేపలు, స్క్విడ్, పురుగులు వంటి మృదువైన శరీరాన్ని కలిగి ఉన్న జంతువులను వేటాడేందుకు ఉపయోగించే ముళ్ళు, ముళ్ల ముందరి కాళ్ళను కలిగి ఉంటాయి. రెండవది స్మాషర్లు. ఇవి భారీగా కాల్షియమ్ చేయబడిన, క్లబ్ లాంటి అనుబంధాలను కలిగి ఉంటాయి., ఇవి జంతు రాజ్యంలో అత్యంత వేగవంతమైన దాడులను అందించగలవు. ఇవి నత్తలు, పీతలు మరియు క్లామ్స్ వంటి గట్టి పెంకు కలిగిన జంతువులను పగలగొట్టడానికి ఉపయోగించబడతాయి. ఈ రొయ్యల వాటి క్లబ్ యంత్రాంగం కవచం ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో బయోమిమిక్రీని ప్రేరేపించడానికి ఉపయోగపడుతుంది. వీటి కంటి నిర్మాణం ఆప్టికల్ సెన్సార్, క్యాన్సర్ డిటెక్షన్ టెక్నాలజీని ప్రభావితం చేస్తోంది. అవి దిబ్బల పర్యావరణ వ్యవస్థలలో ఎర జనాభాను నియంత్రించడంలో సహాయపడతాయి. పోషక చక్రానికి దోహదం చేస్తాయి.

## గురుత్వాకర్షణ శక్తిలో వైవిధ్యాలు..



భూమిపై గురుత్వాకర్షణ శక్తిలో స్వల్ప వైవిధ్యాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇలాంటి తేడాలను గుర్తించడానికి తక్కువ భూమి కక్ష్యలో ఉన్న ఉపగ్రహంలో క్వాంటం గ్రావిటీ గ్రేడియోమీటర్ (క్యుజిజి)ని మోహరించాలని అమెరికన్ నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) శాస్త్రవేత్తల బృందం ప్రతిపాదించింది. ఇది గ్రహం యొక్క ఉపరితల ద్రవ్యరాశి పంపిణీని ఖచ్చితంగా పర్యవేక్షించడానికి, వాతావరణ అధ్యయనాలకు సహాయపడటానికి, జాతీయ భద్రతను పెంచడానికి వీలు కల్పిస్తుంది. గురుత్వాకర్షణ శక్తి అనేది ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువుల మధ్య సహజ ఆకర్షణ శక్తి. వస్తువులను ఒకదానికొకటి ఆకర్షించుకోవడానికి, గ్రహాలను కక్ష్యలో ఉంచడానికి, వస్తువులను నేలపై పడేలా చేయడానికి, భౌతిక శరీరాలకు బరువును కల్పించడానికి ఉపయోగపడుతుంది. గురుత్వాకర్షణ శక్తి ఒక వస్తువు ద్రవ్యరాశికి నేరుగా అనులోమానుపాతంలో ఉంటుంది. భూమి ద్రవ్యరాశి పంపిణీని బట్టి మారుతుంది. ఈ వైవిధ్యాలు సున్నితమైన పరికరాలు లేకుండా గుర్తించలేనంత సూక్ష్మంగా ఉంటాయి. గురుత్వాకర్షణ శక్తి రెండు వస్తువుల మధ్య దూరం యొక్క వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది (దూరం పెరిగే కొద్దీ, గురుత్వాకర్షణ ఆకర్షణ బలహీనపడుతుంది). కాగా, గురుత్వాకర్షణ శక్తి వైవిధ్యాలను గుర్తించడానికి గ్రావిటీ గ్రేడియోమీటర్‌ను ఉపయోగిస్తారు. ఇది ఒక నిర్దిష్ట దూరంలో గురుత్వాకర్షణ త్వరణంలో వైవిధ్యాన్ని కొలవడానికి ఉపయోగించే అత్యంత సున్నితమైన శాస్త్రీయ పరికరం. న్యూటన్ రెండవ సిద్ధాంతం ఎఫ్= ఎంఎ (F = ma) ఆధారంగా, గ్రావిటీ గ్రాడియోమీటర్ స్థానిక ద్రవ్యరాశి పంపిణీలో మార్పుల వల్ల కలిగే గురుత్వాకర్షణ శక్తి , త్వరణంలో వైవిధ్యాలను గుర్తిస్తుంది. వేగంగా పడిపోవడం అంటే కింద ఎక్కువ ద్రవ్యరాశి (ఉదా. పర్వతాలు), నెమ్మదిగా పడిపోవడం అంటే తక్కువ ద్రవ్యరాశి (ఉదా. గాలి పాకెట్స్ లేదా చమురు నిల్వలు) అని సూచిస్తుంది. న్యూటన్ రెండవ నియమం ప్రకారం, ఒక వస్తువుపై పనిచేసే శక్తి దాని ద్రవ్యరాశిని దాని త్వరణం (F = ma) తో గుణించగా వచ్చే దానికి సమానమని గుర్తుంచుకోవాలి. ఇలావుంటే, క్వాంటం గ్రావిటీ గ్రేడియోమీటర్ లేదా క్యుజిజి అంతరిక్షంలోని వివిధ పాయింట్ల వద్ద గురుత్వాకర్షణ త్వరణంలో తేడాలను కొలుస్తుంది. భూమిపై లేదా ఇతర ఖగోళ వస్తువులపై ద్రవ్యరాశి పంపిణీలో వైవిధ్యాల కారణంగా గురుత్వాకర్షణ ఎలా మారుతుందో ఇది గుర్తిస్తుంది. క్యుజిజి అణువులను దాదాపు సంపూర్ణ సున్నాకి (0 కెల్విన్, లేదా 273.15 C) చల్లబరుస్తుంది, దీనివల్ల అవి తరంగాల వలె ప్రవర్తిస్తాయి. లేజర్‌లు ఈ అణువులను తారుమారు చేస్తాయి. వాటి దశ మార్పు గురుత్వాకర్షణ శక్తులకు సున్నితంగా మారుతుంది. తరువాత ఇది గురుత్వాకర్షణ వ్యత్యాసాలను 10 m/s వరకు కొలుస్తుంది. గురుత్వాకర్షణలో సూక్ష్మ వైవిధ్యాలను గుర్తించడానికి వీలు కల్పిస్తుంది. హిమాలయాల వంటి పెద్ద భూరూపాల ద్రవ్యరాశి బలమైన గురుత్వాకర్షణ శక్తిని సృష్టిస్తుంది కాబట్టి , క్యుజిజి వాటి గురుత్వాకర్షణ ఆకర్షణను గుర్తించగలదు . ఇది వాటి ద్రవ్యరాశిపై ఖచ్చితమైన డేటాను అందించడానికి ఈ వైవిధ్యాలను కొలుస్తుంది. నీరు, మంచు, భూభాగాలలో మార్పులను ట్రాక్ చేయగలదు. ఇది వాతావరణ మార్పు, హిమనదీయ ద్రవీభవనాన్ని అధ్యయనం చేయడంలో కీలక భూమిక పోషిస్తుంది. అదనంగా, భూగర్భ హైడ్రోకార్బన్‌లు, ఖనిజాలు, జలాశయాలను గుర్తించడంలో సహాయపడుతుంది. వనరుల అన్వేషణకు మద్దతు ఇస్తుంది. ఇది వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను, భౌగోళిక ముప్పులను కూడా పర్యవేక్షించగలదు. జాతీయ భద్రతను మెరుగుపరుస్తుంది. ఖననమైన శిధిలాలు లేదా పురాతన నిర్మాణాలను తవ్వకం లేకుండా, విధ్వంసకాకుండా గుర్తించడానికి పురావస్తు శాస్త్రం, వారసత్వ పరిరక్షణలో కూడా క్యుజిజిని సాంకేతికతను ఉపయోగించవచ్చు. ఇది క్వాంటం సెన్సార్లు, ఉపగ్రహ సాంకేతికత, జియోఫిజిక్స్‌లో పురోగతిని కూడా పెంచుతుంది.

## మాస్ బ్లాక్ హోల్ ద్రవ్యరాశిని కొలిచేశారు..



భారత్‌కు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు దేవస్థల్ ఆప్టికల్ టెలిస్కోప్ (డిఒటి) సాయంతో, 4.3 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఒక మందమైన గెలాక్సీలో ఇంటర్మీడియట్ మాస్ బ్లాక్ హోల్ (ఐఎంబిహెచ్) ద్రవ్యరాశిని గుర్తించి ఖచ్చితంగా కొలిచారు. ఐఎంబిహెచ్‌లు మందమైన, మధ్యస్థపరిమాణ కాల రంధ్రాలు (మన సూర్యుని ద్రవ్యరాశికి 100 నుండి 100,000 రెట్లు), తరచుగా చిన్న గెలాక్సీలలో ఉంటాయి. పదార్థాన్ని చురుకుగా వినియోగిస్తున్నప్పుడు మాత్రమే బలమైన సంకేతాలను విడుదల చేస్తాయి. ఈ ఐఎంబిహెచ్ సూర్యుడి కంటే దాదాపు 22,000 రెట్లు ద్రవ్యరాశిని కలిగి ఉంది. చుట్టుపక్కల ఉన్న వాయు మేఘాలు 2.25 బిలియన్ కిలో మీటర్ల దూరంలో దాని చుట్టూ తిరుగుతున్నాయి. ఇది దాని గరిష్ట సైద్ధాంతిక రేటులో కేవలం 6 శాతం పదార్థాన్ని మాత్రమే వినియోగిస్తోంది. ఈ వివరాలను భారతదేశంలో అతిపెద్ద ఆప్టికల్ టెలిస్కోపైన డిఒటి గుర్తించింది. ఈ టెలిస్కోప్ ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లోని దేవస్థల్‌లో ఉంది. దీనిని 2016లో ప్రారంభించారు. దీనిని ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్ (ఎఆర్ఐఇఎస్) నిర్వహిస్తోంది. బ్లాక్‌హోల్స్ లేదా కృష్ణ బిలాలను గుర్తించడం, అధ్యయనం చేయడంలో ఈ టెలిస్కోప్ కీలక పాత్ర పోషిస్తున్నది. కృష్ణ బిలాలు అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి చాలా తీవ్రంగా ఉండటం వలన కాంతి కూడా తప్పించుకోలేని ప్రాంతాలు. ఒక భారీ నక్షత్రం దాని జీవితాంతం దాని స్వంత గురుత్వాకర్షణ శక్తి కింద కూలిపోయినప్పుడు బ్లాక్ హోల్స్ ఏర్పడతాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇవి చాలా దట్టమైన వస్తువును సృష్టిస్తాయి. దాని నుంచి కాంతి కూడా ప్రసరించలేదంటే, ఆ గాఢతను ఊహించుకోవచ్చు.

# ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరం

### శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్

### సిపిఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



సూర్యాపేట



వరంగల్



కరీంనగర్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు చేసిన మారణహోమం హేయమైన చర్య అని, ఇది దేశానికి ప్రమాదకరమని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉగ్రవాదం దిష్టిబొమ్మ ను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం కన్నా మానవత్వం గొప్పదని, మనిషి మానవత్వంతో జీవించాలని ప్రగతిని కాక్షించాలన్నారు. పహల్గాం దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వాలు అదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రాము, కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దేవర మల్లేశ్వరి, దేశగాని హేమలత, పెంద్ర కృష్ణ, తాళ్ళ సైదులు, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ ప్రతినిధి :** ఉగ్రవాదులను, ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, దొడ్డి సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బ్రాహ్మండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, నాయకులు గామినేని సత్యం, పిట్టల శ్రీనివాస్, కొట్టె అంజలి, భారతి, తంగెళ్ల సంపత్, నల్లగొండ శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ ప్రతినిధి :** కశ్మీర్‌లో సామాన్యులపై ఉగ్రదాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. వరంగల్ పట్టణంలోని చౌరాస్తా, హెడ్ పోస్టాఫీస్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో పెహల్గాం మృతులకు నివాళలర్పించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, బుస రవీందర్, గుండె భద్రి, ల్యాదల్ల శరత్, యండి అక్బర్‌పాష, జాన్ పాల్, పరికరాల రమేష్, నాయకులు సుంకరి భవాని, నల్లతీగల కుమార్, యండి యాకుబ్, సువర్ణ చిరంజీవి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం టౌన్ :** పెహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడి భారతదేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రని, ఈ కుట్రలను సమిష్టిగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి అన్నారు. పెహల్గాంలో యాత్రికులపై జరిగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొత్తగూడెం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్ సెంటర్లో మానవహారం నిర్మించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమర్ ఫరూక్, అబ్దుల్ రబ్, ఎండి షరీఫ్, ఎండి అబిద్, అమీర్ ఖాద్రి, జావేద్, ఎండి అయూబ్, అన్వర్, బాబు జానీ పాల్గొన్నారు.

**హనుమకొండ ప్రతినిధి :** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో), అరసం, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల కాల్పులలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించాలని, ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిటిఎఫ్ పూర్వ రాష్ట్రకార్యదర్శి సోమయ్య, భారత్ బచావో జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం. వెంగళ్‌రెడ్డి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, అయిప్సో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీహరి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, న్యాయవాది వేణు గోపాల్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, అరసం జిల్లా అధ్యక్షుడు నిధి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, డాక్టర్ ఎం.సారంగపాణి, సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి, వేల్పుల సారంగపాణి, బి. ప్రవీణ్ కుమార్, ఎండి. రఫి, ఉస్మాన్ పాషా, గోపి తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ ప్రతినిధి :** కుల మతాలకతీతంగా ఉన్న లౌకిక భారత దేశంలో ఉగ్రదాడులకు సహించేది లేదని సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య అటన్నారు. సిపిఐ, ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అమరులైన భారత పౌరులకు నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నర్సింగరావు, చక్రపాణి, హన్మాండ్లు, అజీజ్, భానుచందర్, రఘురాంనాయక్, అంజలి, సభ్యులు పాల్గొన్నారు.



కొత్తగూడెం



హనుమకొండ



నిజామాబాద్

# బిజెపిని గద్దెనెక్కించాలన్నదే బిఆర్ఎస్ ప్రయత్నం

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బిజెపిని గద్దెనెక్కించాలన్నదే బిఆర్ఎస్ ప్రయత్నమని సిపిఐ మహబూబాబాద్ జిల్లా సెక్రటరి బి.విజయసారథి ఆరోపించారు. శుక్రవారం సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అధ్యక్షతన స్థానిక వీరభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా విజయసారథి మాటాడుతూ రాష్ట్రంలో బిజెపి బిఆర్ఎస్ ఒక్కటేనని, లోపాయకార ఒప్పందం చేసుకున్నరని, రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దెనెక్కించేందుకు బిఆర్ఎస్ పార్టీ నానా ప్రయత్నాలు చేస్తోందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా 3వ మహాసభలు జూలై 5,6తేదీల్లో కురవి మండల కేంద్రంలో జరుగుతాయని, ఈ మహాసభ విజయంతం చేయడానికి, వేలాదిగా కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈమహాసభల్లో ప్రజలు సమస్యలను భవిష్యత్ పోరాటాలను చర్చించి ముందుకు పోతామని దిశా నిర్దేశం చేశారు. కశ్మీర్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పెహల్గాంలో మరణించిన వారికి సిపిఐ జిల్లా సమితి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. 26న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో శాంతి ర్యాలీలు చేయాలన్నారు. మే డే వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మ డివిజన్ చైర్మన్‌గా ఎన్నికైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, నెల్లూరు నాగేశ్వరావు, తండ సందీప్,చొప్పరి శేఖర్, బైస స్వామి, సారిక శ్రీనివాస్, జంపాల వెంకన్న, వెలుగు శ్రావణ్, బానోతు లింగ్యానాయక్, ఎండి ఫాతిమా, మాలోతు రవీందర్, జలగం ప్రవీణ్, చిర్ర సత్యనారాయణ, లక్ష్మణ్, వంకాయలపాటి చిరంజీవి, నాదెండ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.



# మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు పోరాడుదాం

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణకు కార్మిక లోకం పోరాడాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. మేడే పోస్టర్లు శివనగర్ తమ్మరభవన్‌లో శుకవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ మేడే వరంగల్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో, నియోజకవర్గ కేంద్రాలలో కార్మికుల ప్రాంతాలలో మేడే జెండాలు ఎగురవేయాలని కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా దాదాపు 180 దేశాలు మేడే దినోత్సవాన్ని జరుపుకుంటాయన్నా రు. 1886 వ సంవత్సరంలో పని గంటల కొరకు చికాగోలో మొదలైన పోరాటంలో కార్మికుల రక్తం నుండి ఉద్భవించిందే ఎర్రజెండా అన్నారు. దేశంలో మొదటిసారిగా ఎఐటియుసి నాయకులు, కమ్యూనిస్టు నేత సింగారవేలి శెట్టి ఆర్ 1923వ సంవత్సరంలో మద్రాసు నగరంలో మేడే జెండా ఎగరవేశారన్నారు. మే డే స్ఫూర్తితో భవిష్యత్తులో కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలన్నారు. ఎందరో మహా మహానీయులు కార్మికుల హక్కుల సాధనకు, 12 గంటల పని దినాలు పోయి ఎనిమిది గంటల పని దినాలు రావాలని అమరత్వం పొందారని, వాటి త్యాగాలతోనే నేడు మేడే జెండా అని, ప్రపంచ కార్మికులకు మే డే పండుగ దినోత్సవం మే1 ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, ఎండి యాకోబ్, గోవర్ధన్, పరికిరాల రమేష్, ఉప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నేడు సిపిఐ బహిరంగ సభ

*ఖమ్మంలో హాజరు కానున్న కూనంనేని, పువ్వాడ, బాగం
*1000 మందితో ర్యాలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26న ఖమ్మం నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖుడు వరద నర్సింహారావు తన 1000 మంది అనుచరులతో సిపిఐలో చేరుతున్న సందర్భంగా ఈ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీనిని పురస్కరించుకుని ఖమ్మం మున్సిపాలిటీ సెంటర్ నుంచి అల్లిపురం రోడ్డులోని బహిరంగ సభ స్థలి వరకు 1000 మందితో ర్యాలీ నిర్వహించనున్నారు. బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సీనియర్‌నాయకులు,మాజీ ఎంఎల్‌ఎ,సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానాతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని జానిమియా తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

## నేడు భూభారతి పై అవగాహన

**ప్రజాపక్షం/సుజాతనగర్:**రాఘవాపురం రోడ్డు లోని రైతు వేదిక లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం పై అవగాహన నేడు మధ్యాహ్నం రెండున్నర గంటలకు నిర్వహించనున్నట్లు సిపిఐ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్‌విపాటిల్, ఆర్‌డిఒతోపాటు ఇతర రెవిన్యూ అధికారులు హాజరుకానున్నారని, కావున సిపిఐ జిల్లా కౌ న్సిల్ మెంబర్స్, మండల కౌన్సిల్ మెంబర్స్, ఎఐటియుసి, అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్), రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల నా యకులు, కార్యకర్తలు, నాయకులు, రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని కోరారు.

## నేడు సత్తుపల్లి పట్టణ బంద్


**ప్రజాపక్షం/సత్తుపల్లి:**జమ్ము కాశ్మీర్ లోని పెహల్‌గామ్‌లో తీవ్రవాదులు దుశ్చర్యకు పాల్పడి హిందువులను హతమార్చిన సందర్భంగా మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ నేడు సత్తుపల్లి పట్టణ బంద్‌కు భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగాబిజెపి నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 140 కోట్ల మంది ప్రజలు మద్దతు తెలియజేస్తున్న సందర్భంగా, సత్తుపల్లి పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు అందరూ స్వచ్ఛందంగా మీ యొక్క వ్యాపార సముదాయాలను మూసివేసి అమరులైన 28 మంది కుటుంబాలకు అండగా ఉండాలని కోరుతూ నేడు సత్తుపల్లి పట్టణం బంద్ ప్రకటించడం జరిగిందన్నారు.

## మండల, గ్రామ సమాఖ్యలు తనిఖీలు



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరులోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మండల గ్రామ సమైక్యల లావాదేవీల పుస్తకాలను శుక్రవారం కెసికెఆర్ కంపెనీ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సమైక్యలలో ఉన్న నగదు తీర్మానం, లోన్ తీర్మానం పుస్తకం 11 రకాల పుస్తకాలు, మండల సమైక్యకు సంబంధించిన 20 రకాల పుస్తకాలు ను 2024 ఏప్రిల్ నుంచి 2025మార్చి వరకు బహిర్గత తనిఖీలు నిర్వహించారు. కెసికెఆర్ హైదరాబాద్ కంపెనీకి చెందిన రాఘవరెడ్డి, గంగాధర్, డిఎంజి జిల్లా అధికారి జనార్దన్లు ఆదాయ వ్యయాలు, లాభనష్టాలు తెలియజేసే తనిఖీలను పూర్తిస్థాయిలో చేశారు. అనంతరం తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను వివరాలపై సమీక్ష సమావేశం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విఒఎలు,సిసిలు పాల్గొన్నారు.

## రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు



**ప్రజాపక్షం/కొణిజర్ల:**మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలోగల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్సెల్ ఆర్ ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రయివ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నాల్గవ సంవత్సరం చదువుతున్న వివిధ విభాగాల విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. రిక్రూట్‌మెంట్ డ్రయివ్‌ని మూడు రౌండ్స్‌లో నిర్వహిస్తున్నారు. మొదటిది రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్‌రౌండ్స్ ఈ డ్రైవ్ లో సుమారు 150 మంది పాల్గొన్నట్లు తెలిపారు. సీనియర్ హెచ్ ఆర్ ఆర్ అవినాష్ నిర్వహించిన ఈ డ్రయివ్‌లో రెండో రౌండ్‌లో 90 మంది విద్యార్థులు అర్హత సాధించారు. చివరి రౌండ్ లో 30 విద్యార్థిని, విధ్యార్థులు ప్లేస్ మెంట్స్ సాధించారు. ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చిన్నయ్య అభినందించారు. డ్రయివ్‌లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి విజయలక్ష్మి అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణ్, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్‌బాబా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## 'దేవుడి మాన్యం భూమి'కి సర్వే నిర్వహించిన అధికారులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామం నందు గల శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం మాన్యం భూమిని శుక్రవారం పాపకొల్లు రెవెన్యూ పరిధిలోని గుండ్లరేవు, రాంపురం గ్రామాల సరిహద్దు నందుగల సర్వే నెంబర్ 1050 నందు 4 00 ఎకరాలు, 1051 నందు 6 16 ఎకరాలు మొత్తం 1016 ఎకరాల దేవుడి మాన్యం భూమిని సర్వే నిర్వహించి హద్దులు పెట్టారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బెల్ సింగ్, దేవాదాయశాఖ సర్వేయర్ అనిల్ కుమార్, జూలురుపాడు రెవెన్యూ సర్వేయర్ ప్రవీణ్, ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయ ఈవో వెంకటరావు, జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, కల్లూరు టెంపుల్ ఈవో సూర్య ప్రకాష్ రావు, నాచారం టెంపుల్ ఇఒ శేషయ్య, అన్నపురెడ్డిపల్లిఇఒ వెంకటరమణ, ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ కోదుమూరి కోటేశ్వరరావు,టిపిసిసి జిల్లా సోషల్ మీడియా చైర్మన్ నవీన్ రాథోడ్, ఆలయ సిబ్బంది బి. సంపత్, దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, గ్రామస్తులు, భూమి హద్దు దారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు బీట్ ఆఫీసర్లు సస్పెన్షన్

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లెందు డివిజన్‌లోని కొమరారం రేంజ్ పరిధిలోని ఇద్దరు అటవీశాఖ బీట్ ఆఫీసర్లను విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటంతోడిఎఫ్ఒకృష్ణ గౌడ్ సస్పెండ్ చేశారు. పోడు భూముల విషయంలో నిర్లక్ష్యం వహించారని బీ.నగేశ్ సర్వాపురం బీట్, జోగ చంద్రయ్య ఎల్లాపురం బీట్‌లను ఇంచార్జి రేంజ్ ఆఫీసర్ చలపతిరావుడిఎఫ్ఒ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వం మారినా సమస్యలు తీరలేదు

టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ , ఏలూరి



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్రభుత్వం మారిన ఉద్యోగుల సమస్యలు మాత్రం తీరలేదని టిజిఇజెఎసి రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు అన్ని శాఖలకు సంబంధించి 206 ఉద్యోగ సంఘాలు జెఎసిగా ఏర్పడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టినట్లు వారు తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదని అందుకే జిల్లా స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా శుక్రవారం ఖమ్మం టిజిఇజెఎసి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అదేవిధంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సుమారు ఎనిమిది వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలు నెలకు కొంత మేర విడుదల చేస్తామని చెప్పి ఇంత వరకు అందించ లేదన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారని , నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీలు, పదోన్నతులు, కొత్త రిక్రూట్‌మెంట్లు చేసిందని దానిని స్వాగతిస్తున్నామని అదే రీతిలో ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మే నాలుగున రాష్ట్ర స్థాయి సదస్సును, జూన్ తొమ్మిదిన 13 లక్షల మంది ఉద్యోగులతో మహా ధర్నాను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. టిజిఇజెఎసి ఖమ్మంజిల్లా అధ్యక్షులు , కన్వీనర్ కస్తాల , వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భారీ ర్యాలీ, సదస్సు :**రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఖమ్మంజిల్లా ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం టిజిఇజెఎసి ఆధ్వర్యంలో ఖమ్మం సమీకృత కలెక్టరేట్ నుంచి టిఎన్‌జిఒస్ ఫంక్షన్ హాల్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యా లీలో వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నేతలు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు. ర్యాలీని రాష్ట్ర జెఎసి జనరల్ సెక్రటరీ ఏలూ రి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఖమ్మంలోని అంబేద్కర్ విగ్రహానికి ఉద్యోగ సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా రాష్ట్ర జెఎసి అధ్యక్ష, కార్యదర్శులు మా ట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోస ం రాష్ట్ర జెఎసి ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ఉద్యమాల గడ్డ ఖమ్మం నుంచి సదస్సు ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించి మే నాలుగు న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తామని వారు తెలిపారు.

## వాడ వాడలా 'మేడే'ను జరపండి

సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా



**ప్రజాపక్షం/ఖమ్మం:**139వ మేడే ఉత్సవాలను ఖమ్మం నగరంలో వాడ వాడలా నిర్వహించాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నగర ముఖ్య కార్యకర్తల సమావేశం మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జానిమియా మాట్లాడుతూ 139వ మేడే ఒక ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతుందన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులకు బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇస్తుందని ఆయన తెలిపారు.కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నంలో బిజెపి సర్కార్ ఉందని మరో పక్క దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి రంగాలు వట్టిపోతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే 139వ మేడే సందర్భంగా భవిష్యత్తు పోరాటాలకు ప్రతీన బూనాలని జానిమియా తెలిపారు. గతంలో అనేక పోరాటాలకు ఎర్ర జెండా నాయకత్వంవహించి హక్కులు సాధించిందని అటువంటి ఎర్రజెండా నీడన మరోసారి ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావాలన్నారు. మే ఒకటిన వాడ వాడలా అరుణ పతాకాలను ఆవిష్కరించాలని కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావులతో కలిసి ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ,సిపిఐ జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డిఎంఅండ్‌హెచ్ఒ కళావతి బాయి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆసుపత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. శుక్రవారం డిఎంఅండ్‌హెచ్ఒ కళావతి బాయి ఖమ్మం నగరంలోని సురక్ష ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఒపి, ఐపి రిజిస్టర్లను చెక్ చేసి ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించి అన్ని అనుమతులను పరిశీలించారు. స్టాఫ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆఫీస్‌కు తెలియజేయాలని సూచించారు. ఆసుపత్రికి మరల వస్తామని ఆలోగా ఆసుపత్రిలో అన్ని విభాగాలు, రిజిస్టర్లు, ల్యాబ్ పద్దతి ప్రకారం ఉంచాలని లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు, రిజిస్ట్రేషన్లు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రుల నిర్వహణ ఉండాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒడాక్టర్ సైదులు, పివో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో , సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యశోద ఆసుపత్రిలో అరుదైన వైద్య చికిత్స




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సోమాజీగూడలోని యశోద ఆసుపత్రిలో అరుదైన వైద్య చికిత్స నిర్వహించినట్లు ప్రముఖ పల్మోనాలజీ వైద్య నిపుణులు విశ్వేశ్వరరావు బాలసుబ్రహ్మణ్యం (ఎం డి డిఎన్‌బి, డిఎం, పల్మనాలజీ గోల్డ్ మెడలిస్ట్, ఫెలోషిప్ ఇన్ స్లిప్ మెడిసిన్ గోల్డ్ మెడలిస్ట్, ఫెలోషిప్ ఇన్ ఇంటర్నేషనల్, పల్మనాలజీ మల్లేషియా) తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో డాక్టర్ విశ్వేశ్వర రావు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ఐదేండ్లుగా సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో సీనియర్ కన్సల్టెంట్ ప ల్మోనాలజీస్టుగా పనిచేస్తున్నానని ఆయన తెలిపా రు. ఖమ్మం నుంచి మూడు నెలల క్రితం వెంకటరాములు అనే రోగి కడుపులో బాగా రక్తం వచ్చి సీరియస్ కండిషన్‌లో యశోద ఆసుపత్రికి వచ్చారన్నా రు. అతనికి వెంటనే ప్రోపోస్కోప్ టెస్టింగ్ చేశామని ఇది చాలా అడ్వాన్స్, వ్యాలీబుల్ అన్నారు. ఈ ప్రో పోస్కోప్ టెస్టింగ్ వల్ల కడుపులో ఎక్కువగా ఎక్కడ నుంచి రక్తం వస్తుందో ఆ ప్రాంతాన్ని గుర్తించవచ్చునన్నారు. అలా గుర్తించి రక్తం ఎక్కువగా రాకుండా కంట్రోల్ చేసేందుకు చికిత్స అందించవచ్చునన్నా రు. ఇది చాలా అడ్వాన్స్ అని కంట్రోల్ చేసిన త ర్వాత రక్త పరీక్షలు చేయగా ఆటోయూమి నుండి ర క్తం వచ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. కోటిలో ఒక్కరికి ఇలా వస్తుందన్నారు. దీనిని శరీరం ఐడెంటి చేయలేదని చాలా మంది దగ్గు వచ్చినప్పుడు నోట్ల నుంచి రక్తం వస్తే అది క్యాన్సర్, లంగ్స్ ప్రాబ్లం, టిబి అనుకుంటారని కానీ అలాంటిది కాదన్నారు. ఎక్కువ మంది రోగులు ఆక్సిజన్ తగ్గి వెంటిలేటర్‌పై ఉంటారని ఆయన తెలిపారు. ప్రస్తుతం వెంకటరాములుకు నూతన టెక్నాలజీతో వైద్య చికిత్స అందించామని ఇప్పుడు రోగికి రక్తం రావడం తగ్గిందని అతని పరిస్థితి బాగానే ఉందని అబ్జర్వేషన్‌లో ఉంచామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సోమాజీగూడ బ్రాంచ్ కార్పొరేట్ రిలేషన్‌షిప్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రావు, మేనేజ్‌మెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై వెల్లువెత్తిన నిరసన

*సిపిఐ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన
*టెర్రరిస్టు దాడికి కేంద్రమే బాధ్యత వహించాలి:సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జమ్ము కశ్మీర్‌లోని పెహల్గాం లో జరిగిన ఉగ్రదాడిపై నిరసన వెల్లువెత్తింది. సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో అమరవీరుల స్తూపం వద్ద భారీ మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినదించారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశ పౌరులపై జరిపిన దాడిని పిరికి పంద చర్యగా అభివర్ణించారు. భారత పౌర సమాజం ఈ దాడిని సహించబోదని ఆయన తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని హిందు, ముస్లిం అనే తేడా లేకుండా పాశవికంగా 28 మందిని హతమార్చారని పాషా తెలిపారు. దుర్మార్గుల పన్నాగాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కొందరు ఈ మారణ హోమాన్ని రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండించి శాంతి కోసం ముందుకు సాగాలన్నారు. పాక్ సైన్యాధికారి ఉగ్రవాద కమాండర్ రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసినప్పుడు వారి దుశ్చర్యను పసిగట్టడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఇందుకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,దాట్ల శ్రవణ్, రాంజీ, గోనే సురేష్ పాల్గొన్నారు.




## ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

* కేసుల పురోగతి, రికార్డుల పరిశీలన
* వేసవిలో దొంగతనాలు అరికట్టేందుకు పలు సూచనలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని కేసులో పురోగతి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణను కలియతిరుగుతూ సీజ్ చేసిన వాహనాలను డీఎస్పీ చంద్రభాను, సిఐ బత్తుల సత్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి నమోదైన కేసుల పురోగతి, రౌడీ షీటర్ల ప్రస్తుత కదలికల వివరాలును తెలుసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ పోలీస్ టెక్నాలజీ పరంగా ముందుందని, క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. డయల్ 100, బ్లూకోర్ట్, పెట్రోలింగ్ విభాగాల సిబ్బంది పనితీరును పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. వేసవిలో అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలను చేయడం జరిగిందన్నారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి దొంగతనాలకు తావివ్వకుండా ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆప్రాంతాల్లో గస్తీ పెంచడం జరుగుతుందన్నారు. పట్టణంలో, గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇల్లెందు డిఎస్‌పి,సిఐ , ఎస్‌ఐలు , సిబ్బంది పాల్గొన్నారు.

## కెసిఆర్‌ది ఆశయశుద్ధి

* కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
* బిఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
* బిఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎంఎల్‌సి తాతా మధుసూదన్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కో సం మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ఆశయ శుద్ధితో, చిత్తశుద్ధి తో, గాంధేయ మార్గంలో ఉద్యమం చేసి రాష్ట్ర ఏర్పాటును స హకారం చేశారని ఖమ్మంజిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ తెలిపారు. 24 ఏళ్లలోకెసిఆర్ ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొన్నారని ఎంఎల్‌సి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని బిఆర్‌ఎస్‌కార్యాలయంలో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్ మాట్లాడారు. తొలుత జమ్ము కశ్మీర్‌లోని పెహల్గాం లో ఉగ్రదాడిలో మరణించిన వారికి మౌనం పాటించారు. తెలంగాణ బిడ్డల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ఏర్పా టు సాధనే లక్ష్యంగా కెసిఆర్ చూపిన పటిమ మరువలేనిదన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పార్టీని స్థాపించి 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా తెలంగా ణ ఉద్యమానికి వేదికగా నిలిచిన వరంగల్ జిల్లాలో ఆదివా రం రజతోత్సవ సభ జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో కాం గ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారన్నారు. 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్ర జల్లో తీవ్ర వ్యతిరేక పెరిగిందన్నారు. ఆదివారం వరంగల్ జి ల్లాలో జరిగే రజతోత్సవ బహిరంగ సభకు ఖమ్మంజిల్లాలోని ఐదు నియోజక వర్గాల నుంచి బిఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**ధాన్యం కొనుగోళ్లలో రాజకీయ వివక్ష : మాజీ ఎంఎల్‌ఎ సండ్ర**
ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వివక్ష చూపుతుందని మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి బస్తాలు ఇందిరమ్మ కమిటీలకు అప్పగించారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నడుపుతున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని ఇప్పటికైనా ధాన్యం కొనుగోలుపై శ్రద్ధ వహించాలని తెలిపారు. మాజీ ఎంఎల్‌ఎ కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం వరంగల్‌లో జరగనున్న రజతోత్సవ బహిరంగ సభకు ఖమ్మంజిల్లా నుంచి బిఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.మాజీ ఎంఎల్‌ఎలు , డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ జెడ్‌పిటిసి వరప్రసాద్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మగ్బూల్, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్‌బిఐటి'లో అరోహన్ టెక్నికల్ ఫెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో అరోహన్ 2025 పేరుతో టెక్నికల్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను జెఎన్‌టియు రిటైర్డ్ ప్రొఫెసర్ కెఎం లక్ష్మణ్‌రావు, టెక్స్ స్కై సిఇఒ బత్తినేని స్వాతి, టాస్క్ ప్రాజెక్టు మేనేజర్ బాలు ప్రవరాఖ్య, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో చొచ్చుకుపోతుందన్నారు. ఎఐపై విద్యార్థులకు పూర్తి అవగాహన అవసరమని దానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎఐ ఆధారితంగా మలుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు వారు పొందవచ్చునన్నారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు నూతన అవకాశాల కల్పనలో భాగంగాఇన్ఫోసిస్,ఐబిఎం,టాస్క్,ఐటిసిఅకాడమీ, మ్యాంగో డిబి, హనివెల్ తదితర ప్రముఖ కంపెనీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విశిష్ట అతిథి బత్తినేని స్వాతి మాట్లాడుతూ తాను ఎస్‌బిఐటి కళాశాల పూర్వ విద్యార్థినని ఈ కార్యక్రమానికి అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. టాస్క్ ప్రాజెక్టు మేనేజర్ బాలు ప్రవరాఖ్య మాట్లాడుతూ ఎస్‌బిఐటి విద్యార్థులు ఎక్కువ మంది నూతన సాంకేతిక ఆవిష్కరణల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో పాటు ప్రముఖ బహుళ జాతి కంపెనీల్లో ఉన్నత స్థానాలే లక్ష్యంగా వారికి తగిన సహాయ సహకరాలను అందించడానికి టిపిఒసెల్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అరోహన్ 2025 పలు సాంకేతిక పోటీలైనా పవర్ పాయింట్ ప్రజంటేషన్, స్లైడ్ డిక్, కోడ్ స్ప్రింట్, సర్క్యూట్రిక్స్, క్విజ్ తో పాటు నాన్ టెక్నికల్ పోటీలైన ట్రెజర్ హాంట్, స్నాప్‌సాట్ సాగా, ఫ్రైమ్‌ఫ్లెక్స్ మొదలగు వాటిలో ఖమ్మంజిల్లాలోని ఇతర కళాశాలల నుంచి వచ్చిన 69 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెమొంటోలు బహూకరించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్,ఎన్. శ్రీనివాసరావు, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS



వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బుధరావుపేటలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/ఖానాపూర్:** 25న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ మలేరియాదినోత్సవం సందర్భంగా మండలంలోని బుధరావుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ దామోదర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రజిత మాట్లాడుతూ అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది గొడిశాల భాస్కర్, జ్యోతి, భార్గవి, ప్రతిబ, బుధరావుపేట అంగన్‌వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## భూపోరాటంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** వచ్చే నెల 5న జరగబోయే సిపిఐ 8వ మండల మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో మండల మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ పేదల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. భూపోరాటంలో గుడిసెలు వేసుకున్న పేదలు ఇండ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అంపూర్తిగా వున్న దేవాదుల గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలని అన్నారు. రైతంగానికి పూర్తిస్థాయిల రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. స్వామి నాథన్ కమీషన్ సిఫారసులు కేంద్రం అమలు చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు వంద నుంచి 2వందలు పనిదినాలు కల్పించాలని కోరారు. మే 5న నిర్వహించే భీమదేవరపల్లి మండల మహాసభలకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి హాజరవుతారని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణలో జిల్లా సమితి సభ్యులు మంచాల రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, ఆదరి రమేష్, సన్నీల్ల రవి, మార్పు కృష్ణారెడ్డి, సుంచు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటన



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రాష్ట్ర పారా మెడికల్ బోర్డ్ సెక్రటరీ ప్రేమ్‌కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. అహ్మద్ నేతృత్వంలోని స్టేట్ టాస్క్ ఫోర్స్ బృందం జిల్లాలోని జనరల్ ఆసుపత్రి, కేంద్రీయ ఔషద స్టోర్స్, యుపిహెచ్‌సి, లింగాలఘనపురం, రఘునాథపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి భౌతికంగా ఉన్న మందుల స్టాక్‌ను, ఈ ఔషధి ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉన్న స్టాక్‌తో పోల్చి చూశారు. రికార్డులను తనిఖీ చేసి వాటిని ఎప్పటికపుడు నమోదుచేయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు.ఈ బృందం పర్యటనలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జున్ రావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

## ములుగులో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రపంచ మలేరియ దినోత్సవ ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా ప్రధాన హాస్పటల్ ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ మీటింగ్ వరకు, దోమల అంతం మన పంతం, దోమతెరలు వాడండి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, నీటి నిల్వలపై మూతలు పెట్టుకోవాలని, మొదలగు నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంకటాపురం(ములుగు) సిబ్బందితో ఏర్పాటుచేసిన మీటింగ్‌ను ఉద్దేశించి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచం మలేరియా దినోత్సవం జరుపుకోవడం ప్రజలలో అవగాహన పెంపొందించడం కొరకేనని అన్నారు. గ్రామాలలో గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయ సహకారాలను తీసుకొని దోమల వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. మలేరియా వ్యాధి తీవ్రత ఉన్న ప్రాంతాలకు దోమతెరలు పంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో సంపత్, ఏఎంఓ దుర్గారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాంబయ్య, సూపర్‌వైజర్ దేవమ్మ, నిర్మల మేరి, కమల, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, వెంకట్‌రెడ్డి, రాజయ్య, హరి హరినాత్, రవి, పూల్ బంద్, ఉమా, కౌసల్య, అప్సర, రమా, తిరుమల, కల్పన, ఉపేంద్ర, అనురాధ, శారధ, లత, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకటాపురం ఆరోగ్య కేంద్రాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన నినాదం మలేరియా అంతం మనతోనే

మరిపెడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి



**ప్రజాపక్షం/మరిపెడ:** మన నినాదం మలేరియా అంతం మనతోనేనని మరిపెడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బందితో మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ర్యాలీ చేసి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందని తెలిపారు.అనఫిలస్ అనే దోమలు కుట్టడం వల్ల మలేరియా జ్వరాలు వస్తాయని, గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలపరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి మంగళవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, వెంకన్న, సుదర్శన్, మాధవి, లక్ష్మి, సాయిశ్రీ, సిరి, వీరయ్య, నర్సయ్య, ఏఎన్ఎం సరథు, ఘాన్సీ శ్రీదేవి, నాగమణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రైతులకు వరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి /రేగొండ/కొత్తపల్లిగోరి :** భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రం లోని రైతు వేదిక, కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. అంతకుముందు భూ భారతి చట్టం అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ నమూనా ఇంటి పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడున్న అధికారులకు, గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. ఇంటి నిర్మాణ పనులకు నాణ్యతతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 54 మంది సిఎం రిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు రూ.22,25,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రవి, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు, రైతులు ఉన్నారు.

## ఉగ్రవాదుల చర్యలను పసిగట్టడంలో కేంద్రం వైఫల్యం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



**ప్రజాపక్షం / నర్సంపేట :** ఉగ్రవాదుల చర్యలను పసిగట్టడంలో కేంద్ర రక్షణ శాఖ వైఫల్యం చెందిదని, భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బ తీసేందుకు పాకిస్తాన్ కుట్రలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుడు పంజాల రమేష్ అన్నారు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు నర్సంపేట అంగడి సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్‌వరకు కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల చేతుల్లో మరణించిన 26మంది అమరులకు నివాళిగా సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ మాట్లాడుతూ పహల్గాం పర్యాటక ప్రాంతంలో పాకిస్తాన్ టెర్రరిస్టులు ప్రవేశించి అక్కడికి వచ్చినటువంటి పర్యాటకులను కాల్చి చంపడం అత్యంత ఘోరమైన చర్యని, కాశ్మీర్ లో పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టే విధంగా కేంద్ర రక్షణ శాఖ చర్యలు చేపట్టాలని, లేకపోవడం వల్ల ఇంటలిజెంట్ వర్గాలు నిఘా వ్యవస్థను సమర్థ వంతంగా చేపట్టకపోవడం వల్ల ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని ఇప్పటికైనా పాకిస్తాన్ కుట్రలను భగ్నం చేస్తూ, తీవ్రవాద కార్యకలాపాలను నిర్వీర్యం చేస్తూ దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లకుండా లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడంలో భారత పాలక ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని పాకిస్తాన్ చర్యలకు సరైన సమాధానం చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుళ్లపెల్లి మునీశ్వర్, అక్కపెల్లి రమేష్, మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, జిల్లా నాయకులు మియాపురం గోవర్ధన్, అయిత యాకయ్య, గడ్డం నాగరాజు, పిట్టల సతీష్, బాధరబో యాదగిరి, సాంబరాజు, కమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో పోరాటాలు

జనగామ మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మేడే రోజున అన్ని గ్రామాల్లో సిపిఐ, ఎఐటియుసి జెండాలు ఎగరవేయాలని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి మాజీ ఎంఎల్ఎ సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామలోని ఎఐటియుసి కార్మిక సంఘం కార్యాలయంలో మోటే శ్రీశైలం అధ్యక్షతన కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ 8 గంటల పనికోసం ఎప్రిల్ 25న చికాగో నగరంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటంలో యాజమాన్యాలకు అండగా ఉన్న పోలీసులు, కార్మికుల మధ్య ఘర్షన జరిగి పోలీసుల కాల్పుల్లో అనేక మంది మరణించారన్నారు. వారి రక్తంతో తడిసిన ఎర్రజెండా ఫలితంగానే 8 గంటల పని అమల్లోకి వచ్చిందని, గత 150 పంవత్సరాలకుగా మే 1న కార్మిక అమరుల్ని స్మరింస్తూ గ్రామాలు, పల్లెలు, వీది వీదిలో ఎర్రజెండాలు ఎగరవేయడం జరుగుతుందన్నారు. అటువంటి ఎర్రజెండా చేతబట్టిన సిపిఐ, ఎఐటియుసి, కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. 1886మే నెలలో విచక్షణ రహితంగా కార్మికు చేత 18 గంటల పనిచేయిస్తూ బానిసలుగా చూస్తుండేవారన్నారు. ఆ రోజుల్లో 18 గంటల పనికి వ్యదిరేకంగా అమెరికాలోని చికాగో నగరంలో పెద్దెఎత్తున కార్మికుల ఏకమై పోరాటం చేశారన్నారు. అక్కడ జరిగిన కాల్పుల్లో కార్మికుల రక్తం ఏరులై పారుతున్న తరుణంలో కార్మికులు తమ మీదున్న గుడ్డలను రక్తంలో ముంచి 8 గంటల పనికావాల్సిందే అని నినదించడం జరిగిందన్నారు. కార్మికుల పోరాటానికి భయపడిన యాజమాన్యాలు 8 గంటల పనిని అమల్లోకి తెచ్చాయన్నారు. కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల మెడపై కత్తిపెట్టి యాజమాన్యాలకు తొత్తులుగా మారి గతంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగుతుందని, దేశంలోకి కార్మికవర్గం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. మేడే సందర్భంగా ప్రతి కార్మికులు ప్రతిజ్ఞగా తీసుకొని ఊరూరా,,వాడవాడల్లో ఎర్రజెండాలు ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాస్, చామకూర యాకూబ్, గుండెల్లి రాజు, మరికుక్కల సాయిలు, గుట్టేడి రాజు, భూమల్ల ఐలయ్య, దయా నగేష్, బుడగె వీరస్వామి, యాకయ్య, తిప్పరబోయిన సిద్దులు, జనగామ షాప్స్ అండ్ గ్రేన్ మార్కెట్ హమాలీ యూనియన్, జనగామ అగ్రికల్చర్ మార్కెట్ హమాలీ యూనియన్, యశ్వంతాపూర్ ఎస్ డబ్ల్యూస్ గోదాం హమాలీ యూనియన్, వడ్డకొండ గోదాం హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**ఆది యాదగిరికి సిపిఐ సంతాపం**

సిపిఐ జనగామ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న సోదరుడు ఆది యాదగిరి శుక్రవారం ఆనారోగ్యంతో మృతి చెందగా సిపిఐ జనగామ జిల్లా పార్టీ సంతాపం ప్రకటించింది. యాదగిరి మృతికి విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన స్వగ్రామమైన అనంతారంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## మతోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/కాజీపేట :** కశ్మీర్‌లో టూరిస్ట్‌లపై మూకుమ్మడిగా హింసకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, మతోన్మాదాన్ని రూపుమాపాలని, ప్రజలందరూ మతాలకతీతంగా శాంతియుతతో ప్రజల కలిసిమెలిసి జీవించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. కాజీపేటలోని ఎఆర్ఆర్‌నగర్ సిపిఐ శాఖ మహాసభ రాసమల్ల దీన అధ్యక్షతన జరిగింది ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అనేక దశాబ్దాలు గడుస్తున్న పేదవాడు మరింత పేదవాడుగా, ధనవంతుడు మరింత ధనవంతులుగా కొనసాగుతూ దారిద్య దిగువరేఖకు కోట్లాదిమంది జీవిస్తున్నారు. విద్యా, వైద్యం కూడు నీడ.. ఉపాధి లేక దుర్భర జీవితం గడుపుతున్నారవి, ప్రపంచ కుబేర్లలో మన దేశానికి చెందిన కార్పొరేట్లు స్థానాలు కల్పించుకుంటున్నారు తప్ప మరొక పక్కా రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరాలలో వరంగల్ మహానగరం ఒకటని, మురికి వాడలలో జీవిస్తున్న నిరుపేదలకు పక్కా ఇల్లు కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహిస్తున్నా పాలక పక్ష పార్టీలు పేదలపై తీవ్ర నిర్లక్ష్యంతో వారికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్ర భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శాఖ సమావేశంలో హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ కాజిపేట్ మండల మహాసభ ఈనెల 30వ తేదీన మడికొండలో జయప్రదం చేయాలని, వచ్చేనెల మే 26, 27 తేదీలలో జరగబోయే సిపిఐ జిల్లా హనుమకొండ రెండో మహాసభలను అధిక సంఖ్యలో మండల కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మండల సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, హనుమకొండ జిల్లా బిఓసి బిల్డింగ్ నిర్మాణ కాంట్రాక్షన్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు రాస మల్ల దీన, సుదర్శన్, ఎర్ర జయ, సీనియర్ నాయకులు బరిగెల కుడి స్వామి పాల్గొన్నారు. ఎఆర్ఆర్ నగర్ శాఖ కార్యదర్శిగా సాలకుల స్వరూప, సహాయ కార్యదర్శిలుగా ఈసం పెళ్లి సాల్ మోహ న్, రామంచ స్వరూప, కోశాధికారి బరిగెల కుడి స్వామి, ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఈ మహా సభలలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.

# ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావొద్దు

అధికారులను ఆదేశించిన కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఆర్‌డిఒలు, పిడి, డిఆర్‌డిఒ, డిఎం సివిల్ సప్లయ్, డిసెస్‌ఓ, డిసిఒ, తహసీల్దార్లు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు, డిపిఎం, ఎపిఎం తదితర శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వయించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతి కొనుగోలు కేంద్రంపై కలెక్టర్ సమీక్షించారు. ఏ కేంద్రానికి ఎంత ధాన్యం వచ్చింది, ఇప్పటవరకు తేమశాతం చూసి కొనుగోలుచేసిన ధాన్యం ఎంత, నమోదు చేసిఇన ఓపిఎంఎస్ వివరాలను సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ తేమ శాతం రాగానే ధాన్యం కొనుగోలు చేసి ఓపిఎంఎస్ వివరాలను నమోదు చేసి ట్యాంగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. తేమ శాతం వచ్చినా కూడా ధాన్యం కొనుగోలు చేయకపోయినా, కొనుగోలు చేసిన ధాన్యం వవరాలు ఓపిఎంఎస్‌లో నమోదు చేయకపోయినా చర్యలు తప్పవన్నారు. అలాగే కొనుగో లు ప్రక్రియకు సంబంధించిన ప్రతి రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలన, ప్రతి రోజు అన్నికేంద్రాల్లోలో రిజిస్టర్‌ను పక్కాగా నిర్వయించాలన్నారు.

**మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి : కలెక్టర్**

జిల్లాలో మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారును ఆదేశించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిఇల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జనగామ బస్టాండ్ చౌరస్తా నుండి కలెక్టరేట్‌వరకు ర్యాలీ నిర్వయించారు. ర్యాలీని కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ప్రారంభించి మాట్లాడారు. మలేరియా అరికట్టాలంటే ప్రతి ఒక్కరికి అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయిలో నిర్వయించాలని, డ్రైడే ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ఈ సందర్భంగా మలేరియా నివారణకు కృషి చేసిన సిబ్బంది, టి రవీందర్, ఎస్‌యుఓ ముస్తఫా, ఫీల్డ్ వర్కర్ అలివేలు మంగ, ఎఎన్ఎం యాదలక్ష్మిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు, పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ కమల్‌హాసన్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయండి**

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. శుక్రవారం జనగామ నియోజకవర్గానికి సంబంధించి ఎంపికపై జరుగుతున్న క్షేత్ర స్థాయి పరిశీలనపై స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, ఆర్‌డిఓ గోపిరామ్, హౌసింగ్ పిడి మాతృనాయక్, డిఈ, మున్సిపల్ ఏఈ, కమీషన్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓలు, పిఆర్ ఏఈలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత మంది వెరిఫికేషన్ పూర్తి చేశారు, ప్రభుత్వ నియమనిబంధనలు పాటిస్తున్నారా, పూర్తి స్థాయి పారదర్శకంగా చేస్తున్నారా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 29 వరకు వెరిఫికేషన్ పూర్త చేయాలని, మే 2న గ్రామ పంచాయితీల్లో అర్హుల జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వెరిఫికేషన్‌లో టీంలో ఉన్న ఎంపిడిఓ , మండల వ్యవసాయ శాఖ అధికారి, పంచాయితీ రాజ్ ఏఈ, మున్సిపల్ పరిధిలో డిఈ, ఏఈలు పాల్గొనాలన్నారు.

## వడదెబ్బకు గురై మృతి చెందిన వారికి ప్రభుత్వం ఎక్స్‌షియో చెల్లించాలి

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వివిధ జిల్లాలలో వడదెబ్బకు గురై మృతి చెందిన నిరుపేద శ్రామిక కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌షియ చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రా మీణ ఉపాధి హామీపనులకు, వ్యవసాయపనులకు, చిన్నచిన్న వ్యాపారాల ని మిత్తం, ఇతర కూలినాలి పనులకు వెళ్లిన వారుఎండల తీవ్రత వల్ల, వేడి గా డ్పులకు వడ దెబ్బలకులోనై ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక కూలి పనులకు పోతే తప్ప కుటుంబం గడవని దుర్భరమైన పరిస్థితులలో పనులకు వెళ్లిన వారు ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పడిపోయి పిట్టల్లాగా రాలి పోతుండంతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని వారు పడుతున్న బాధలు వర్ణనా తీతమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనులను ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలనికోరారు. పనిచేస్తున్న సమయంలోమంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని నీడ కోసం టెంట్ వేయటం మొదలైన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న రోజులలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయిన ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌షియో చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్ బి ప్రతిమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## భూ సమస్యల సులభ పరిష్కారం భూ భారతితో సాధ్యం

మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** భూ సమస్యల తక్షణ, సులభ పరిష్కారం భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంతోనే సాధ్యమని, భూ భారతి చారిత్రాత్మక గొప్ప చట్టమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం25 అవగాహనా సదస్సు శుక్రవారం మహబూబాబాద్ కేసముద్రం మండలాల రైతు వేదికల్లో జరిగాయి. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, ఆర్‌డిఓ కృష్ణవేణి హాజరయ్యారు. తొలుత పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన టూరిస్టులకు రెండు నిముషాలు మోనం పాటించి నివాళులర్పించారు. తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి చదివి రైతులకు భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా చారిత్రాత్మక నూతన భూ భారతి చట్టం, సామాన్య ప్రజలకు క్షేత్రస్థాయిలోనే భూ సమస్యకు పరిష్కరం లభించే చట్టం నూతన భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టమని అన్నారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయశాఖ అధికారిని విజయనిర్మల, ఏడి సర్వేల్యాండ్ నరసింహమూర్తి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, రాగం ఎర్రయ్య, ఎంపిడిఓలు రఘుపతిరెడ్డి, క్రాంతి, ఏడిఏ శ్రీనివాస్, రైతులు వెంకన్న, యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ





## మహిళా వరల్డ్ కప్ సంగతేంటీ?

భారత్, పాకిస్థాన్ దౌత్య సంబంధాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని పొట్టనబెట్టుకోవడంతో దాయాదితో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడబోమని బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెగేసి చెప్పాడు. ఇదే విషయమై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు లేఖ కూడా రాసింది బిసిసిఐ. భవిష్యత్‌లో జరిగే ఐసిసి ఈవెంట్లలో ఇరుజట్లు ఒకే గ్రూప్‌లో ఉండకుండా చూడాలని ఐసిసికి విన్నవించింది. అయితే.. ఇదంతా సాధ్యమయ్యేనా? అనేది తెలియాల్సి ఉంది. ఎందుకంటే.. ఈ ఏడాది మహిళల వన్డే వరల్డ్ కప్ పోటీలకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. భారత గడ్డపై సెప్టెంబర్‌లో జరుగనున్న మహిళా వన్డే వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్థాన్ అమ్మాయిల జట్టు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో ఇండియా, పాక్ తలపడే మ్యాచ్ ఎక్కడ నిర్వహిస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే.. ఈమధ్యే ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ తరహాలో దాయాదిల మ్యాచ్‌ను తటస్థ వేదికపై నిర్వహించే అవకాశముంది. అంటే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికా, శ్రీలంక.. లేదంటే బంగ్లాదేశ్ గడ్డపై ఇండోపాక్ జట్లు తలపడేందుకు ఆస్కారముంది. కానీ, అందుకు ఇంకా సమయం ఉన్నందున బిసిసిఐ, పాక్ క్రికెట్ బోర్డులతో ఐసీసీ మాట్లాడనుంది. ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన వేదికను ఖరారు చేయనుంది. కానీ.. మహిళల వరల్డ్ కప్ కంటే ముందే పురుషుల ఆసియా కప్ ఉంది. దాంతో, ఈ టోర్నీని తటస్థ వేదికపై జరిపేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. దుబాయ్, శ్రీలంక గడ్డ పై ఆసియా కప్ పోటీలు జరిగే వీలుంది. ఒకవేళ భారత్, పాకిస్థాన్‌లు ఫైనల్ చేరితే.. లీగ్ దశ.. సూపర్ 4తో కలిపి ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు ఉంటాయి.

## సన్‌రైజర్స్‌ను ఊరిస్తున్న లక్ష్యం!



ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక పోరులో పంజా విసిరింది. టాస్ గెలిచి చెన్నై సూపర్ కింగ్స్‌ను బ్యాటింగ్ ఆహ్వానించిన కమిన్స్ సేన..పవర్ ప్లేలోనే ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. మూడు కీలక వికెట్లు కోల్పోయిన చెన్నైని డెవాల్డ్ బ్రెవిస్ (42), రవీంద్ర జడేజా(21)లు ఆదుకున్నాడు. అయితే.. హర్షల్ పటేల్(4 28) సీఎస్కే మిడిలార్డర్‌ను క్రీజులో నిలువనీయలేదు. ఆఖర్లో దీప్ హుడా(22) బ్యాటు ఝులిపించడంతో చెన్నై స్కోర్ 150 దాటింది. ఉనాద్కాట్ బౌలింగ్‌లో బౌండరీ బాదిన హుడా ఐదో బంతికి ఔట్ కావడంతో ధోనీ సేన 154 పరుగులకు ఆలౌట్ అయింది. వరుస ఓటములతో అట్టడుగున ఉన్న సన్‌రైజర్స్ చావోరేవో పోరులో చెలరేగింది. పేసర్లు కట్టదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెపాక్ స్టేడియంలో సూపర్ కింగ్స్‌ను భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేసింది. మహ్మద్ షమీ ఆదిలోనే బ్రేకిచ్చాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ షేక్ రషీద్()ను ఔట్ చేసి సీఎస్కేకు పెద్ద షాకిచ్చాడు. బంతిని స్లిప్‌లో ఆడిన రషీద్.. అభిషేక్ శర్మ చేతికి చిక్కాడు. కానీ, 17 ఏళ్ల ఆయుష్ మాత్రే(30) ఆత్మవిశ్వాసంతో ఆడుతూ ఎదురుదాడికి దిగాడు. కమిన్స్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో చెలరేగాడు. అయితే.. తడబడుతున్న సామ్ కరన్(0)ను హర్షల్ పటేల్ ఔట్ చేసి చెన్నైని ఒత్తిడిలోకి నెట్టాడు. కమిన్స్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడబోయిన ఆయుష్ సైతం పవర్ ప్లేలోనే ఔట్ కావడంతో సీఎస్కే కష్టాల్లో పడింది. 47 వద్ద మూడో వికెట్ పడిన సీఎస్కేను తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్డ్ బ్రెవిస్(42), రవీంద్ర జడేజా(21), శివం దూబే(12)లు ఆదుకున్నారు. ధాటిగ ఆడుతున్న జడ్డూనే కమిండ్ మెండిస్ ఔట్ చేయడంతో సీఎస్కే కోలుకోలేకపోయింది. ఆ కాసేపటికే బ్రెవిస్ మెరుపులకు హర్షల్ ముగింపు పలికాడు. హర్షల్ పటేల్ విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయిన చెన్నైకి దీపక్ హుడా(22) పోరాడగలిగే స్కోర్ అందించాడు. డెత్ ఓవర్లలో ధాటిగా ఆడిన అతడు 20వ ఓవర్లో ఫోర్ బాది ఔటయ్యాడు. దాంతో, 154 రన్స్‌కు ఆలౌటయ్యింది.



## 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదు


### పాక్‌కు గావస్కర్ చురక



పాక్‌కు గావస్కర్ చురక జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పలువురు భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ సంతాపం తెలియజేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరిగిన ఆర్సీబీ, ఆర్ఆర్ మ్యాచ్ అనంతరం సునీల్ గావస్కర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్పందించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదని, భవిష్యత్తులోనూ ఎలాంటి మార్పు ఉండదని పాక్‌కు పరోక్షంగా చురకలంటించారు. ''ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇది భారతీయులందరిపైనా ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను, వారికి మద్దతుగా నిలిచే వారిని ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నా. ఇదంతా ఏం సాధించడానికి చేస్తున్నారు? గత 78 ఏళ్లలో ఒక్క మిల్లీమీటర్ భూమినైనా కదల్చగలిగిరా? వచ్చే 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఎలాంటి మార్పులు ఉండవు. మరి ఎందుకు ప్రశాంతంగా జీవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మనం మరింత దృఢంగా ముందుకు సాగాలనేదే నా విజ్ఞాపన'' అని గావస్కర్ వెల్లడించారు.

## ఆయనకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే


– మనోజ్ బాజ్‌పేయి



వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి. 'ది ఫ్యామిలీ మ్యాన్'తో తెలుగు ఆడియన్స్‌కు మరింత చేరువయ్యారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న ఒడుదొడుకులను వివరించారు. తాను ఎన్ని సినిమాలు చేసినప్పటికీ రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నటించిన 'సత్య' తనకు ఎప్పటికీ ప్రత్యేకమేనన్నారు. ''నటుడిగా 'బండిట్ క్వీన్' నాకు మొదటి సినిమా. కానీ, నాకు గుర్తింపు వచ్చింది మాత్రం 'సత్య'తోనే. ఆ సినిమాలో నన్ను ఎంపిక చేసుకున్నందుకు రామ్ గోపాల్ వర్మకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. రోజూ ఆయన్ని గుర్తుచేసుకుంటుంటాను. ఆయనతో నేను వరుసగా నాలుగు సినిమాలకు పని చేశాను. మూడు చిత్రాల్లో నటించాను. ఒక దానికి నిర్మాతగా వ్యవహరించాను. ఆ దశే నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి, కొనసాగడానికి కారణమైంది'' అని చెప్పారు.

''ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు చూశాను. చిత్ర పరిశ్రమలో కొనసాగడం అంత తేలికైన విషయం కాదు. ఎంతో పోటీని ఎదుర్కోవాలి. మనల్ని చూసి అసూయపడేవారు ఉంటారు. మనతో నవ్వుతూ మాట్లాడుతూనే.. మన వెనక మనల్ని హేళన చేసే వారుంటారు. ఇలాంటి వాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాను. తొలినాళ్లలో దిగులుపడ్డాను. నేను నటించిన సినిమాలు అనుకున్న స్థాయిలో అలరించలేకపోతే కోపం వచ్చేది. ఇండస్ట్రీనే ప్రపంచం అనుకొని వచ్చాను. నటన తప్ప మరొకటి తెలియదు. ఏదేమైనా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకొని అన్నిటినీ తట్టుకొని నిలబడ్డాను'' అని తెలిపారు.

## 27న బెల్లంకొండ శ్రీను ఫస్ట్ లుక్!




మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఇపుడు పలు సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో భైరవం ఇంకా టైసన్ నాయుడు చిత్రాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇక ఈ సినిమాలు కాకుండా తన నుంచి ఉన్న మరో చిత్రం తన కెరీర్ 11వ సినిమా కూడా ఉంది. దర్శకుడు కౌశిక్ పగళ్ళపాటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంతో అనుపమ పరమేశ్వరన్ మరోసారి బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో మరోసారి నటిస్తుంది. అయితే ఇక ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి ఇపుడు మేకర్స్ డేట్‌ని ఫిక్స్ చేసేసారు. ఈ ఏప్రిల్ 27న ఈ సినిమా ఫస్ట్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తున్నట్టుగా డేట్ అనౌన్స్ చేసేసారు. మరి ఈ చిత్రంలో ఈ యంగ్ హీరో ఎలా కనిపిస్తాడో చూడాలి. ఇక ఈ చిత్రం కోసం ఇద్దరు సంగీత దర్శకులు సామ్ సిఎస్ అలాగే చైతన్ భరద్వాజ్‌లు సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# రీల్

## ఎన్టీఆర్ నీల్.. సలార్‌తో క్రాసోవర్ లేనట్టేనా?




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా సెన్సేషనల్ మాస్ దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి ముందు ప్రశాంత్ నీల్ చేసిన సినిమాలు సలార్, అలాగే కేజీఎఫ్ చిత్రాల పట్ల ఆ మధ్య అంతా నీల్ సినిమాటిక్ యూనివర్స్ పై పలు క్రేజీ రూమర్స్ ఏ రకంగా హల్చల్ చేశాయో అందరికీ తెలిసిందే. అయితే వాటి క్రాసోవర్ ఏమో కానీ నటుడు, సలార్ విలన్ పృథ్వీరాజ్ సుకుమారన్ మాత్రం సలార్ కి నీల్ నుంచి మరో సినిమాకి ఓ క్రేజీ క్రాసోవర్ ఉందని రివీల్ చేయడం ఓ రేంజ్‌లో అందరినీ ఎగ్జైట్ చేసింది. అయితే ఎలాగో కేజీఎఫ్‌లో లేదని అపుడు క్లారిటీ వచ్చింది కానీ ఇపుడు ఎన్టీఆర్ నీల్‌తో ఉండొచ్చు అని అనుకున్నారు కొందరు.

## అతనితో నాది ప్రత్యేక బంధం

– సమంత



ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. ''నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేను'' అన్నారు. అభిమానుల గురించి మాట్లాడుతూ.. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత తెలిపారు.

# సంయమనం పాటించండి

(మొదటి పేజీ తరువాయి)

దిగజారాయి. ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ అంతులేని దాడులను ప్రేరేపిస్తూ ఉండటంతో పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేందుకు భారతదేశం సన్నద్ధమవుతున్నది. ''పరిస్థితులు మరింత దిగజారకుండా రెండు దేశఋూలు సంయమనం పాటించాలి'' అని ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సమస్యలనైనా అర్థవంతమైన చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. పహల్గామ్‌లో కాల్పులకు బాధ్యులైన ఉగ్రవాదులను ఏరిపారేస్తామని, వారికి ఈ భూమ్మీద చోటు లేకుండా చేస్తామని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిజ్ఞ చేశారు.

## 'బ్లాంకెట్ స్టే' సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ప్రాథమిక హక్కులను వక్ఫ్ సవరణలు హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికన వక్ఫ్ (సవరణ)చట్టం 2025 చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను రద్దు చేయాలని కేంద్రం ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది.'న్యాయస్థానం ఈ సవాళ్లను పరిశీలిస్తున్న సమయంలో సాధారణ కేసులలో ముస్లిం సమాజానికి చెందిన సభ్యులు అలాంటి ఉత్తర్వు సంబంధిత విపరీత పరిణామాలు లేకుండా బ్లాంకెట్ స్టే (లేదా పాక్షిక స్టే) పిటిషన్లు విఫలమైతే ప్రత్యేకించి అలాంటి చట్టాల చెల్లుబాటు అంచనాను ఊహించిన సందర్భంలో పున: ప్రారంభించడాన్ని పిలువరాదు'అని కేంద్రం వాదించింది. ఫలితంగా చట్టంలోని నిబంధనలను నిలిపివేసేందుకు కేంద్రం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించింది.చట్టంలోని నిబంధనలను నిలిపివేయాలని కాకుండా మధ్యంతర ఆదేశాలు జారీచేయాలన్న పిటిషన్లను మే 5న సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించనున్నది. 2013 సంవత్సరం నుంచి వక్ఫ్ ఆస్తులు ఆశ్చర్యపోయేలా భారీగా పెరిగాయని ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముస్లిములు మైనారిటీలో ఉన్నందున ఈ చట్టాన్ని మార్చాలన్న వాదనలను కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో కొట్టిపారేసింది. పార్లమెంటరీ కమిటీ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం తర్వాతే వక్ఫ్ చట్టానికి సవరణలు చేసినట్లు కేంద్రం అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. మొఘల్ యుగం, స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం తర్వాత మొత్తం వక్ఫ్‌లు 18,29,163.896 ఎకరాల భూ మి సృష్టించినట్లు అఫిడవిట్ తెలిపింది. అయితే 2013తర్వాత దిగ్భ్రాంతికరంగా వక్ఫ్ భూమి అదనంగా 20,92,072.536కు పెరిగిందని చెప్పింది. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ 72పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఏప్రిల్ 17న సుప్రీం కోర్టు విచారణ జరిపింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులను ఇవ్వడానికి ముందు కేంద్రం వారం రోజుల గడువుకోరగా.. సుప్రీంకోర్టు అందుకు అంగీకరించింది.తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది.అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు కేంద్రానికి స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

## అలజడి (మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించి ఐదురోజులుగా వాటిని కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్‌జిల్లాలోని కొంత ప్రాంతం కూడా ఈ గాలింపు చర్యల పరిధిలోకి వచ్చింది. రాజధాని రాయ్‌పూర్‌కు 450 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో కూడా గాలింపు జరుగుతోంది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ నెం–1కు ఈ ప్రాంతం ప్రధాన కేంద్రంగా ఉందని భావిస్తున్నారు. హిడ్మా,దామోదర్ వంటి సీనియర్ మావోయిస్టు నాయకుల సారథ్యంలోతెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలకు ఈ ప్రాంతం ఆవాసంగా ఉందని ఇంటిలిజెన్స్ వర్గాలు అందించిన సమాచారం మేరకు భారీ ఎత్తున ఈ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ''ఇదెంతో కీలకమైన గాలింపు కార్యక్రమం, ఎందుకంటే దీంతో ఇక నిషేధిత సిపిఐ మావోయిస్టుల సైనికబలం అంతమైనట్టే. పిఎల్‌జిఎ బెటాలియన్ నెం–1ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేస్తున్నాం, మావోయిస్టుల సైద్ధాంతిక భావజాల నాయకత్వం దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి), తెలంగాణ స్టేట్ కమిటీ ఈ ప్రాంతంలో ఉన్నాయి'' అని ఆ అధికారి చెప్పారు. గురువారంనాడు జరిగినకాల్పుల యుద్ధంలో చాలామంది గాయపడి ఉండవచ్చు లేదా హతులై ఉండవచ్చునని అధికారి చెప్పారు. ఈ మొత్తం ప్రాంతాన్ని గాలింపు దళాలు చుట్టుముట్టాయన్నారు. ''ఈ గాలింపు చర్య ఒక టెస్ట్‌క్రికెట్ మ్యాచ్ లాంటిది, మేం ఉత్కంఠభరితమైన సమాచారాన్ని ప్రతి ప్రయత్నంలోనూ మేం సాధించలేం, అదువల్ల ఇది దీర్ఘకాలం కొనసాగుతుంది, కానీ ఆట చివరిల మాత్రం చాలా మంచి సానుకూల ఫలితాలు వస్తాయని మేం ఆశిస్తున్నాం'' అని ఆ అధికారి చెప్పారు. నక్సలైట్లవల్ల ఇబ్బందులు ఎదుర్కొనే రాష్ట్రాల ప్రభుత్వాలు, అధికారులు సహా దీని సూత్రధారి కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి అని చెప్పారు. ఇప్పటివరకూ దళాలన్నీ సురక్షితంగానే ముందుకు సాగుతున్నాయన్నారు. ఎలాంటి సమస్యలు, ఆటంకాలు ఇప్పటివరకూ రాలేదనీ, ఈ ఎండాకాలంలో దళాలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కానీ దళాల ఆత్మవిశ్వాసం మెండుగా ఉందన్నారు. తీవ్రమైన ఎండలతో వడదెబ్బకు గురైనందువల్ల కొంతమంది జవాన్లను ఇక్కడి నుండి ఆసుపత్రికి తరలించామన్నారు. గత ఏడాది జనవరి నెల నుండి ఇప్పటివరకూ భద్రతా దళాలు దాదాపు 350 మందికంటే ఎక్కువమంది నక్సలైట్లను గాలింపు చర్యల్లో కాల్చి చంపారు. వీరిలో ఎక్కువమందిని బస్తర్ రీజియన్‌లో కాల్చి చంపారు. మార్చి 29న బస్తర్ రీజియన్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 18 మంది మృతుల్లో 11 మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ జరిగిన వేరు వేరు కాల్పుల ఘటనలలో 144 మంది నక్సలైట్లను కాల్చి చంపారు. వీరిలో 128 మందిని ఏడుజిల్లాలలో విస్తరించి ఉన్న బస్తర్ ప్రాంతం నుండి నిర్మూలించారు.

## సిఎంలకు అమిత్ షా ఫోన్


(మొదటి పేజీ తరువాయి)

సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారతదేశం ప్రకటించింది. దీనితో పాటు, సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద పాకిస్తాన్ జాతీయులు భారతదేశానికి ప్రయాణించడానికి అనుమతించబడరని, ప్రస్తుతం ఎస్‌విఇఎస్ వీసా కింద భారతదేశంలో ఉన్న ఏ పాకిస్తానీ జాతీయుడైనా దేశం విడిచి వెళ్లడానికి 48 గంటల సమయం ఉందని ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. అయితే ఆ గడువు శుక్రవారంతో ముగిసింది. ఇదిలా ఉండగా, భారతదేశం పాకిస్తాన్‌పై దౌత్యపరమైన దాడిని ముమ్మరం చేయడంతో, పహల్గామ్ మారణహోమంలో పాల్గొన్న ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని, హంతకులను భూమిపై ఏ మూలనా ఉన్నా వెంబడిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గురువారం ఉద్ఘాటించారు. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత గురువారం నాడు బిహార్‌లోని మధుబనిలో తొలిసారి ప్రధాని మోదీ స్పందించారు. ఉగ్రవాదం శిక్షించబడకుండా ఉండదని, న్యాయం జరిగేలా చూసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని మోడీ ప్రతిజ్ఞ చేశారు. భారత్ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయదన్నారు. అదే విధంగా ఢిల్లీలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలకతీతంగా నేతలంతా ఉగ్రవాదం, ఉగ్రవాద శిబిరాలపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి వారి పూర్తి మద్దతును హామీ ఇచ్చారు. అదే సమయంలో, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలనే తన నిర్ణయాన్ని భారతదేశం పాకిస్తాన్‌కు తెలియజేసింది, పాకిస్తాన్ తన షరతులను ఉల్లంఘించిందని పేర్కొంది. జమ్ముకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ చేస్తున్న సీమాంతర ఉగ్రవాదం సింధు జలాల ఒప్పందం కింద భారతదేశ హక్కులకు ఆటంకం కలిగిస్తుందని జల వనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ పాకిస్తాన్ జలవనరుల కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజాకు రాసిన లేఖలో తెలిపారు.

## రేవంత్‌కు మినహాయింపు



**హైదరాబాద్ :** హైదరాబాద్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో బిజెపి పెట్టిన కేసు విచారణకు సిఎం రేవంత్‌రెడ్డికి హాజరు నుంచి హైకోర్టు శుక్రవారం మినహాయింపు ఇచ్చింది. పార్లమెంట్ ఎన్నికలప్పుడు కొత్తగూడెంలో గత ఏడాది మేలో నిర్వహించిన జన జాతర సభలో బిజెపి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను రద్దు చేస్తుందని రేవంత్ ఆరోపించారు. ఇది తమ పార్టీ పరువు దెబ్బతిసేలా ఉందని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ కేసును డిస్మిస్ చేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మ ణ్ శుక్రవారం విచారించారు. కౌంటరు దాఖలు చేయాలని వెంకటేశ్వర్లు, పోలీసులను ఆదేశించారు. విచారణను జూన్ 13కు వాయిదా వేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com